కొన్నిచోట్ల వలంటీర్లకు గిఫ్టులు ఇవ్వకపోవడంతో అసంతృప్తి

లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లకు రెండు నెలల నుంచి చెవిరెడ్డి డబ్బులు పంపిస్తున్నట్లు బహిరంగంగా చెబుతున్నారు. ఒక్కొక్కరికి రూ.5వేల చెప్పున మొదటి నెలలో డబ్బులతోపాటు గిఫ్టులు కూడా ఇచ్చారు. ఈనెలలో కేవలం డబ్బులు పంపారు. అయితే మార్చిలో గిఫ్టులు రాని చోట వలంటీర్లు స్థానిక నాయకులను ప్రశ్నించగా మనకు పంపలేదని వారు చేతులెత్తేశారు. దీంతో రెండు రకాలైన పంపిణీ ఏమిటంటూ వలంటీర్లలోనే చర్చ నడిచింది. దీనిపై కొందరు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.



ఒంగోలులో నిర్వహించిన చెవిరెడ్డి పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగానే ఖాళీగా ఉన్న కుర్చీలు (ఫైల్)

ఒంగోలు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై ఆపార్టీ నేతలు చిటపటలాడుతున్నారు. మమ్మల్ని నమ్మడు, మాకేం చెప్పడు, పెత్తనమంతా పరాయి వాళ్లకే ఇస్తున్నాడంటూ కిందిస్థాయిలోని నాయకులు గగ్గోలుపెడుతున్నారు. ఆయా పదవుల్లో ఉన్న వారికిచ్చే డబ్బు విషయంలోనూ వ్యత్యాసం చూపుతుండటంతో రగిలిపోతున్నారు. ఇంకోవైపు అసెంబ్లీ అభ్యర్థులతోనూ సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వీటన్నింటికీతోడు తాము చెవిరెడ్డి దూతలమంటూ ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్న వ్యక్తుల హడావుడితో నేతలు చికాకుపడుతున్నారు. పరిస్థితిని గమనించిన ముఖ్య నాయకులు మద్యం, డబ్బుతో మంచి ఊపు తెస్తాడు.. చూస్తుండండి అంటూ కిందిస్థాయి శ్రేణులకు ఆశలు పెట్టి వారిని సముదాయించే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో వైసీపీలో అంతర్గత సమస్యలు పెరిగిపోయి అలజడి ఆరంభమైంది.



చెవిరెడ్డి చికాకు!

అంతా నా ఇష్టం అన్నట్లు వ్యవహారశైలి



- వైసీపీ ఎంపీ అభ్యర్థిపై కేడర్ చిటపట
- అసెంబ్లీ అభ్యర్థులతో సమన్వయలోపం
- పెత్తనమంతా పరాయి జిల్లావారికే..
- మాకేమీ చెప్పడు.. ఎవరినీ నమ్మడు అంటూ నాయకుల గగ్గోలు
- డబ్బు పంపిణీలో వ్యత్యాసంపై ద్వితీయ శ్రేణి అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాజకీయంగా ఏపార్టీలోనైనా ఆయా స్థాయిలోని నాయకులు వారివారి ప్రాంతాల్లో తమ పెత్తనమే కొనసాగాలని ఆశిస్తుంటారు. ఒకరికి ఇద్దరు ముగ్గురు నాయకులు ఉంటే వారిని సమన్వయం చేసుకోవడం లేక వారిపై ఒక సమన్వయకర్తను నియమించడం ద్వారా పోటీలో ఉన్న అభ్యర్థులు ముందు కెళ్తుంటారు. అయితే ఇంతకు ముందు ఈ ప్రాంత నాయకులతో ఏమాత్రం పరిచయం లేని, ఇక్కడి పరిస్థితులు, వ్యవహారాలపై కనీస పరిజ్ఞానం లేని చెవిరెడ్డిని వైసీపీ రంగంలో దింపింది. రాజకీయ అనుభవం ఆయనకు ఉన్నప్పటికీ స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి తదనుగుణంగా ముందుకుపోకుండా తనదైన శైలిలో సాగుతున్నారు. ఆయా ప్రాంతాల వారితో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తే వంట మనుషులను సైతం తమ వారినే తెచ్చి భోజనాలు ఏర్పాటుచేయడంతోపాటు వేదికల ఏర్పాట్లలోనూ స్థానిక నాయకులను పక్కనపెట్టారు. ఆయా గ్రామాల వారీ కార్యకర్తల సమీకరణకు వాహనాల విషయంలోనూ స్థానిక నేతల పాత్రకు అవకాశమే ఇవ్వలేదు. దీంతో కీలక నాయకులు కూడా సాధారణ కార్యకర్తల్లా ఇలా వచ్చి అలా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పరిచయ కార్యక్రమాల్లోనూ కనీసం మండలంలో పదిమందిని అయినా ఆయన పరిచయం చేసుకోకుండా నేను జగన్‌కు ముఖ్యుడిని, ఆయన పంపాడు ఓట్లు వేయండి అంటూ దండంపెట్టి మూడు ముక్కలతో ప్రసంగాన్ని ముగించారు.

ప్రైవేటు వ్యక్తులతో హడావుడి

ప్రస్తుతం చెవిరెడ్డి పొదిలి కేంద్రంగా నడుస్తూ రోజువారీ ఏదో ప్రాంతానికి వెళ్లడం, కొన్ని ప్రాంతాల్లో కాసేపు కారులోనే వేచి ఉండటం, మరికొన్ని ప్రాంతాల్లో కిందకు దిగి కనిపించిన ప్రజలను ఆలింగనం చేసుకొని మాటలు చెప్పి వెళ్లిపోవడం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల స్థానిక నాయకులకు ఎవరో చెబితే గాని చెవిరెడ్డి వచ్చిపోయిన విషయం తెలియడం లేదు. దీనికి తోడు పొదిలి కేంద్రంగా ఆయన సుమారు 80మంది ప్రైవేట్ వ్యక్తులను ఉంచి వారిని రోజువారీ ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాలకు పంపుతున్నారు. వారు సాయంత్రానికి ఏదో ఒక సమాచారాన్ని చెవిరెడ్డికి ఇస్తున్నారు. తదనుగుణంగా ఆయన అక్కడ ఇది జరుగుతుంది.. ఇక్కడ ఇది జరుగుతుంది అంటూ అసెంబ్లీ అభ్యర్థులకు సమాచారం పంపుతున్నారు. కొన్నిచోట్ల కిందిస్థాయి నాయకులకు ఫోన్లు చేసి చెప్పడం ప్రారంభించారు. దీంతో కిందిస్థాయిలోని వైసీపీ నాయకులు ఈ పరాయి పెత్తనం ఇలాగే సాగితే భరించలేమంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

డబ్బు విషయంలో మరింత గగ్గోలు

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని వైసీపీ కౌన్సిలర్లు, లేనిచోట ఇన్‌చార్జిలకు కొన్ని మున్సిపాలిటీల్లో పార్టీ డివిజన్ అధ్యక్షులకు డబ్బులు ఇవ్వడం ప్రారంభించారు. అలా గిద్దలూరులో తొలుత ఒక్కక్కరికి రూ.2లక్షలు ఇచ్చారు. మార్కాపురం, కనిగిరిలో ఒక్కొక్కరికి లక్ష పంపిణీ చేశారు. ఆ సందర్భంగా త్వరలో మరో లక్షా లేక రెండు లక్షలు మీకు వస్తామని స్థానిక నాయకులు చెప్పారు. మార్కాపురంలాంటి మున్సిపాలిటీల్లో కౌన్సిలర్‌కు లక్ష ఇచ్చి అతనితో ఉండే 10మంది ముఖ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేలు ప్రకారం ఇమ్మని మరో లక్ష ఇచ్చారు. ఆ డబ్బు ఎవరికి ఇస్తారో ముందుగా పేర్లు ఇవ్వాలని అడిగి వెరిఫై చేసుకొని మరీ పంపిణీ చేశారు. తాజాగా ఒంగోలులో ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3లక్షల ప్రకారం ఇచ్చారు. కొంత తక్కువగా డివిజన్ అధ్యక్షులకు చెల్లించారు. దీంతో పశ్చిమప్రాంతంలోని ఆయా మునిసిపాలిటీల్లోని కౌన్సిలర్లు తమకు లక్ష ఇచ్చి అక్కడ మూడు లక్షలు ఎలా ఇచ్చారు అని ప్రశ్నిస్తూ వెంటనే తమకూ అలాగే ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలిసింది. అంతేకాక పశ్చిమ ప్రాంతంలోని మునిసిపాలిటీల్లో మరికొందరికి రూ.లక్ష ఇస్తే కొందరికి రెండు లక్షలు ఇచ్చినట్లు బయటపడింది. దీంతో అక్కడ కౌన్సిలర్లు తమ అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రారంభించారు. ఇది గమనించి అభ్యర్థులు మీకు కూడా మరికొంత ఇస్తారు. కాకపోతే మరో వారంరోజులు ఓపిక పట్టండి అంటూ సముదాయిస్తున్నట్లు తెలిసింది.

సీనియర్ల జోలికెళ్లడు.. జూనియర్లను పట్టించుకోడు

అసెంబ్లీ అభ్యర్థులతోనూ చెవిరెడ్డికి సమన్వయం లోపించింది. కొందరు అభ్యర్థుల విషయంలో అణిగి మణిగి వ్యవహరిస్తున్న ఆయన రాజకీయంగా జూనియర్లు అయిన కొందరిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు బహిరంగంగానే ఉన్నాయి. మీ పని మీరు చేయండి నేను ఏమి చేయాలో చేస్తానన్న చందంగా కొందరితో మాట్లాడుతున్నారని ఆ పార్టీశ్రేణులు గుసగుసలాడుకుంటున్నాయి. ఏడు నియోజకవర్గాల్లో రెండుచోట్ల తానేమీ చేయాత ఇవ్వలేనని సంకేతం ఇచ్చినట్లు సమాచారం. దీంతో బదిలీపై తూర్పు ప్రాంతానికి వచ్చి పోటీచేస్తున్న ఒక అభ్యర్థి.. విషయాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే పైకి మాత్రం తానే అన్నీ సమకూర్చుతున్నాను అన్న తరహాలో చెవిరెడ్డి హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కొందరు అధికారుల మద్దతుతో బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం నిల్వలను అక్రమంగా పెడుతున్నట్లు తెలిసింది. అందుకు సహకరించని బార్ అండ్ రెస్టారెంట్లపై అధికారులతో తనిఖీలు చేయించి కేసులు రాయించడం, వాటిని సీజ్ చేయించడంలాంటి చర్యలకు శ్రీకారం పలికారు. ప్రజలను కాకపోయినా పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులను కూడా కలవని చెవిరెడ్డితో మున్ముందు మరింత ఇబ్బందులు తప్పకపోవచ్చన్న భావన ఆపార్టీ నాయకుల్లో పెరిగిపోతోంది.

సన్‌డే

- మార్కాపురం, కంభంలలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత
- అనేక మండలాల్లో 43 డిగ్రీలపైనే నమోదు
- పెరిగిన వడగాడ్పుల తీవ్రత
- వృద్ధులు విలవిల

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 28 : సూరీడు చెలరేగిపోతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే సుర్రుమనిపిస్తున్నాడు. మధ్యాహ్నానికి మంటపుట్టిస్తున్నాడు. ఆదివారం మోతాదు మరింత పెంచాడు. దీంతో జిల్లాలోని పశ్చిమప్రాంతం నిప్పుల కుంపటిలా మారింది. మార్కాపురం, కంభం, అర్ధవీడుల్లో 44.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అది అనేక మండలాల్లో 43 డిగ్రీలకుపైనే ఉంది. ఎర్రగొండపాలెంలో 44.3, దొనకొండలో 44.2, హనుమంతునిపాడులో 44.1, గిద్దలూరులో 44.1, కనిగిరిలో 44.0, పెద్దారవీడులో 44.0, తర్లుబాడులో 43.8, వెలిగండ్లలో 43.9 డిగ్రీల ఎండ కాచింది. పీసీపల్లిలో 43.6, కొమరోలులో 43.5, పొదిలిలో 43.4, చీమకుర్తిలో 43.4, దోర్నాలలో 43.3, సీఎస్‌పురంలో 43.2, కొనకనమిట్లలో 43.2, బేస్తవారపేటలో 42.9, ముండ్లమూరులో 43.7, కురిచేడులో 43.2, పొన్నలూరులో 43.2, మర్రిపూడిలో 43.0, కొత్తపట్నంలో 42.9, మద్దిపాడులో 41.2, సంతనూతలపాడులో 41.1, ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన అనేక మండలాల్లో అది 40 డిగ్రీలపైనే ఉంది. ఒంగోలులో 39.7 డిగ్రీలు నమోదైంది. ఎండకు తోడు వడగాడ్పుల తీవ్రత కూడా పెరగడంతో వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడారు.



బ్యాంకు ఖాతాలకే పింఛన్

- ఆధార్‌తో అనుసంధానమైతే డీబీటీ పద్ధతిలో జమ
- 1వతేదీ నుంచి అమలు
- దివ్యాంగులు, మంచంలో ఉన్న వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దనే అందజేత

ఒంగోలు నగరం, ఏప్రిల్ 28: ఎన్నికల వేళ రాష్ట్రప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీ విషయంలో నెలకో నిర్ణయం తీసుకుంటోంది. ఈ నెలలో సచివాలయాల్లో పింఛన్లను పంపిణీ చేయగా, వచ్చే నెలలో డీబీటీ పద్ధతిలో వీటిని జమచేయాలని నిర్ణయించింది. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయడాన్ని నిలిపివేయడం తగదంటూ టీడీపీ నాయకులు మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత నెలకు సంబంధించిన పింఛన్లను ఈ నెల మొదటివారంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చెల్లించారు. గతంలో వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ సొమ్మును తీసుకుపోయి అందించేవారు. అయితే ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఆబాధ్యతల నుంచి తప్పించింది. దీంతో గత నెలలో పింఛన్లను సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు అందించారు. ఈనేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. దీనిపై టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన కూడా చేశారు. సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఇళ్లకు పంపించి అందించాలని టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ పింఛన్‌దారులను ఇబ్బందిపెట్టడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం గతనెల పింఛన్‌ను సచివాలయాల దగ్గరే పంపిణీ చేసింది. దీంతో వృద్ధులు, వితంతువులు, వ్యాధులతో బాధపడుతున్నవారు, దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారు. ఎండ వేడిమికి తట్టుకోలేక రాష్ట్రంలో కొంతమంది మృత్యువాతపడ్డారు. అయితే ఈనెల సొమ్ము అయినా ఇంటికి వచ్చి అందజేస్తారని పింఛన్‌దారులు ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో ప్రభుత్వం తాజాగా డీబీటీ పద్ధతిపై మే 1న అందజేస్తామని ప్రకటించింది. పింఛన్ పొందుతున్న వారి ఆధార్ కార్డుల ఆధారంగా లింకు అయిన బ్యాంకు ఖాతాలకు సొమ్మును జమ చేయనున్నారు. ఆ వివరాలను సెర్ప్ అధికారులు బ్యాంకుల నుంచి సేకరించనున్నారు. ఆ మేరకు ఏప్రిల్ మాసానికి సంబంధించిన పింఛన్ సొమ్మును మే 1వ తేదీన బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు.




మంచంలో ఉన్న వృద్ధులు, రోగులు, దివ్యాంగులకు ఇంటికే పింఛన్

బ్యాంకులకు వెళ్లి పింఛన్ సొమ్మును తీసుకునే స్థితిలో లేని వృద్ధులు, మంచానికి పరిమితమై ఉన్న రోగులు, దివ్యాంగులకు మాత్రం సచివాలయం సిబ్బంది ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరికి ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చేందుకు ఈనెల 30వ తేదీనే బ్యాంకుల నుంచి నగదును డ్రా చేయనున్నారు. ఎంతమందికి ఇంటికి పింఛన్ అందజేయాలి, ఎంతమందికి బ్యాంకు ఖాతాలకు జమచేస్తున్నారనే వివరాలను ప్రభుత్వం సోమవారం నాటికి జిల్లా అధికారులకు తెలియజేయనుంది. జిల్లాలో 2,92,522మందికి ప్రభుత్వం ప్రతినెలా పింఛన్లను అందజేస్తుంది. అందుకోసం ప్రతినెలా రూ.87.49 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేస్తోంది. మొత్తం 2,92,522 మందిలో 75శాతం మందికి మాత్రమే బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో లింకై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మిగిలిన వారికి ఇంటికే తీసుకెళ్లి పింఛన్ సొమ్మును అందజేయాల్సి ఉందని డీఆర్‌డీఏ అధికారులు అంటున్నారు.

కూటమి అగ్రనేతలు వస్తున్నారు..

- రేపు ఒంగోలుకు లోకేష్
- కొండపి, ఎస్‌ఎన్‌పాడులో బాలకృష్ణ పర్యటన
- 2 లేదా 4 తేదీల్లో దర్శికి చంద్రబాబు
- 3న గిద్దలూరు, దర్శి, ఒంగోలులో పవన్ సభలు



ఒంగోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో టీడీపీ కూటమి తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి అగ్రనేతలు తరలివస్తున్నారు. టీడీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుండగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నందమూరి బాలకృష్ణతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ప్రచారం నిర్వహించనున్నారు. వారి పర్యటనలపై జిల్లాలోని ఇరు పార్టీల వర్గాలకు సమాచారం అందింది. ఆప్రకారం ఈనెల 30వతేదీన ఒంగోలుకు యువనేత నారా లోకేష్ రానున్నారు. నగరంలోని ఏ-1 కన్వెన్షన్ హాలు ఎదురు స్థలంలో సుమారు ఐదువేల మంది యువకులతో ఏర్పాటు చేస్తున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ఆ కార్యక్రమం ఉంటుంది. అనంతరం నెల్లూరు వెళ్తారు. 30వ తేదీనే టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో జరిగే సభల్లో పాల్గొంటారు. టీడీపీ అధినేత చంద్రబాబు దర్శి నియోజకవర్గానికి రానున్నారు. అయితే 3వతేదీ పవన్ కల్యాణ్ కార్యక్రమం ఉన్నందున ఈనెల 2 లేక 4వ తేదీల్లో చంద్రబాబు పర్యటించే అవకాశం ఉంది. మార్కాపురం, దర్శి, కనిగిరి నియోజకవర్గాలు కలిసొచ్చే విధంగా కూడలి ప్రాంతంలో సభ లేక దర్శిలో రోడ్‌షో కార్యక్రమంలో ఒకటి ఉండే అవకాశం ఉంది. ఇక టీడీపీ కూటమిలో ప్రధాన పాత్రధారైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా మే 3వ తేదీన జిల్లాలో ఎన్నికల పర్యటనకు వస్తున్నట్లు సమాచారం. ఆరోజు ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని గిద్దలూరు, దర్శి, ఒంగోలుల్లో జరిగే సభల్లో పవన్ కల్యాణ్ పాల్గొంటారు. తొలుత గిద్దలూరు, మధ్యాహ్నం దర్శిలో జరిగే సభలకు ఆయన హాజరవుతారు. సాయంత్రం ఒంగోలులో రోడ్‌షోతో పాటు సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను ఎంపీ అభ్యర్థి మాగుంట పర్యవేక్షిస్తూ హెలిప్యాడ్ నిర్మాణ అనుమతులకు జిల్లా అధికారులకు దరఖాస్తు చేశారు. ఇదిలా ఉండగా ఈనెల 30న వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా జిల్లాకు వస్తున్నారు. ఆ రోజు ఉదయం టంగుటూరులో జరిగే సభలో ఆయన పాల్గొంటారు.



ప్రభుత్వ బదిలీ టీచర్ల జీతాలకు లైన్‌క్లియర్

- తొమ్మిది నెలలుగా నిలిపివేత
- ఎట్టకేలకు ఆమోదం తెలిపిన ఆర్థిక శాఖ



ఒంగోలు(విద్య), ఏప్రిల్ 28 : జిల్లాలో గత ఏడాది ప్రభుత్వం ద్వారా బదిలీ ఉత్తర్వులు పొంది ఇతర పాఠశాలలకు వెళ్లి పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. దీంతో తొమ్మిది నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్న వారికి ఊరట లభించింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గత ఏడాది జూన్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి. ఆ సమయంలో దూర ప్రాంతాలకు బదిలీ అయిన వారు దగ్గర ప్రాంతాలకు వచ్చేందుకు ప్రజాప్రతినిధులను ఆశ్రయించారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు తలొగ్గిన విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు వీరి బదిలీలకు మౌఖికంగా టెలిఫోన్ ఆదేశాలు ఇచ్చారు. టీచర్ల పేర్లు, వారు ప్రస్తుతం పనిచేస్తున్న చోటు, బదిలీ కోరుకుంటున్న స్కూల్ పేరుతో పాఠశాల విద్య కమిషనర్ డీఈవోలకు ఎక్సెల్ షీట్‌లో వాట్సప్ సందేశం పంపారు. దీంతో విధిలేక డీఈవోలు ఆ టీచర్లకు వారు కోరుకున్న స్థానాలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అలా రాష్ట్రవ్యాప్తంగా 652 మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు లభించాయి. వారిలో మన జిల్లాలో 34 మంది ఉన్నారు. అయితే ఈ ఉత్తర్వుల ఆధారంగా జీతాలు చెల్లించేందుకు ఖజానాశాఖ అధికారులు ససేమిరా అన్నారు. ఈ బదిలీలకు అధికారికంగా ఎలాంటి ఆధారం లేదని, ప్రభుత్వ ఉత్తర్వులు ఉంటేనే జీతాలు చెల్లిస్తామని భీష్మిం చారు. ఫిబ్రవరి నాటికి ఆరు నెలల జీతాలు రాక పోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను 'ఆంధ్రజ్యోతి'లో 'టీచర్ల ఆకలి కేకలు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ తర్వాత అన్ని జిల్లాల డీఈవోలు జీతాలు రాని టీచర్ల ఇబ్బందులను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జోక్యంతో వీరికి జీతాలు చెల్లించేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలుపుతూ ఈనెల 10న ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఖజానా అధికారులను సమన్వయం చేసుకొని వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఈనెల 18న డీఈవోలను ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశించారు.

వైసీపీ నాయకుడి షెడ్‌లో గోవా మద్యం డంప్

- ఎర్రగుడిపాడులో దాడి చేసి పట్టుకున్న ఎస్‌ఈబీ అధికారులు
- వెయ్యి బాటిళ్ల లిక్కర్ స్వాధీనం... కేసు నమోదు

వివరాలు మెయిన్‌లో..



ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న గోవా మద్యం బాటిళ్లు

బీసీలకు 50ఏళ్లకే రూ.4వేల పింఛను !

- టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి విజయ్‌కుమార్
- పలు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- తెలుగుదేశంలో తగ్గని చేరికల జోరు


దేవరపాలెంలో ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్


పార్టీలో చేరిన నాగులుప్పలపాడు మండలవాసులతో బీఎన్

చీమకుర్తి, ఏప్రిల్28 : త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే బీసీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4వేల పింఛన్ అందిస్తామని తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవరపాలెంలో ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌కు గ్రామస్థుల నుంచి ఘన స్వాగతం లభించింది. విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. మహాలక్ష్మి పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని ఆయన తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, వెన్నపూస రాజశేఖరరెడ్డి, గంగిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూనంనేనివారిపాలెంలో..

మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో పలువురు వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వేమా శ్రీను, శంకర్, పొనుగుపాటి వెంకట్రావులకు బీఎస్.విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. కార్యక్రమంలో పుట్టా సుబ్బారావు, వేమా పెద్దకోటేషు, చినకోటేషు, వేమా ఎలీషా, పొత్తూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్

నాగులుప్పలపాడు: చంద్రబాబునాయుడుతోతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు .తక్కెళ్ళపాడులో టీడీపీ మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్‌కు పార్టీ శ్రేణులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్వహణను గాలికొదిలేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను ఆధునీకరించి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఐపీఎస్ అధికారి తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ కుమార్, గ్రామ అధ్యక్షుడు నూతలపాటి శంకర్, సర్పంచ్ నూతలపాటి రామమోహనరావు, చావా శేఖర్, గుమ్మడి సాయిబాబా, దివి పున్నారావు, మారెళ్ళ వెంకటశేషయ్య, షేక్ ఖాజావలి, బి.సెల్వం, కనగాల శ్రీనివాసరావు, ఇంటూరి శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికల జోరు..

అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన బెంగళూరు వెంకట్రావు, హరిబాబు, జక్కుల ఆంజనేయులు, కసుకుర్తి వెంకటరావుతో పాటు మరో 20 కుటుంబాలు ఆదివారం ఒంగోలులోని బీఎస్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి విజయ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కె.తక్కెళ్ళపాడులో మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సీకాలనీలోని వైసీపీకి చెందిన 20 కుటుంబాలు గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో విజయ్‌కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. వారందరికీ బీఎస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తేనేటి శిరీష, మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, ఇంటూరి శ్రీనివాసరావు, నూతలపాటి శంకర్, నూతలపాటి రామమోహనరావు, దివి పున్నారావు, మారెళ్ళ వెంకటశేషయ్య, కనగాల శ్రీనివాసరావు, గూడూరి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంలో చేరిన అన్నంగివాసులు

మద్దిపాడు: అన్నంగి గ్రామం నుంచి టీడీపీలోకి వలస పరంపర కొనసాగుతోంది. గ్రామానికి చెందిన తేళ్ల ప్రసాదు, సామ్యేలు, టి.బాబూరావు, మున్నంగి ప్రసాదు, తేళ్ల కిషోర్ , గడ్డా రామయ్య, గద్దల జస్వంత్‌తో పాటు మరి కొందరు టీడీపీలో చేరగా వారికి బీఎస్.విజయకుమార్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, రావిపాటి శ్రీనివాసరావు, మండవ గోపీనాథ్, కొమ్మాలపాటి సుబ్బారావు, నారిపెద్ది అనిల్, అన్నాబత్తిన శ్రీనివాసరావు, శివ, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో

బాలినేని బ్యాచ్ బోగస్ ఉద్యోగాలు

పని చేయకుండానే జీతాలు దోచుకుంటున్నారు..

అన్ని తెలిసి కూడా కార్పొరేషన్ అధికారులు మౌనం

పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి విమర్శలు


మాట్లాడుతున్న సూర్యప్రకాష్‌రెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 28 : ప్రభుత్వ శాఖల్లో, ప్రత్యేకించి కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బ్యాచ్ పనిచేయకుండా ఏళ్ళ తరబడి జీతాలు తీసుకుంటూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలినేని తన కార్యకర్తలకు కార్పొరేషన్‌తోపాటు, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పించి, ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. తన పార్టీ కార్యర్తలకు వలంటీర్లుగా ఉద్యోగాలు ఇచ్చి ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకోవడంతోపాటు, కార్పొరేషన్ కార్యాలయంలో తన అనుచరులు, పార్టీ కార్యర్తల పేరుతో 150 మందికి పైగా శానిటరీ వర్కరుగా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. పేరుకు శానిటరీ వర్కరుగా విధుల్లోకి తీసుకుని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శానిటరీ సూపర్ మేస్త్రిగా నియమించారన్నారు. బాలినేని సిఫార్సుల్లో నియమితులైన వారు ఒక్కరు కూడా పనిచేయడం లేదని చెప్పారు. వారు ఏ డివిజన్‌లో పనిచేస్తున్నారో అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేరుకు కార్పొరేషన్ ఉద్యోగులుగా నియమితులై ఆప్కాస్ కింద జీతాలు తీసుకుంటూ కనీసం పార, చీపురు కూడా పట్టుకోవడం లేదని, పని చెబితే అధికారులపై పెత్తనం చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ అందులోనూ బాలినేని మనుషులు కావడంతో అధికారులు ఏమీ చేయలేక కళ్ళుమూసుకుంటున్నారని తెలిపారు. అధికారులు వైసీపీకి వత్తాసు పలుకుతూ వారికి పని చెప్పడానికి కూడా వెనుకాడుతున్నారని, వీరికి జీతాలు ఇస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేషన్‌లో కార్మికుల కన్నా, మేస్త్రీల వ్యవస్థ నడుస్తుందని, అధికారులు కూడా అన్నీ తెలిసి మౌనంగా ఉంటున్నారని పేర్కొన్నారు. అలాగే పలు ప్రభుత్వ శాఖల్లో బాలినేని బ్యాచ్ ఉద్యోగాలు పొంది విధులకు కూడా రావడం లేదని, ఇలా ప్రభుత్వశాఖలను బాలినేని సొంత సంస్థలుగా వాడుకుంటూ ప్రభుత్వ సొమ్మును వారికి వేతనాలుగా కట్టబెడుతున్నారని విమర్శించారు. కలెక్టర్ వీటిపై విచారణ చేసి వాస్తవాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి సిఫార్సులతో ఉద్యోగాలు పొందిన వారు పనిచేయడం లేదని, అధికారుల ఉదాసీనత అందుకు కారణమన్నారు. ఇలాంటలి దుర్మార్గ పాలన సాగిస్తున్న బాలినేని ప్రభుత్వ శాఖల్లోనూ తన కార్యకర్తలను నియమించడంపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

దిన్నేపురం నుంచి జనసేనలో చేరిక


జనసేనలో చేరిన వారితో బీఎస్, కందుకూరి బాబు

చీమకుర్తి, ఏప్రిల్ 28 : చీమకుర్తి పట్టణంలోని దిన్నేపురంలో వైసీపీని వీడి పలువురు జనసేన పార్టీలో ఆదివారం చేరారు. జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు, టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్, సమక్షంలో పట్టణ జనసేన అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, మండల అధ్యక్షులు పల్లపు శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఉప్పలపాటి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కందుకూరి లక్ష్మణ్, యలమంద, దమ్మాలపాటి శ్రీనివాసరావు, రాయళ్ల ఆంజనేయులు, శ్రీనివాసరావు, లక్ష్మి, నాగేశ్వరరావులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దరిమడుగు నాగరాజు, ముత్యాల సురేష్, మురళి, వెంకట్రావు పాల్గొన్నారు.

త్వరలో చంద్రన్న సంక్షేమరాజ్యం


కరపత్రాలను అందజేస్తున్న అనిల్, నాయకులు

మద్దిపాడు, ఏప్రిల్ 28: త్వరలో ప్రజాశ్రేయస్సు కోరే చంద్రన్న సంక్షేమ రాజ్యం రాబోతుందని, వైసీపీకి ప్రజలు శాశ్వతంగా సమాధి కట్టనున్నారని టీడీపీ నాయకుడు బొమ్మాజీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మద్దిపాడులో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ హయాంలో నియోజకవర్గంతో పాటు జిల్లాలో జరిగిన అభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోందని, కానీ వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బీఎస్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా మాగుంట ప్రణాళికలు

వైసీపీ ముఖ్యనేతలు, వివిధ వర్గాలతో వరుస భేటీలు


వెంగముక్కపాలెంలో లింగారెడ్డితో మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి


గొర్రెపాటి అర్జున్‌రావు నివాసంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ కూటమి ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. తనకు ఉన్న అనుభవాలు, పరిచయాలను సద్వినియోగం చేసుకొనే దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా మాగుంట ఆదివారం పలు భేటీలు నిర్వహించారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని వెంగముక్కపాలెంలో వైసీపీ సీనియర్ నేత ఇలవల లింగారెడ్డితో భేటీ అయ్యారు. లింగారెడ్డి కొన్ని కారణాలతో గత కొంతకాలం నుంచి వైసీపీకి దూరంగా ఉంటున్నారు. లింగారెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుంచుకొని తన నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఒకప్పుడు వెంగముక్కలపాలెంలో రాజకీయంగా ఏకచక్రాధిపత్యం వహించిన లింగారెడ్డి ఇప్పుడు తెలుగుదేశంపార్టీలో చేరేందుకు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. దీంతో లింగారెడ్డి టీడీపీలో చేరితే ఆ గ్రామంలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో లింగారెడ్డితో పాటు ఆ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులతో మాగుంట సమావేశమయ్యారు. వచ్చేనెల 13తేదీన జరగనున్న పోలింగ్‌లో తెలుగుదేశం పార్టీగెలుపే లక్ష్యంగా తమ పార్టీలోకి రావాలని మాగుంట ఆహ్వానించినట్లు సమాచారం. దీంతో ఆయననుంచి కూడా సానుకూలస్పందన లభించినట్లు తెలిసింది. కాగా స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కాపు సీనియర్ నేత గొర్రెపాటి అర్జున్‌రావు నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాగుంట పాల్గొంటారు. ఈ సందర్భంగా పలువురు కాపునేతలను మాగుంటకు పరిచయం చేశారు. ఇలా ఆదివారం ఉదయం సమయంలో మాగుంట పలువురు నేతలను కలిసి మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఆయన వెంట అయినాబత్తిన ఘనశ్యాం, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, కోలా ప్రభాకర్, మాగుంట తనయుడు నిఖిల్‌రెడ్డి, చుండి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి టీడీపీ కృషి

టీడీపీ కూటమి ఒంగోలు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు దామచర్ల, మాగుంట హామీ • లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల, వేదికపై ఎంపీ మాగుంట


అన్నవరప్పాడులో అభివాదం చేస్తున్న దామచర్ల, మాగుంట, రియాజ్ తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 28 : న్యాయవాదుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ఆస్టోనా ఫంక్షన్ హాలులో టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆత్మీయసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దామచర్ల మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే న్యాయవాదులకు ఇళ్ళ స్థలాల ఇస్తామని తెలిపారు. అలాగే మెడిక్లెయిమ్ కింద రూ.5లక్షలు మంజూరు ఇస్తామని, ప్రమాద బీమా కింద రూ.15లక్షలు, ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం భర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతేగాకుండా న్యాయవాదుల సంక్షేమానికి రూ.100కోట్లు నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు ఎల్లవేళలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, దామచర్ల సత్య, పలువురు టీడీపీ కూటమి నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడు గుడిసెవాసులకు అండ

నగరంలోని అన్నవరప్పాడు గుడిసెవాసుల సంఘంతో దామచర్ల జనార్దన్ ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా అన్నవరప్పాడు గుడిసెవాసులు ఎదుర్కొంటున్న ఇళ్ళ స్థలాలు సమస్యపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఏళ్ళతరబడి ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారికి భద్రత, భూమిపై హక్కు కల్పించేందుకు రైల్వే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే అన్నీ సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని దామచర్ల స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అన్నవరప్పాడు గుడిసెవాసుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా అన్నవరప్పాడు, దారవారితోట ప్రాంతవాసులు అధిక సంఖ్యలో పాల్గొని దామచర్ల, మాగుంటకు మద్దతు తెలిపారు.

మద్యం దుకాణం గోడకు కన్నం

- 15 మద్యం సీసాలు, స్వైపింగ్ మిషన్ చోరీ


గోడకు వేసిన కన్నాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని రాయవరం గ్రామం పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్ వంతెన సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం గోడకు కన్నం వేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ తెలిపిన వివరాల ప్రకారం దుండగులు ప్రభుత్వ మద్యం దుకాణం గోడకు కన్నం వేసి షాపులో ఉన్న ఆరు ఫుల్‌బాటిల్ మద్యం సీసాలు, తొమ్మిది 180 ఎంఎల్ మద్యం సీసాలు, ఒక స్వైపింగ్ మిషన్, ఒక ట్యాబు చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని తెలిపారు. ఘటనా స్థలాన్ని తన సిబ్బందితో కలిసి పరిశీలించి మద్యం దుకాణం సిబ్బందితో వివరాలను సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తర్లుపాడు, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సీతానాగులవరం పొలిమేర వద్ద ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంభం మండలం లింగాపురం గ్రామానికి చెందిన అన్నం రామసుబ్బారెడ్డి మార్కాపురం శివారు ప్రాంతంలో వెలసిన శ్రీ పోలేరమ్మ ఆలయం వద్దకు వెళ్లి మొక్కు తీర్చుకొని తిరిగి స్వగ్రామం లింగాపురం వస్తున్నాడు. మార్గమధ్యలో సీతానాగులవరం మలుపు వద్ద బైకు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రామసుబ్బారెడ్డి తలకు తీవ్రగాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సామరస్య ఎన్నికలకు సహకరించాలి

- ఎస్పీ సుమిత్‌సునీల్


మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్‌సునీల్

త్రిపురాంతకం, ఏప్రిల్ 28: వచ్చే సార్వత్రిక ఎన్నికలను సామరస్య, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ కోరారు. మండలంలోని మిట్టపాలెం, ఒడ్డుపాలెం గ్రామాల్లో ఆదివారం జరిగిన ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ ఘర్షణలు అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో గోప్యత ఉంటుంది కాబట్టి ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతోపాటు, ప్రత్యేక పోలీసు బలగాలు వస్తాయన్నారు. అబ్జర్వర్ రహమాన్ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి భయాలకూ లోనుకాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేస్తే ఎస్పీకి లేదా తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ ఎస్.సుబ్బారావు, ఎస్సై వి.సాంబశివయ్య తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నమానుపై చెన్నయ్య ఊరేగింపు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 28: మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చెన్నకేశవస్వామి ఆదివారం తెల్లవారుజామున మురళీకృష్ణ అలంకారంలో పొన్న వాహనంపై నాలుగు మాఢ వీధులలో విహరించారు. ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి పొన్నమాను వాహనంపై ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లు, మహిళా, విద్యార్థులు కోలాట ప్రదర్శనతో ముందుకుసాగారు. సోమవారం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై చెన్నుడు దర్శనమివ్వనున్నారు.

అవీ..ఇవీ..

అభివృద్ధి కోసం తెలుగుదేశాన్ని గెలిపించాలి


ప్రచారం నిర్వహిస్తున్న నాగసత్యలత

కొత్తపట్నం(ఒంగోలు నగరం) ఏప్రిల్ 28: వైసీపీ పాలనలలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి పోయిందని, మళ్ళీ తెలుగుదేశం పార్టీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత కోరారు. ఆదివారం రాత్రి మండలంలోని కొత్తపట్నం ఎస్టీకాలనీల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొత్తపట్నం మండలంలో చేసి అభివృద్ధిని గురించి ఓటర్లకు వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని, వెంటనే ఎస్టీలకు పలు సంక్షేమ పథకాలను అమలు చేయబోతుందని ఆమె పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు మంచి రోజులు రాబోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గేనం సుబ్బారావు, మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, జంపాని రామచంద్రయ్య, కొత్తపట్నం గ్రామ అధ్యక్షులు సింగిరి శ్రీను, కోడూరి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి : డీఈవో

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 28: ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సోమవారం నుంచి మే 4వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డీఈవో కె.సుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వతేదీ వరకు జరుగుతాయి. మే 4వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు. జిల్లాలోని ఏపీ ఓపెన్ సొసైటీ స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్లు తమ వద్ద అడ్మిషన్లు పొంది పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు వివరాలను తెలిపి వారు మళ్ళీ పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షకు హాజరయ్యేలా చూడాలని ఆమె సూచించారు.

వెంగముక్కలపాలెంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 28: వెంగముక్కలపాలెంలో భగీరథ కెమికల్స్ డైరెక్టర్ సింగవరపు చంద్రశేఖర్ ఆదేశాలతో సిద్ధవరపు కోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ట్రస్ట్ కోశాధికారి చెన్నారెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. వేసవి కారణంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు తమవంతుగా ఉచితంగా మంచినీరు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ ప్రెసిడెంట్ భీమనాథం వెంకటేశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, యలవలవెంకటస్వామిరెడ్డి, తిరుపతిస్వామి, ఏసు, జమ్మలమడుగు సుబ్బారావు, తేళ్ల సుమన్, మేనేజర్ కాకాని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ గెలుపు కోరుతూ ప్రచారం


కరపత్రాలను అందిస్తున్న నాయకులు


నాగులుప్పలపాడు, ఏప్రిల్ 28: టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ గెలుపు కోరుతూ ఉప్పుగుండూరులో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉప్పుగుండూరులోని దిన్నె మీద 14 వార్డు లో ఆదివారం రాత్రి నాయకులు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, జంజనం సుబ్బయ్య శ్రీకాంత్, రామకృష్ణ, జనసేన నాయకులు పెంట్యాల కోటి, పెంట్యాల శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అలరించిన సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 28: బీఏఎస్‌కేఆర్ మ్యూజిక్ ప్లాజా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్థానిక తాతా బిల్డింగ్స్ ఎదురుగా ఉన్న మ్యూజిక్ ప్లాజా భవనంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 35 మంది గాయకులు పాత, కొత్త చిత్రాలలో హుషారైన పాటలతో మైమరపించారు. సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ గాయినీ స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వాహకులు గాయకులు కోటేశ్వరరావు, బాలాజీ, రంగా, అశోక్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గాయకులు అర్జున్ కర్నాటి, తన్నీరు బాలాజీ, మాగంటి మూర్తి, ఎం.రమణ, గోపాలరావు, పి.శ్రావ్య, గీతా, డి.భాను, శైలజ, చిత్ర పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న సుధాకర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమకు నచ్చిన పార్టీకి, అభ్యర్థికి ఓటు వేసే విధంగా వాతావరణం ఉండాలన్నారు. కానీ అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి ప్రజలను మద్యం, డబ్బు అనేక విధాలుగా ప్రలోభ పెడుతున్నా ఎన్నికల నిఘా యంత్రాంగం చోద్యం చూస్తుందని ఆరోపించారు కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పేరయ్య, కత్తికళ్యాణ్, సంగీతరావు, ఎన్.క్రాంతి, శిరీష, బి.సుబ్బారావు, ధరణికోట లక్ష్మీనారాయణ, కరువది సుబ్బారావు, దాసరి సుందరం, ఎ.సలార్, వెంకయ్య ఆవుల సుబ్రహ్మణ్యం, జగన్, పిచ్చయ్య ఏఎల్.ప్రసాద్, వేజెండ్ల శివరావు, ఉదయ్, మురహరి, రాఘవులు, నరసింహారావు, జోసెఫ్ చంద్ర పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


దుద్దుకూరు, పోతవరం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 28 : ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఉప్పుగుండూరు లోని ఊరచెరువు మైదానంలో అడ్వాన్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ)ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. పలు పోటీలు ఆదివారం ఉత్కంఠంగా సాగాయి. అంబేడ్కర్ యూత్ మాచవరం, కొత్తకోట అంబేడ్కర్ యూత్, ఆరిఫ్ ఫ్రెండ్స్ అమ్మనబ్రోలు, బూరేపల్లి యూత్, ఏవైసీసీ ఉప్పుగుండూరు, ఏ లైట్ ఫ్రెండ్స్ తిమ్మసముద్రం, స్టార్ బాయ్స్ రజానగరం, ఆర్సివై రాపర్ల, ఫ్రెండ్స్ సర్కిల్ దుద్దుకూరు, వెంకట్ ఫ్రెండ్స్ పోతవరం జట్ల మధ్య హోరాహోరీగా సాగాయి. క్రికెట్ పోటీలను వీక్షించేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- ఎన్నికల పరిశీలకులు ఖాజాసింగ్

మద్దిపాడు, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎన్నికల పరిశీలకులు ఖాజాసింగ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దొడ్డవరం, పెద్దకొత్తపలి అంజయ్యనగర్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెడతామని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై పోలీసులు నిఘా పెట్టాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగిపోకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో శంకర్, ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మర్రిపూడిలో హెలిప్యాడ్ నిర్మాణం కోసం చురుగ్గాసాగుతున్న పనులు

రేపు బాలకృష్ణ పర్యటన

- చకచకా హెలిప్యాడ్ పనులు

మర్రిపూడి, ఏప్రిల్ 28 : మండల కేంద్రమైన మర్రిపూడిలో ఈనెల 30వ తేదీన బాలకృష్ణ ప్రచారసభ జరగనున్న నేపథ్యంలో కావలసిన ఏర్పాట్లను టీడీపీ నాయకులు ముమ్మరం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, స్థానిక శాసనసభ్యులు బాలవీరాంజనేయస్వామిల పర్యవేక్షణలో హెలిప్యాడ్ నిర్మాణ పనులను ఆదివారం చేపట్టారు. మండలపార్టీ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి వ్యవసాయ భూమిలో హెలిప్యాడ్ నిర్మాణం కోసం పనులు ముమ్మరం చేశారు. ఆమేరకు ట్రాక్టర్లతో మట్టితోలి భూమిని చదును చేశారు. పవర్‌రోలర్‌తో హెలిప్యాడ్‌ను పటిష్టపరిచారు. బస్టాండ్ సెంటర్లో ప్రచార రథంపైనుంచి బాలకృష్ణ ప్రసంగించనున్నారు. 1987లో జరిగిన మండలపరిషత్ ఎన్నికలల్లో టీడీపీ అభ్యర్థి తరుఫున ప్రచారం నిర్వహించేందుకు బాలకృష్ణ తొలిసారిగా మర్రిపూడికి వచ్చారు. 36ఏళ్ళ తరువాత మళ్లీ ఆయన పర్యటనకు రానునండటంతో సభను విజయవంతం చేసేందకు పార్టీ నాయకులు సర్వశక్తులు వడ్డుతున్నారు. ప్రచార సభలో దామచర్ల సత్యతోపాటు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిలు పాల్గొననున్నారు. హెలిప్యాడ్‌ను ఎస్ఐ శివబసవరాజు టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

టంగుటూరు గ్రంథాలయంలో చదవడం నాకిష్టం

టంగుటూరు, ఏప్రిల్ 28 : టంగుటూరు ప్రభుత్వ గ్రంథాలయంలో ఈ ఆదివారం కూడా చదవడం నాకిష్టం కార్యక్రమం కొనసాగింది. పలువురు విద్యార్థులు హాజరై గ్రంథాలయంలో పుస్తక పఠనం చేశారు. ఈసందర్భంగా గ్రంథపాలకుడు గుమ్మడి వర్దనరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేసేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. గ్రంథాలయంలో బయట అందుబాటులో లేని అనేక పుస్తకాలు ఉంటాయని, వాటిని చదవి విజ్ఞానవంతులు కావాలని వర్దనరాజు సూచించారు.



నాగులపాలెం చెరువుకు చేరిన సాగర్ జలాలు

ఎట్టకేలకు నాగులపాలెం చెరువుకు సాగర్ జలాలు

నాగులపాలెం (పర్చూరు), ఏప్రిల్ 28 : మంచినీటి ఎద్దడిని అధికమించేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు ఎట్టకేలకు చెరువుకు చేరుతున్నాయి. దీంతో వేసవి గండం గట్టెక్కినట్లని ప్రజలు చెందుతున్నారు. తొలిదశలో నీటిని విడుదల చేసిన తరుణంలో చుక్క నీరు కూడా చెరువులకు చేరకపోవడం, ఉన్న రెండు మంచినీటి చెరువులు అడుగంటి పోవడంతో ప్రజలు ఇకింత ఆందోళనకు గురయ్యారు. చెరువులో నీరు లేకపోవడంతో తాగునీటి కోసం పక్క గ్రామాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఎట్టకేలకు సాగర్ జలాలను విడుదల చేయడంతో యుద్ధప్రాతిపతికన చెరువులను నింపుకొనే విదంగా చర్యలు చేపట్టారు. దీంతో ఈవేసవి తాగునీటి ఇబ్బందుల నుంచి బయటపడవచ్చని ప్రజలు అనందం వ్యక్తం చేస్తున్నారు.



డేగరమూడిలో ఏలూరితో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గ్రామస్థులు

జగన్‌రెడ్డి పాలనకు వీడ్కోలు పలకండి

- రాష్ట్రానికి రాజధాని లేదు.. పంటలకు నీరు కరువు
- మద్యం, ఇసుక వ్యాపారంతో దోపిడీ
- అవినీతి, అరాచకం తప్ప అభివృద్ధి శూన్యం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్‌రెడ్డికి వీడ్కోలు పలకాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఐదు గ్రామాలలో జొన్నతాళి, చిమ్మిరిబండ, రాజుగారిపాలెం, డేగరమూడి, వలపర్ల గ్రామాలలో ఏలూరి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా, అన్నదాతకు సాగు నీరు రాకుండా చేసిన చేతగాని వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. వైసీపీ నేతలు మద్యం, ఇసుక, మట్టిని దోచుకొని కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. ఐదేళ్ల వారి పాలనలో అవినీతి-అరాచకాలు తప్ప అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. అభివృద్ధి చేసినట్లు కరపత్రాలపై చూపడం.. ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప వాస్తవం లేదన్నారు. కనీసం నీటి ప్రాజెక్టులను కూడా కట్టకుండా రైతులను ముంచారన్నారని ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పాలకులకు సాగనంపాలని విజ్ఞప్తి చేశారు.

ఏలూరికి ఘన స్వాగతం

తొలుత జొన్నతాళి గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఏలూరికి టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. రామాలయం, పోలేరమ్మ దేవాలయం, గంగమ్మ గుడిలో ఏలూరి పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న ఏలూరికి మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. అలాగే చిమ్మిరిబండ గ్రామంలో ప్రచారానికి వెళ్లగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం

ఎమ్మెల్యే స్వామి
పలు గ్రామాల్లో ముమ్మర ప్రచారం
ప్రజలతో మమేకం



ఎస్ఎన్ కండ్రిగలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 28 : సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని కొండపి ఎమ్మెల్యే, కూటమి బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని పచ్చవ, వర్ధినేనివారిపాలెం, పీరాపురం, సాధువారిపాలెం, పాలేటిపాడు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి ఎన్నికల ప్రచార రథంపై నుంచి పలు గ్రామాల్లో మాట్లాడారు. టీడీపీ మేనిఫెస్టోను స్వామి వివరించారు. మహిళలకు మహాలక్ష్మి పథకంతో పాటు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను పాటుపడతానన్నారు. వైసీపీ పాలనలో పేదరైతు, బడుగు, బలహీన వర్గాల వారికి అన్యాయం జరిగిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని స్వామి పిలుపునిచ్చారు.

మహిళల స్వాగతం...

స్వామికి అన్ని గ్రామాల్లో మహిళలు భారీ స్వాగతం పలికారు. హారతులిచ్చి పూలు చల్లి స్వామిని గ్రామాల్లోకి తీసుకెళ్లారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పార్టీ సీనియర్ నాయకుడు పోటు పెదబాబు, పార్టీ మహిళా విభాగం అధికార ప్రతినిధి విజయనిర్మల, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, బీజేపీ నాయకుడు బాలకోటయ్య, టీడీపీ నాయకులు కామాక్షయ్య, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, గాలి సందీప్, సాధువారిపాలెం నాయకుడు కక్కయ్య పాల్గొన్నారు.

పొన్నలూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్ 28: పొన్నలూరుకు చెందిన దాదాపు 20 మంది వైసీపీని వీడి ఆదివారం మధ్యాహ్నం తూర్పు నాయుడుపాలెంలోని సత్య కార్యాలయం వద్ద టీడీపీలో సత్య సమక్షంలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారికి సత్య పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పొన్నలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, గడ్డం మాధవరావు, గడ్డం మురళి, గడిపూడి సుందరరావు, వీరనారాయణ, పొదిలి వెంకటేశ్వర్లు, తన్నీరు మాల్యాద్రి, పోతినేని ఓంకారం, తిరుమల నాయుడు, దత్తాత్రేయ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, నాయకులు కర్నా కోటిరెడ్డి, గుమ్మళ్ల వెంకటరావు, రాష్ట్ర రైతు కార్యదర్శి రాఘవరెడ్డి, పల్లపోతు కోటేశ్వరరావు, పల్లపోతు మాధవ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో దామచర్ల సత్య

దళితులను దగాచేసిన మోసకారి జగన్‌రెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ స్వామి
టీడీపీలో చేరిన పలు కుటుంబాలు



పాకల అంబేడ్కర్ నగర్ వైసీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఏప్రిల్ 28 : దళితులను దగా చేసిన మోసకారి జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితులకు అందే 27 పథకాలను రద్దుచేసి దళిత ద్రోహిగా జగన్ ముద్రవేసుకున్నారని తెలిపారు. మండలంలోని పాకల అంబేడ్కర్ నగర్ వైసీపీకి చెందిన 15 కుటుంబాల వారు ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే స్వామి సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులు అన్ని విధాలుగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దళిత కాలనీలు అభివృద్ధికి నోచుకోకుండా చేశారని మండిపడ్డారు. ఎస్సీ కార్పొరేషన్‌ను సైతం నిర్వీర్యం చేసి దళితులను అణచివేశారని దుయ్యబట్టారు. దళితవాడల్లో టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో లింగంగుంట మాలకొండయ్య, తిరుపతి బ్రహ్మానందం, కొండలు, పులుగురు ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, శివరామయ్య, బాలాజీ, మురళి, మహేష్, శివకోటయ్య కల్లూరి నాగరాజు, పలు కుటుంబాల వారు ఉన్నారు. కాగా పాతసింగరాయకొండ పంచాయతీ వైసీపీకి చెందిన చవిడిబోయిన రవి, యనాది సేవా సంఘం నాయకులు ఏలూరి శ్రీనివాసులు, మల్లవరపు శ్రీనివాసులు స్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, చవిడిబోయిన మురళి, శివ పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయిలో మహిళాభేరి

కొండపి, ఏప్రిల్ 28: కొండపి నియోజకవర్గ స్థాయిలో కొండపిలోని కామేపల్లి రోడ్డులోని కల్యాణ మండపంలో సోమవారం ఉదయం మహిళా భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న, అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార అధ్యక్షురాలు ఆచంట సునీత, యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డి, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొంటారని వివరించారు.

బాలకృష్ణ సభకు భారీ జనసమీకరణ

కొండపి, ఏప్రిల్28: మండల కేంద్రమైన మర్రిపూడిలో మంగళవారం సాయంత్రం జరిగే ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రోడ్‌షో, సభకు భారీగా జనసమీకరణ చేపడుతున్నామని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో ఆదివారం మాట్లాడుతూ బాలకృష్ణ సభకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

టంగుటూరులో వైసీపీకి భారీ షాక్

స్నేహలత సహా 100 కుటుంబాలు టీడీపీలో చేరిక



స్నేహలతకు టీడీపీ కండువా కప్పి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టంగుటూరు, ఏప్రిల్ 28 : మండల కేంద్రం టంగుటూరులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కురుగుంట్ల శిల్వాన్ రాజు సహచరి స్నేహలత వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆమెతోపాటుగా టంగుటూరులోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్నేహలతతోపాటుగా పార్టీలో చేరిన అందరికీ టీడీపీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ ఏడాది జరిగిన పంచాయతీ ఎన్నికల్లో స్నేహలత వైసీపీ నుంచి గ్రామ సర్పంచ్‌గా పోటీచేసి టీడీపీ మద్దతుదారు మద్దిరాల మమత చేతిలో ఓటమిపాలయ్యారు. అప్పటి నుంచి టంగుటూరులో వైసీపీ నాయకురాలుగా కొనసాగుతున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఈప్రాంతానికి వచ్చిన నాటి నుంచి కురుగుంట్ల కుటుంబంతో అత్యంత సన్నిహితంగా కొనసాగుతున్నారు. దీంతో స్నేహలత వైసీపీని వీడడం ఆపార్టీకి తీరని లోటుకానుంది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్నేహలత టీడీపీలో చేరిక టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి దోహదపడుతుందన్నారు. దామచర్ల సత్య మాట్లాడుతూ స్నేహలత టీడీపీలో చేరడం ద్వారా ఆమె కుటుంబ భవిష్యత్‌కు బంగారు బాటలు పడ్డాయన్నారు. తెలుగుదేశం ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి టీడీపీ అభ్యర్థుల విజయంలో భాగస్వాములు కావాలని కోరారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ టీడీపీతో బావితరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిరాల మమత, కురుగుంట్ల స్నేహలత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మధుసూదనరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, పెద్దోడు, యజమాని, కామని శ్రీను, కుందేటి వెంకట్రావు పాల్గొన్నారు.

ఓటుతో వైసీపీని తరిమేయండి

- సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించి.. కార్పొరేషన్ రుణాలు రద్దు చేసి..
- దళిత యువతకు ఉపాధి లేకుండా చేసిన జగన్
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్



కొంగపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 28 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించడంతో పాటు కార్పొరేషన్ రుణాలను రద్దు చేసి దళిత యువతకు ఉపాధి లేకుండా చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కొంగపాడులో రవికుమార్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సూపర్ సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వైసీపీ 2019 మ్యానిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామని అబద్ధాలు చెప్తుందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, మెగా డీఎస్సీ మాటే లేదని, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయలేదని, మద్య నిషేధం ఊసేలేదని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా పూర్తి కాలేదన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్ రాజధాని లేకుండా చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు.

ఎస్సీ కాలనీలో గొట్టిపాటి ప్రచారానికి మంచి స్పందన వచ్చింది. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, నర్రా బ్రహ్మానందం, కరి సుబ్బారావు, మాచవరపు సుబ్బారావు, చిరంజీవి, శ్రీనివాసరావు, కమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని 14వ వార్డులో ఎమ్మెల్యే రవికుమార్ ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయరన్నారు. పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జహీరా, విజయలక్ష్మి, అత్తులూరి రమేష్, సుభాషిణి, కంపా రజనీ, మాగులూరి తిరుపతమ్మ, తేజశ్వని, మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు, టీడీపీ నేతలు కుందారపు రామారావు, శ్రీనివాసరావు, కాసా పుల్లయ్య, గుడివిల్ హనుమంతరావు పాల్గొన్నారు.

'దర్శి' అభివృద్ధే ధ్యేయం

- మీ ఆడబిడ్డగా వచ్చా.. ఆదరించండి
- టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 28: దర్శి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని జముకు లదిన్నె, లక్ష్మీనారాయణపురం, కొత్తపల్లి, కొర్లమడుగు, కృష్ణాపు రం, త్రిపురసుందరీపురం, ఉయ్యాలవాడ, రాజంపల్లి గ్రామా ల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామా ల ప్రజలు, మహిళలు ఘనస్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. హారతులిచ్చి దీవించారు. ఈసందర్భంగా గొట్టి పాటి లక్ష్మి మాట్లాడుతూ మీరు చూపుతున్న ప్రేమానురాగాలు మరువలేనివన్నారు. నిస్వార్థ సేవలందించి మీ రుణం తీర్చుకుంటాన న్నారు. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలి గా, మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య కుమార్తెగా వారి ఆశయాలకు అనుగుణంగా నిజాయతీగా పనిచేస్తామన్నారు. బాబాయి గొట్టిపాటి రవికుమార్ అడుగుజాడల్లో నడుస్తూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



రాజంపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి



జువ్విగుంటలో అగ్నికి ఆహుతి అవుతున్న నిమ్మతోట

ఆర్అండ్‌బీ సిబ్బంది నిర్వాకం

- టంగుటూరు - పొదిలి రహదారిలో ఎగిసిన అగ్ని కీలలు
- కాలిపోయిన నిమ్మతోట
- అగ్నికి ఆహుతిఅయిన స్ప్రింక్లర్లు, పైపులు
- ఐదులక్షల మేర ఆస్తినష్టం

మర్రిపూడి, ఏప్రిల్ 28 : మండలంలోని జువ్విగుంట సమీపంలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా అగ్నికీలలు ఎగిసిపడాయి. ఉధృతంగా వీస్తున్నగాలులకు కారుచిచ్చులా మంటలు ధర్మవరం బస్టాండ్ వరకు వ్యాపించాయి. ఈ ప్రమాదం కారణంగా రహదారిపక్కనే ఉన్న నిమ్మతోటకు మంటలు వ్యాపించాయి. సుమారు 50చెట్లకుపైగా పూర్తిగా కాలిపోయాయి. ఈమంటల్లో నిమ్మతోటకు ఏర్పాటు చేసిన పైపులు, స్ప్రింక్లర్లు కాలి బూడిద అయ్యాయని బాధితుడు మేదరమిట్ల చలపతిరావు వాపోయాడు. నాలుగు లక్షలకుపైగా నష్టం వాటిల్లిందన్నారు. పక్కనే ఉన్న మిరపతోటకు ఏర్పాటు చేసిన పైపులు, పట్టలు కాలిపోవడంతో 50వేల రూపాయలకుపైగా నష్టం వాటిల్లిందని కౌలురైతు ఎనిమిరెడ్డి చెంచిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఆర్అండ్‌బీ సిబ్బంది రోడ్డుపక్కన మొలిచిన గడ్డిని, చెట్లను నిర్మూలించేందుకు నిప్పు పెడుతున్నట్లు సమాచారం. వారి నిర్వాకం వల్లనే మంటలు పెద్దఎత్తున ఎగిసిపడటంతో తీవ్రంగా నష్టపోయామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ధర్మవరం సమీపంలో అగ్నికీలలు ఎగిసిపడటంతో 50 మూగజీవాలు మంటల్లో చిక్కుకోవడంతో కాపరులు వాటిని సురక్షితంగా కాపాడగలిగారు. ఈదశలో సమీపంలో ఉన్న వ్యవసాయబోరు నుంచి మంటలను ఆర్పేందుకు అన్నదాతలు తీవ్రంగా శ్రమించారు. రోడ్డుపై మంటలు చెలరేగడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఒకవైపు కరువు తీవ్రతతో చెట్లను కాపాడుంటున్నప్పటికీ అగ్నిప్రమాదం కారణంగా పసిపిల్లల్లా పెంచుకున్న చెట్లు కాలిపోవడంతో నష్టపోయాయనని అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

రాజంపల్లిలో యువకుడి హత్య



హత్యకు గురైన రాజావెంకటేశ్వర్లు

దర్శి, ఏప్రిల్ 28: మండలంలోని రాజంపల్లిలో ఆదివారం మధ్యాహ్నం మోటా రాజవెంకటేశ్వర్లు(23) అనే యువకుడుదారుణ హత్యకు గురయ్యాడు. ఆస్తి విషయాలు, కుటుంబ కలహాలే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడివారిపల్లి మండలం, తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామానికి చెందిన మోటా రాజవెంకటేశ్వర్లు ఆదివారం తన బావ దేవరకొండ వెంకటరామయ్య ఇంటికి వచ్చాడు. వెంకటరామయ్యకు రాజంపల్లిలో చికెట్ కొట్టు ఉంది. చికెన్ ఆర్డర్ ఉండటంతో అతనికి సాయం చేసేందుకు వచ్చాడు. షాపులో పనిచేస్తుండగా వెంకటేశ్వర్లుకు బంధువులైన చందు ప్రభాకర్, దేవరకొండ రామారావు దేవరకొండ వెంకటేశ్వర్లు, అతని భార్య వెంకటరమణమ్మలు కుటుంబ కలహాల విషయమై చర్చించుకుంటూ వాదులాడుకుంటున్నారు. వెంకటరమణమ్మ భర్త వెంకటేశ్వర్లుది తెనాలి కాగా అతనితో విభేదించి రాజంపల్లికి వచ్చి కొంతకాలంగా ఇక్కడ ఉంటుంది. షాప్ పక్కనే పంచాయితీ జరుగుతూ వాదులాడుకుంటుండటంతో రాజవెంకటేశ్వర్లు కూడా బంధువు కావటంతో అక్కడకు వెళ్లి సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. అక్కడ వాదన పెరగటంతో చందు ప్రభాకర్ అనే వ్యక్తి పథకం ప్రకారం తెచ్చుకున్న కత్తితో వెంకటరమణమ్మను పొడవబోయాడు. ఆమె తప్పించుకోవటంతో ఆ కత్తిపోటు రాజవెంకటేశ్వర్లు గుండెల్లో దిగింది. ఆ తర్వాత వెంకటరమణమ్మ తల్లి తిరుపతమ్మను కూడా కత్తితో పొడిచాడు. ఈ ఘటనలో రాజా వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందగా తిరుపతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం నిమిత్తం ఒం గోలు తరలించారు. దర్శి సీఐ షమీముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దొనకొండ, ఏప్రిల్ 28: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అందిన సమాచారం మేర కు. మండలంలోని చందవరం గ్రామానికి చెందిన బద్దిగం శ్రీనివాసరెడ్డి(38) ఈ నెల 21వ తేది ఉదయం పొలంలో పురుగుల మందు సేవించాడు. తండ్రి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవటంతో కొడుకు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ శ్రీనివాసరెడ్డి వాంతులు చేసుకుంటూ ఉండగా, ఏం జరిగిందని ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో హుటాహుటీన ఎర్రగొండపాలెం వై ద్యశాలకు తరలించారు. రెండు రోజులపాటు అక్కడ చికిత్సపొందిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సమాచారం. మృతిచెందిన శ్రీనివాసరెడ్డి తనకున్న ఒకటి న్నర ఎకరం పొలంలో బొప్పాయి, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగుచేసి నష్టపోయాడు. అప్పుల బాధతో పురుగుల మందు తాగినట్లు సమాచారం.

జన కేతనం

ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 29 ఏప్రిల్ 2024


సింగరాయకొండ ప్రార్థనా మందిరంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

ఓట్ల కోసం మంత్రి సురేష్ అనుకూల రాజకీయం

సొంత సామాజికవర్గానికి చెందిన పల్లెలే టార్గెట్

ఆయన కుమారుడు సైతం వారి చుట్టూ ప్రదక్షిణలు

చర్చిలలో సమావేశాలు.. ఆదరించాలని విజ్ఞప్తులు

చేసిన అభివృద్ధి చెప్పకుండా మీవాడినంటూ ఓట్లు అడుగుతుండడంపై విమర్శలు

యర్రగొండపాలెంలో ఏమి ఉద్ధరించారని ప్రజల్లో చర్చ

సింగరాయకొండ, ఏప్రిల్ 28 : కొండపి నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా మంత్రి ఆదిమూలపు సురేష్ కుల రాజకీయాలకు తెరలేపారు. టీడీపీ కంచుకోటలో ఓట్లు దండుకోవడానికి తన సొంత సామాజికవర్గానికి చెందిన పల్లెల్లో కులం కార్డు ప్రయోగిస్తూ బేల అభ్యర్థనలు చేస్తున్నారు. జగనన్న ఆదేశాల మేరకు వైసీపీ కొండపి అభ్యర్థిగా పోటీచేస్తున్నా.. ఒక్క అవకాశం ఇవ్వండి ప్లీజ్ అని దీనంగా వేడుకుంటూ మభ్యపెట్టే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. టీడీపీతో వీడదీయరాని అనుబంధం ఉన్న ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి తమ వైపు తిప్పుకునేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. చర్చిలలో సైతం ఆత్మీయ సమావేశాల పేరిట తనను ఆదరించాలని మంత్రి ప్రచారం నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన అభివృద్ధిని, మేలును వివరించి ఓట్లు అడగాలని కాని కులం పేరుతో ఓట్లు అభ్యర్థించడం ఏమిటోనని ఆ వర్గంవారే బహిరంగంగా ఈసడించుకుంటున్నారు.

తొలిరోజు తీరుతోనే ప్రజలు విస్మయం

నియోజకవర్గంలో వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కొండపిలో సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఆ వేడుకల్లో భోజనాలకు, దుస్తుల పంపిణీకి సంబంధించిన ఖర్చులను పోలీసులపై మోపారు. దీంతో మంత్రి సురేష్ నైజంపై నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర చర్చ నడిచింది. సురేష్ తనయుడు సైతం పల్లెల్లో తిరుగుతూ కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని తహతహలాడుతున్నారు.

మంత్రిగా పనిచేసినా చేసిందేమీ లేదు

వైసీపీ ప్రభుత్వంలో దళిత మంత్రిగా ఐదేళ్లు బాధ్యతలు నిర్వహించి దళితుల సమస్యలనుకాని, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన యర్రగొండపాలెం సమస్యలను గానీ పరిష్కరించడంలో ఆదిమూలపు పూర్తిగా వైఫల్యం చెందారనే ఆరోపణలు ఉన్నాయి. పైగా తనను గెలిపించి మంత్రిని చేసిన యర్రగొండపాలెంలో తాగునీటి సమస్యను పరిష్కరించలేకపోయారు. దీంతో నిత్యం అక్కడ ప్రజలు బిందెలతో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నా ఆ సమస్యలతో తనకేం సంబంధం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సురేష్ అసమర్థత వలన బిందెడు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. చివరికి మా మంత్రి సురేష్ కనిపించడం లేదని పోస్టర్లు వేశారంటే అక్కడ ప్రజల్లో ఆయన పట్ల ఎంత వ్యతిరేకత ఉందో తేటతెల్లమవుతోంది.


కాలనీల్లో తారతమ్యం చూపకుండా అభివృద్ధి చేసిన టీడీపీ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని దళిత కాలనీల్లో ఎలాంటి తారతమ్యం చూపకుండా ఎమ్మెల్యే స్వామి అభివృద్ధి చేశారు. తన దృష్టికి దళితులు తీసుకొచ్చిన సమస్యలను స్థానికంగా ఉండి పరిష్కార మార్గాన్ని చూపేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితులకు అమలు చేసిన 27 పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి, ఎస్సీ కార్పొరేషన్‌ను సైతం నిర్వీర్యం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు తెగబడి హత్యలు చేశారు. దీంతో దళితుల్లో మెజారిటీ భాగం వైసీపీ పట్ల వ్యతిరేకంగా ఉన్నారు.

వైసీపీ పాలనలో దళితులపై జరిగిన దాడులను ఏరోజు కూడా మంత్రి సురేష్ ఖండించలేదనే భావన ఉంది. దీనికి నిదర్శనం సింగరాయకొండలో వైసీపీ నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తే కొండపి నియోజకవర్గంలో 76 వేల మందికి పైగా దళితులు ఉంటే కేవలం 200 మంది మాత్రమే హాజరవడం గుర్తించాల్సిన విషయం.

మంత్రి సురేష్ చుట్టూ కోటరీ ఆ వర్గం వారే..!

మంత్రి సురేష్ వైసీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సీఎం జగన్‌రెడ్డి సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తులే ఆయన చుట్టూ కోటరీగా ఉన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న దళిత నాయకులకు మంత్రి ప్రాధాన్యత ఇవ్వలేదు. వైసీపీలోని దళితులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మాయమాటలతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గంలో కూడా కొంతమంది వ్యక్తులకే ప్రాధాన్యత ఇవ్వడంతో మిగతా నాయకులు సమయం వస్తుందిగా చూద్దాం.. అంటూ పరోక్షంగా తమ అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు.



ప్రపంచంలో ఏపీకి ఐటీ గుర్తింపు బాబు చలువే

సంతనూతలపాడు, ఏప్రిల్ 28 : నవ్యాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు నిరంతర శ్రామికుడిలా పనిచేశారని, ప్రపంచంలో ఉమ్మడి ఏపీ ఐటీకి గుర్తింపు బాబు చలువేనని తెలుగు ప్రొఫెషనల్ వింగ్ టీం సభ్యులు చెప్పారు. ఆదివారం రాత్రి బొడ్డువారిపాలెం, గంగవరం, లక్ష్మీపురం గ్రామాల్లో టీడీపీ కూటమికి ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఐటీ పరంగా చంద్రబాబు విశేష కృషి చేశారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం బటన్ నొక్కడం తప్ప చేసిందేమీ లేదని వారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి తేనేటీ కృష్ణప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ప్రొఫెషనల్ వింగ్ టీం ప్రెసిడెంట్ మన్నం రామక్రిష్ణ, సభ్యులు మురళిగిరిధర్, సుబ్బయ్య, రామక్రిష్ణ, గోపినాథ్, కాలేషా, యశ్వంత్, అవినాష్, సాయి, శరత్, శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.


టీడీపీ గెలుపు కోరుతూ ఐటీ ఉద్యోగుల ప్రచారం

మీరేనా.. నేను కూడా...!

ఎన్నికల ప్రచారంలో కాపరులతోపాటు వారి పొటేళ్లు సైతం పాల్గొన్నాయి. అద్దంకి మండలం కొంగపాడులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరులు తమ పొట్టేలుకు పసుపు రంగు వేసి ఎన్నికల ప్రచారంలో తిప్పడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింద. - అద్దంకి


కొంగపాడులో పొట్టేలుతో పక్కన ఎమ్మెల్యే రవికుమార్

వైసీపీ కండువా రాజకీయం

టీడీపీలోని రెడ్డి సామాజిక వర్గ నేతలకు బలవంతంగా పార్టీలోకి

తీసుకెళుతున్న అధికార పార్టీ నేతలు

తీవ్రంగా విమర్శిస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలు

వెలిగండ్ల, ఏప్రిల్ 28 : వెలిగండ్ల మండలంలో వైసీపీ నాయకులు కండువా రాజకీయాలు చేస్తున్నారు. తమ బలం పెరిగినట్లు చూపించుకునేందుకు బలవంతంగా కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. నెల క్రితం మండలంలోని తమ్మినేనిపల్లి పంచాయతీలో వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అడగటానికి వెళ్లి ఇంట్లో ఉన్న టీడీపీకి చెందిన కర్నాటి క్రిష్టారెడ్డికి వైసీపీ కండువా కప్పి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకున్నారు. మొదటి నుంచి క్రిష్టారెడ్డి కుటుంబం టీడీపీలో ఉంది. దీనిపై వారి కుటుంబసభ్యులు వైసీపీ నాయకులు నీచరాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా మండలంలోని మోటుపల్లి వైసీపీ సర్పంచ్ గాలి తిరుపతిరెడ్డి శనివారం కనిగిరిలో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో స్వచ్ఛందంగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ మండల నాయకులు ఆదివారం ఉదయం తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్లి మళ్లీ వైసీపీ కండువా కప్పి ప్రచారం చేసుకుంటున్నారు. మరపగుంట్ల, హుస్సేన్‌పురం, పి.రాళ్లపల్లి, పూలికుంట్ల పంచాయతీల్లో టీడీపీలో చేరిన కుటుంబాలకు బలవంతంగా వైసీపీ కండువాలు కప్పుతున్నారు. ఒకరిద్దరికి కండువాలు కప్పి పదుల సంఖ్యలో టీడీపీని వీడి వైసీపీలో చేరుతున్నట్లు మండల నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. ఓడిపోతామనే భయంతో వైసీపీ నాయకులు నీచపు రాజకీయం చేస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు.


శనివారం టీడీపీలోకి


ఆదివారం వైసీపీలోకి

ప్రతి చోటా ప్రత్యేక దృష్టి..!

ఎన్నికల ప్రచారంలో మాగుంట

కుటుంబ సభ్యులు నిశిత ప్రచారం

ఒంగోలు పార్లమెంట్‌లో విస్తృతంగా

శ్రేణులతో కలిసి పర్యటనలు

గెలుపు కోసం టీడీపీలో చేరికలకు శ్రీకారం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 28 : ఒంగోలు లోక్‌సభతో పాటు ఆ పరిధిలో ఉన్న నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబసభ్యులు శ్రీకారం చుట్టారు. ఒక వైపు మాగుంట శ్రీనివాసులరెడ్డి ముఖ్యనేతలతో వరుస భేటీలు నిర్వహిస్తూ ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహిస్తుండగా, ఇంకొక వైపు ఆయన తనయుడు రాఘవరెడ్డి పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులు రోజుకు నాలుగైదు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధాన భూమిక రాఘవరెడ్డి, ఆయన భార్య చందనలు పోషిస్తున్నారు. వారిద్దరూ ఎక్కువ సమయం జిల్లా పశ్చిమ ప్రాంతంలోనే మకాం వేసి ఎంపీ అభ్యర్థి మాగుంటతో పాటు ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో తాళ్లూరు మండలం బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ సుమలత, ఆమె భర్త శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, ఆమె భర్త గోడ ప్రభాకర్‌రెడ్డిలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వారి వెంట గోడ జయరామిరెడ్డి, దోసకాయల ప్రభాకర్‌రెడ్డి, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, గువ్వల సాంబిరెడ్డితో పాటు పలు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఇక గిద్దలూరు నియోజకవర్గంలోని సంజీవిరాయునిపేటలో మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందనరెడ్డి అక్కడి టీడీపీ కూటమి అభ్యర్థి అశోక్‌రెడ్డి సతీమణి పుష్పలీలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ మండలంలోని పలు గ్రామాలను ఆమెచుట్టేశారు. కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండలం పాకల, బంగారమ్మతోట, ముస్లింకాలనీ, తూర్పు బజారులో మాగుంటకు మద్దతుగా ఆయన మరదలు సహనరెడ్డి, మేనకోడలు కీర్తిరెడ్డి, రజితరెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇలా మాగుంట కుటుంబ సభ్యులు పలు నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా ఒంగోలులో ఆదివారం సాయంత్రం ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌తో కలిసి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. న్యాయవాదుల ఆత్మీయ సమావేశంతో పాటు సీఆర్పీ క్వార్టర్స్ సమీపంలోని రైల్వే స్థలాల గుడిసెవాసులతో జరిగిన ఆత్మీయ సమావేశంలోనూ మాగుంట పాల్గొన్నారు.


మాగుంట సమక్షంలో టీడీపీలో చేరిన బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ సుమలత, ఆమె భర్త శ్రీకాంత్‌రెడ్డి

మంచోళ్లయితే సీటెందుకు మార్చారు..!

కందుకూరు సభలో జగన్ మాటలపై వైసీపీ శ్రేణుల విస్మయం

మహీధర్, బుర్రా మంచోళ్లే అంటూ మైక్ ఇవ్వని జగన్

ఏడాదిక్రితం ఇచ్చిన హామీల ఊసేలేదు

కందుకూరులో ఆకట్టుకోని ప్రసంగం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీనియర్ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మంచోడు, పెద్ద మనిషి.. ప్రస్తుత కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ మంచోడు సౌమ్యుడు అని సీఎం జగన్ కొనియాడటంపై వైసీపీ శ్రేణులే విస్మయానికి గురయ్యారు. వారు మంచోళ్లు, సౌమ్యులైతే ఎమ్మెల్యేగా ఉన్న మహీధర్‌రెడ్డిని పోటీ నుంచి ఎందుకు తప్పించారు.. కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రాను కందుకూరుకు ఎందుకు బదిలీ చేశారన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరులో ఆదివారం సాయంత్రం జరిగిన బహిరంగసభలో జగన్ పాల్గొని ప్రసంగించారు. ప్రసంగం చివర్లో ఆయన ఒకరిని గురించి చెప్పాలి అంటూ వెనుకున్న మహీధర్ రెడ్డిని ముందుకు పిలిచి చాలా మంచివారు.. పెద్ద మనిషి అని కొనియాడుతూ ఈసారి సీటు ఇవ్వలేకపోతున్నా అని చెప్పగానే ఒప్పేసుకున్న సౌమ్యుడు అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత పోటీలో ఉన్న బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను ఉద్దేశించి చాలా మంచోడు.. సౌమ్యుడు.. మంచిపేరున్న నాయకుడు అని వ్యాఖ్యానించారు. నిజానికి కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రాపై తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో చిన్నచిన్న పనులు కూడా ఆయనే చేసుకుంటూ అక్రమ సంపాదన కొనసాగించారన్న ఫిర్యాదులు ఆ పార్టీ నేతలే జగన్‌కు పలుమార్లు చేశారు. కార్యకర్తలను గౌరవించడూ.. గుర్తించడూ.. ప్రధానంగా రెడ్డి సామాజికవర్గం వారిని అణగదొక్కారని జగన్ ముందు పలుమార్లు మొరపెట్టుకున్నారు. ఆయనకు కనిగిరి టికెట్ ఇస్తే సహకరించబోమని తేల్చి చెప్పారు. దీంతో పక్కనే ఉన్న కందుకూరుకు ఆయన్ను మార్చి రంగంలోకి దింపారు. ఈ విషయాలన్నీ దాచిపెట్టి మంచోడు, సౌమ్యుడు అని పొగడం ఆ పార్టీశ్రేణుల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఇప్పటికి నాలుగుసార్లు గెలుపొందగా, అంతకుముందు రెండుసార్లు గెలుపొందారు. బలమైనవర్గం వారికి అండగా ఉంది. అయినా ఎక్కడా సీటు ఇవ్వకుండా తప్పించేసి ఇప్పుడు అవసరం కొద్ది ఎన్నికల సభలో ఆయన్ను పొగడటం గమనార్హం. అంతకుముందు మహీధర్‌రెడ్డి హెలిప్యాడ్ వద్ద సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి వెంటనే పక్కకు వెళ్లిపోయారు. సీఎం అక్కడి నుంచి బయలుదేరేటప్పుడు మహీధర్‌రెడ్డి ఎక్కడున్నారో తీసుకురండి అని చెప్పడంతో అప్పటికే పక్కకు వెళ్లిన మహీధర్‌రెడ్డిని తీసుకొచ్చి కారు ఎక్కించారు. ఇవన్నీ అటుంచితే గంటకుపైగా జరిగిన సభలోవారిద్దరూ మాట్లాడేందుకు ఒక్క నిమిషం కూడా అవకాశం ఇవ్వలేదు. పైగా ఏడాది క్రితం నియోజకవర్గానికి వచ్చినప్పుడు సీఎం జగన్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ఇచ్చిన హామీలలో ఒక్కటీ అమలు కాలేదు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు, రాళ్లపాడు రిజర్వాయర్ ఎడమ కాలువ అభివృద్ధికి నిధులు వెంటనే ఇస్తామని ప్రకటించారు. వాటితోపాటు ఆయన ఇచ్చిన హామీలు మరకొన్ని అమలు కాకపోగా, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ఒక్క మాటకూడా మాట్లాడకపోవడం వైసీపీ శ్రేణులు నీరసపడ్డారు.


మాట్లాడుతున్న జగన్, పక్కన మానుగుంట, బుర్రా

సంతనూతలపాడు విలక్షణం

అన్ని పార్టీలకు ఆదరణ, పార్టీ అభ్యర్థులుగా

ఒక్కొక్కరికి ఒక్కసారే గెలుపు అవకాశం

13వ సారి ఎన్నికలు, రెండు సార్లు గెలుపొందింది ఇద్దరే

గతంలో తవనం, ప్రస్తుతం బి.ఎన్.పలుసార్లు పోటీ

వనరులు అధికం, సమస్యలు కూడా అలాగే

ఒంగోలు, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం విలక్షణమైంది. పూర్తిగా గ్రామీణ వాతావరణం ఇమిడి ఉండే ఈ నియోజకవర్గంలో జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఉపాధి వనరులు కాస్తంత అధికంగానే దొరుకుతుంటాయి. అదే స్థాయిలో సమస్యలు కూడా అధికమే. వ్యవసాయం, పాడి పరిశ్రమ ప్రధాన జీవనాధారం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్, వాటి అనుబంధంగా వందలాది వందలాది ఫ్యాక్టరీలు, ఒంగోలు డెయిరీ, గుండ్లకమ్మ ప్రాజెక్టు, రామతీర్థం రిజర్వాయర్ ఇలా పలు ప్రముఖమైనవి ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్కరంగంలోనూ గట్టి కృషి జరిగిన పరిస్థితి లేక ఆ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పట్టణ, గ్రామీణ వాతావరణం కలగలసి...

ఒంగోలు నగరానికి చుట్టుపక్కలా ఉండే సంతనూతలపాడు నియోజకవర్గంలో పట్టణ, గ్రామీణ వాతావరణం కలగలసి ఉంటోంది. చీమకుర్తి నగర పంచాయతీ, చీమకుర్తి రూరల్, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలు ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతం నుంచి గ్రానైట్ క్వారీలు ఉండే గ్రామాల వరకు ఇందులో ఉండగా మొత్తం 2,13,962 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,05,119 మంది పురుషులు కాగా, 1,08,839 మంది మహిళలు ఉన్నారు. ఓటర్లలో రైతులు, రైతుకూలీలు, వ్యవసాయ ఆధారంగా నివసించే ఇతర వర్గాలు అధికం. మెరుగైన జీవనం కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారు, ఉన్నత విద్య, ఉద్యోగాలు చేస్తూ ఇతర ప్రాంతాలలో ఉండే వారు కూడా అధికంతో పాటు రాజకీయ ప్రభావం చూపే పరిస్థితి ఉంటుంది.

1962లో ఈ నియోజకవర్గం ఏర్పడగా తొలినాళ్లలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ తరువాత టీడీపీ, కాంగ్రెస్ తర్వాత వైసీపీలు ప్రధాన రాజకీయ పార్టీలుగా ఉంటూ వస్తున్నాయి. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన సంతనూతలపాడు నియోజకవర్గంలో వరుసగా రెండోసారి గెలుపొందిన అభ్యర్థి లేరు. మొత్తం ఇప్పటివరకు 13 సార్లు ఎన్నికలు జరగ్గా కమ్యూనిస్టు నేత తవనం చెంచయ్య ఎక్కువగా 5 సార్లు పోటీ చేసి రెండుసార్లు గెలుపొందారు. తొలిసారి 1962లో సీపీఐ అభ్యర్థిగా గెలుపొందిన ఆయన 1994లో టీడీపీ మద్దతుతో సీపీఎం తరపున గెలుపొందారు. ఇక ఆరేటి కోటయ్య కూడా రెండుసార్లు గెలుపొందినా ఆయన కూడా ఒకసారి కాంగ్రెస్, మరోసారి టీడీపీ తరఫున విజయం సాధించారు. మిగిలిన వారంతా ఒక్కసారే గెలిచారు. ఇదిలా ఉండగా కొందరికి రెండవసారి పోటీ చేసే అవకాశం కూడా రాలేదు. అయితే గతంలో తవనం చెంచయ్య పలుమార్లు పోటీ చేయగా ప్రస్తుత ఎన్నికలులో టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఎక్కువసార్లు పోటీలో నిలిచారు. 2009లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన బీఎన్ అనంతరం 2014లో అలాగే 2019లో టీడీపీ తరఫున పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో ఓటమి పొందారు. తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున బరిలోకి దిగిన ఆయన ఈసారి గెలుపుపై పూర్తి విశ్వాసంతో కనిపిస్తున్నారు.

ప్రధాన సామాజిక వర్గాల వారీ ఓటర్ల వివరాలు

కమ్మ	76,414
రెడ్డి	13,550
ఎస్సీ(మాల)	33,289
ఎస్సీ (మాదిగ)	24,967
కాపు	10,432
యాదవ	10,369
వడ్డెర	9,475
ముస్లిం	7,325
ఇతర బీసీలు	17,500
వైశ్య	4,051
మొత్తం ఓట్లు	2,13,962
పురుషులు	1,05,119
మహిళలు	1,08,839

సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	సమీప ప్రత్యర్థి	మెజార్టీ
1962	తవనం చెంచయ్య(సీపీఐ)	వీ నాగరత్నం(కాంగ్రెస్)	2,991
1967	వీసీకే రావు(కాంగ్రెస్)	తవనం చెంచయ్య	9,821
1972	ఆరేటి కోటయ్య(కాంగ్రెస్)	తవనం చెంచయ్య	13,569
1978	వేమా యల్లయ్య(కాంగ్రెస్)	తవనం చెంచయ్య(సీపీఎం)	14,042
1983	ఆరేటి కోటయ్య (టీడీపీ)	చింతపల్లి పాల్(కాంగ్రెస్)	8,107
1989	జీవీ శేషు(కాంగ్రెస్)	తవనం చెంచయ్య(సీపీఎం)	11,897
1994	తవనం చెంచయ్య(సీపీఎం)	జీవీ శేషు(కాంగ్రెస్)	24,934
1999	పాలపర్తి డేవిడ్‌రాజు(టీడీపీ)	జీవీ శేషు(కాంగ్రెస్)	10,351
2004	దారా సాంబయ్య(కాంగ్రెస్)	పి.డేవిడ్ రాజు(టీడీపీ)	15,635
2009	బీఎన్ విజయ్‌కుమార్(కాంగ్రెస్)	జాలా అంజయ్య(సీపీఎం)	9,531
2014	ఆదిమూలపు సురేష్(వైసీపీ)	బీఎన్ విజయ్‌కుమార్(టీడీపీ)	1,276
2019	టీజేఆర్ సుధాకర్ బాబు(వైసీపీ)	బీఎన్ విజయ్‌కుమార్(టీడీపీ)	9,078




టీడీపీలో చేరిన కార్యకర్తలతో అశోక్‌రెడ్డి

రాక్షస పాలనకు స్వస్తి చెబుదాం

● టీడీపీ గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి పిలుపు ● రజక కుటుంబాలు ఆ పార్టీలో చేరిక ● బీసీలతోనూ ఆత్మీయ సమావేశం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 28 : రానున్న ఎన్నికలతో రాష్ట్రంలో రాక్షస పాలనకు స్వస్తి చెప్పాలని టీడీపీ గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణానికి చెందిన వంద రజక కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి ఆపార్టీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పచ్చకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ బలుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ ఏర్పడిందన్నారు. వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను స్థానికుడినని, నిరంతరం మీకు అందుబాటులో ఉండి ప్రజాసంక్షేమం కోసం పాటుపడతానన్నారు. పార్టీలో చేరిన వారిలో నర్సాపురం లక్ష్మీరంగయ్య, చలిజాముల కాదరయ్య, తిమ్మనపల్లె గురువయ్య, తురిమెళ్ల సురేష్, కొమరోలు శ్రీనివాసులు, మోక్షగుండం అంకయ్య, దద్దనాల పెద్దగురువయ్య, అలసందలపల్లె రామాంజనేయులు, తూర్పునాటి గోపాల్, పుల్లలచెరువు పుల్లయ్య, తదితరులు ఉన్నారు.

మాగుటూరు నుంచి పది కుటుంబాల చేరిక

అర్థవీడు మండలం మాగుటూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కేసనపల్లి నారాయణ ఆధ్వర్యంలో పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. ముత్తుముల అశోక్‌రెడ్డి వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో తాడి శ్రీను, కేసనపల్లి గురునాథం, వెంకటేష్, ఇప్పర్ల శ్రీను, బత్తిని శ్రీను, తిరుపతయ్య, గోరా కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

గిద్దలూరు టౌన్ : గిద్దలూరు ఎన్‌డీఏ కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి అశోక్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అనేక మంది బీసీ లపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు వెన్నుపోటు పొడిచిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బీసీలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గంలోని బీసీలు ముత్తుముల అశోక్‌రెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు.


ఇంటింటి ప్రచారంలో మాగుంట చందనరెడ్డి, పుష్పలీల

బీసీలకు సంపూర్ణ సహకారం అందిస్తా : ముత్తుముల

తాను బీసీల సంక్షేమం కోసం శాసనసభ్యునిగా ఉన్న సమయంలో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి చెప్పారు. రానున్న టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుం దన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు పేదల ఇళ్లలో వెలుగులు నింపుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బీసీ నాయకులు డాక్టర్ జేవీ.నారాయణ, బిల్లా రమేష్, ఆవులమంద శ్రీనివాసులు, వేములపాటి చంటి, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం బంగారు శ్రీనివాసాచారి, అలసందలపల్లి రామాంజనేయులు, రమణ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య ముత్తుముల పుష్పలీల, మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందనరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట గ్రామంలో రెండవ రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తుముల పుష్పలీల, మాగుంట చందనరెడ్డి టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. గిద్దలూరు అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఓటర్లకు వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి శాసనసభ అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డికి, పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓటు వేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, పట్టణ కౌన్సిలర్ పాలుగుళ్ల శ్రీదేవి పాల్గొన్నారు.


బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావుతో, ముత్తుముల అశోక్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఘటన

తర్లుపాడు, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సీతానాగులవరం పొలిమేర వద్ద ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., కంభం మండలం లింగాపురం గ్రామానికి చెందిన అన్నం రామసుబ్బారెడ్డి మార్కాపురం శివారు ప్రాంతంలో వెలసిన శ్రీ పోలేరమ్మ ఆలయం వద్దకు వెళ్లి మొక్కు తీర్చుకొని తిరిగి స్వగ్రామం లింగాపురం వస్తున్నాడు. మార్గమధ్యలో సీతానాగులవరం మలుపు వద్ద బైకు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రామసుబ్బారెడ్డి తలకు తీవ్రగాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జూదరుల అరెస్టు

గిద్దలూరు,ఏప్రిల్28: రాచర్ల మండలం చోళవీడు గ్రామ సమీప పొలాల్లో పేకాట ఆడుతున్న ఆడుతున్నట్లు సమాచారం అదుకున్న పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుండి రూ15వేలు నగదును, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సైవి.హరిబాబు తెలిపారు.

హోమంలో అపశ్రుతి

గిద్దలూరు, ఏప్రిల్ 28: రాచర్ల మండంలోని సోమిదేవిపల్లె గ్రామంలో శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న హోమం ఆదివారం అపశృతి చోటుచేసుకొంది. ఒక్కసారిగా మంటలు చేలరేగి సమీపంలోని హోమం సామాగ్రికి, తాటాకులకు మంటలు తాకడంతో విద్యుత్ పరికరాలు, మైక్ సెట్లు తదితర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపు చేసింది.

మద్యం దుకాణం గోడకు కన్నం

●15 మద్యం సీసాలు, ట్యాబు స్వైపింగ్ మిషన్ చోరీ


గోడకు వేసిన కన్నాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని రాయవరం గ్రామం పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్ వంతెన సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం గోడకు కన్నం వేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ తెలిపిన వివరాల ప్రకారం దుండగులు ప్రభుత్వ మద్యం దుకాణం గోడకు కన్నం వేసి షాపులో ఉన్న ఆరు ఫుల్‌బాటిల్ మద్యం సీసాలు, తొమ్మిది 180 ఎంఎల్ మద్యం సీసాలు, ఒక స్వైపింగ్ మిషన్, ఒక ట్యాబు చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని తెలిపారు. ఘటనా స్థలాన్ని తన సిబ్బందితో కలిసి పరిశీలించి మద్యం దుకాణం సిబ్బందితో వివరాలను సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 28 : మండలంలోని సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 7గంటల నుండి 11.30 గంటల వరకు విద్యుత్‌తీగల మరమత్తుల కారణంగా సరపరా నిలిపివేస్తున్నట్లు ముండ్లపాడు సెక్షన్ విద్యుత్ శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సంజీవరాయునిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కొమ్మునూరు, గడికోట, దొడ్డంపల్లె, సంజీవరాయునిపేట పరిధిలో, ఉయ్యాలవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని సూచించారు.

ఎన్నికల నిబంధనలు ప్రజలు పాటించాలి

● సీఐ రాములు నాయక్

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 28 : ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ రాములునాయక్ అన్నారు. ఎర్రగొండపాలెంలో 100 మంది సాయిధ పోలీసులతో ప్రధాన రోడ్లపై కవాతు నిర్వహించారు. ప్రజలకు నిబంధనలు వివరించారు.

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యం

మహిళా నాయకులు మాగుంట చందన, కందుల వసంత లక్ష్మి


ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట చందన, వసంతలక్ష్మి

మార్కాపురం, ఏప్రిల్ 28: మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత సాధ్యమని టీడీపీ నాయకులు మాగుంట చందన, కందుల వసంతలక్ష్మిలు అన్నారు. పట్టణంలోని 33వ వార్డులో ఆదివారం టీడీపీ నాయకులు మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందన, మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలు ఇంటింటికి మన కందుల ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా ఒక ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆడబిడ్డ నిధి క్రింద 15 యేళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, దీపం పేరుతో యేడాదికి 3 ఉచిత సిలెండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీని వాసులు, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు మర్రి జాన్సి, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

పొదిలి : రానున్న ఎన్నికల్లో కూటమి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కందుల నారాయణరెడ్డి సోదరి లక్ష్మీ కోరారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాల బజారులో గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో లక్ష్మీ ఇంటింటికి తిరిగి తన అన్నను ఆదరించాలని ఓటర్లను కోరారు. అదేవిధంగా నందిపాలెం గ్రామంలో నారాయణరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు.

వెలిగొండతోనే పశ్చిమ ప్రకాశం అభివృద్ధి

టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి


మీర్జపేటలో ప్రచారం నిర్వహిస్తున్న నారాయణరెడ్డి

తర్లుపాడు, ఏప్రిల్ 28: వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితేనే సాగు, తాగునీరు అందుతుందని వెలిగొండ ప్రాజెక్టుతోనే పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చెందుతుందని మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మీర్జపేట, చెన్నారెడ్డిపల్లె, తర్లుపాడు, రాగి సముద్రం, కలుజువ్వల పాడులో కందుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసేందుకు ప్రాజెక్టు పూర్తి కాకుండానే శిలాఫలకాలు వేసుకొని ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండేళ్ల లోపు పూర్తిగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. మార్కాపురం జిల్లా చేయకుండా వైసీపీ నాయకులు కుట్రలు చేశారన్నారు. మార్కాపురం జిల్లా అయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి అవుతుందన్నారు. గతంలో చంద్రబాబు జిల్లా చేస్తారని హామీ ఇచ్చారన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని కందుల అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలకు వివరించారు. ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి జిల్లాలో గత 35 ఏళ్ల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ప్రస్తుత వైసీపీ ఎంపీ అభ్యర్థి బాగోతం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు, మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కంచెర్ల కాశయ్య జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.గోపినాథ్ చౌదరి, నాయకులు రోశప్ప నాయుడు, గుర్రపుసాల నరసింహులు, జి.సుబ్బయ్య, ఈర్ల వెంకటయ్య, కాళంగి శ్రీనివాసులు, ఆరికట్ల వెంకటేశ్వరెడ్డి, జనసేన పార్టీ మండలాధ్యక్షులు సేతుల శ్రీనివాసులు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు గాయం లక్ష్మీరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి :మండలంలోని కంభాలపాడు గ్రామంలో పది కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మార్కాపురం మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఇంటింటికి మన కందుల కార్యక్రమంలో వీరు కందుల నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేశారు. రైతు సంఘ రాష్ట్ర నాయకులు ఆవులూరి యలమంద ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి కందుల నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్యకర్తలందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి, యువతకు భరోసా ఉంటుందన్నారు. కనుక తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కంభాలపాడు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను అంతమొందించాలి

టీడీపీ వై.పాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, ఏప్రిల్ 28: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను రానున్న ఎన్నికలలో ప్రజలు అంతమొందించాలని వై.పాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని కొండారెడ్డికాలనీ, రాజంపల్లి, చట్లమిట్ల, వైడీపాడు గ్రామాలలో ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే ఏపీలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద 15 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, దీపం పేరుతో ఏడాదికి 3 ఉచిత సిలెండర్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ జడ్డా రవి, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండల కేంద్రం త్రిపురాంతకంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన 9 ఎస్సీ కుటుంబాలు, నాగరాజు కాలనీకి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఎర్రగొండపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పాలనలో అపార అనుభవమున్న చంద్రబాబునాయుడిపై నమ్మకంతో ప్రతి ఒక్కరూ టీడీపీకి ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.అంజిరెడ్డి, బాలనాసర్, చెన్నయ్య, బుజ్జి పాల్గొన్నారు.


దోర్నాల మండలంలో ఎరిక్షన్‌బాబు ప్రచారం

ఎర్రగొండపాలెం : రాష్ట్రం లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు అందరు సైకిల్‌గుర్తుపై తనకు ఓటు వేసి చంద్రబాబుకు మద్దతుగా నిలవాలన్నారు. ఎర్రగొండపాలెంలోని ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయసమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఎర్రగొండ పాలెం నియోజకవర్గంలో ఉన్న ఆర్యవైశ్యులకు అండగా ఉండి స్వేచ్ఛగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. మనం ఇక్కడ టీడీపీని గెలిపించుకుంటే మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయించుకుంటామని, వెలిగొండప్రాజెక్టును పూర్తి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు కుమార్తె గూడూరి చెల్సియా, కుమారుడు అజిత్‌లు ఆర్యవైశ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సభకు త్రిపురాంతకం దేవస్థానం మాజీ అధ్యక్షులు గోళ్ల సుబ్బారావు, చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షులు అనుమాలశెట్టిసుబ్బారావు, ఆర్యవైశ్యనాయకులు చీదెళ్ల నాగేశ్వరరావు, కొత్త మాసు సుబ్రహ్మణ్యం, ఆతుకూరి కృష్ణయ్య, కొల్లా పుల్లారావు, పాల్గొని ప్రసంగించారు. పట్టణంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు (నాన్నకు) సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్‌లు చేస్తున్న ఎన్నికల ప్రచారం ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఆదివారం సాయత్రం పెద్ద మసీదు వద్ద ముస్లిం పెద్దలతో కలసి ఎరిక్షన్‌బాబు ఎమ్మెల్యేగా విజయం సాధించాలని నమాజ్ చేశారు. ఆదివారం సాయంత్రం 100మంది కార్యకర్తలు, నాయకులతో కలసి పెద్దమసీదు బజారు, పుల్లమ్మచేను, చింతపల్లి బజారులలో టీడీపీ అభ్యర్థి కుమార్తె చెల్సియా ఎన్నికల ప్రచారం చేశారు.

పొన్నమానుపై చెన్నయ్య ఊరేగింపు


పొన్నమానుపై శ్రీకృష్ణుని అలంకరణలో చెన్నయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 28: మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చెన్నకేశవ స్వామి ఆదివారం తెల్లవారుజామున మురళీ కృష్ణ అలంకారంలో పొన్న వాహనంపై నాలుగు మాఢ వీధులలో విహరించారు. ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి పొన్నమాను వాహనంపై ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లు, మహిళా, విద్యార్థులు కోలాట ప్రదర్శనతో ముందుకుసాగారు. సోమవారం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై చెన్నుడు దర్శనమివ్వనున్నారు.


కోలాటం ఆడుతున్న మహిళలు

నేడు బ్రాహ్మణ గరుడ సేవ సమారాధన

స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి బ్రాహ్మణ గరుడ సేవ సమారాధన నిర్వహిస్తున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ సమారాధనకు ఉభయదాతలుగా శ్రిష్టి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం కుమారులు శ్రిష్టి వెంకట రమణ, అనీల్ బాబు, రవి కిరణ్ కుటుంబ సభ్యులు వ్యవహరిస్తారని తెలిపారు. సమారాధన నిర్వహణ ఆదిశంకరాచార్య అర్చక పురోహిత సంఘం గౌరవ అధ్యక్షులు జటప్రోలు దక్షిణామూర్తి శర్మ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

పోలేరమ్మకు జాతర

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మ వారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

హనుమంత వాహనంపై స్వామివారు

కంభం : వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి వేంకటేశ్వర స్వామి హనుమంత వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పురవీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. శ్వేత భరతనాట్యం బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అవీ..ఇవీ..

సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలి

● ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

త్రిపురాంతకం, ఏప్రిల్ 28: వచ్చే సార్వత్రిక ఎన్నికలను సామరస్య, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ కోరారు. మండలంలోని మిట్టపాలెం, ఒడ్డుపాలెం గ్రామాల్లో ఆదివారం జరిగిన ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వేళ ఘర్షణలు అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో గోప్యత ఉంటుంది కాబట్టి ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతోపాటు, ప్రత్యేక పోలీసు బలగాలు వస్తాయన్నారు. అబ్జర్వర్ రహమాన్ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి భయాలకూ లోనుకాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా భయభ్రాంతులకు గురి చేస్తే ఎస్పీకి లేదా తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ ఎస్.సుబ్బారావు, ఎస్సై వి.సాంబశివయ్య, తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

తర్లుపాడు, ఏప్రిల్ 28: ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ గరుడ్ సమిత్ సునీల్ అన్నారు. మండలంలోని సీతానాగులవరం పంచాయతీ బోరుగుంతలపాడులో ఓటు హక్కు ప్రాముఖ్యత-ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా ఓటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈయన వెంట దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, మార్కాపురం డీఎస్పీ బాలసుందరం, పొదిలి సీఐ డి.మల్లికార్జున్, తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్, తహసీల్దార్ అబ్దుల్ హమీద్, పలువురు అధికారులు ఉన్నారు.

దాతల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పొదిలి, ఏప్రిల్ 28 : నీటి ఎద్దడితో అల్లాడుతున్న పట్టణ ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు దాతల సహాయంతో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం పొదిలి, ఒంగోలు ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అంతేకాకుండా దాతల సహకారంతో మరికొన్ని చోట్లకూడా చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. పట్టణంలో మానవతావాదుల సహాయసహకారాలు అందించడం వల్లే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. అదే విధంగా దాతల సహాయంతో సోమవారం చిన్నబస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్లు కల్లంసుబ్బారెడ్డి, మువ్వల పార్థసారధి, కాటూరి వెంకటనారాయణబాబు, కె యలమంద, యక్కలి శేషగిరి, నాగేశ్వరరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, తానికొండ వెంకట్రావు, రసూల్, బండి అశోక్, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఉత్తమ ప్రతిభ అవార్డు


అవార్డు అందుకుంటున్న విద్యార్థి నజీర్‌భాషా

గిద్దలూరు, ఏప్రిల్ 28 : రాచర్లలోని స్పందన విద్యాసంస్థకు చెందిన విద్యార్థి షేక్ నజీర్‌భాషా ఉత్తమ ప్రతిభ అవార్డు పొందారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలు నజీర్‌బాషా ప్రతిభ కనబరిచారు. నిర్వాహకులు బెస్ట్ పర్ఫార్మర్ అవార్డును ఆదివారం అందచేసినట్లు స్పందన విద్యాసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి తెలిపి విద్యార్థిని అభినందించారు.

అభివృద్ధి జరగాలంటే టీడీపీ గెలవాలి

● ముత్తుముల అశోక్‌రెడ్డి తనయుడు దివ్యేష్‌రెడ్డి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దివ్యేష్‌రెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 28: గిద్దలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకోవాలని ముత్తుముల అశోక్ రెడ్డి తనయుడు దివ్యేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బేస్తవారపేట మండలంలోని పిటికాయగుళ్ళ, జగ్గంబోట్ల కృష్ణాపురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ,జనసేన, బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, శెట్టెం రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 15 కుటుంబాలు చేరిక

కంభం : గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో తురిమెళ్ల మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ ఆధ్వర్యంలో నర్సిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

అన్న కోసం చెల్లులు ఇంటింటి ప్రచారం

గిద్దలూరు : గిద్దలూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన అన్న ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం కోసం ఆయన సోదరి గీత రాచర్ల మండలం సత్యవోలు పంచాయతీలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.టీడీపీ,జనసేన,బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా అశోక్‌రెడ్డిని ఎంపీగా శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పిడతల సరస్వతి పాల్గొన్నారు.

స్థానికంగా ఉండే అశోక్‌రెడ్డిని గెలిపించండి


కంభంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ముత్తుముల జగన్నాథరెడ్డి

కంభం : ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి బలపరచిన అభ్యర్థులైన గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు జగన్నాథరెడ్డి తెలిపారు. ఆదివారం కంభం పట్టణంలోని మసీదు వీధి, అమ్మవారిశాల వీధుల్లో ఇంటింటికి తిరిగి టీడీపీ, బీజేపీ మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

‘సూపర్ సిక్స్’తో మహిళలకు ఆర్థిక ప్రయోజనం

పామూరు, ఏప్రిల్ 28: టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు, రావిగుంటపల్లి గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాల గురించి గ్రామస్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎర్ర గొర్లబాల, కోటపాటి వెంకటేశ్వర్లు, కోటపాటి రాజా, కంచర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పామూరు, ఏప్రిల్ 28: పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నెల్లూరులోని డీఆర్ ఉత్తమ హోటల్‌లో ఉతహంగా జరుపుకొన్నారు. 1987-88 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నెల్లూరులోని జీఎల్ రాజేశ్వరి దంపతులు నిర్వహించిన ఆత్మీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పేట తిరుపతిరెడ్డి, పద్మ మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. 37 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు ముఖ్య పాత్ర వహించిన రాజేశ్వరి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గడ్డం రామారావు, బత్తుల నాగేశ్వరరావు, టి.రవి, ఇర్రి మస్తాన్‌రెడ్డి, షేక్ మునీర్, ఖాజీ ఖాదర్ బాషా, ఖాజా మొహిద్దీన్, జి.పూర్ణచంద్రరావు, గురు, జిలాని బాషా, రహంతుల్లా, జాని బాషా, కోటేశ్వరరావు, రమేష్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దొనకొండ, ఏప్రిల్ 28: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు. మండలంలోని చందవరం గ్రామానికి చెందిన బద్దిగం శ్రీనివాసరెడ్డి(38) ఈ నెల 21వ తేది ఉదయం పొలంలో పురుగుల మందు సేవించాడు. తండ్రి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవటంతో కొడుకు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ శ్రీనివాసరెడ్డి వాంతులు చేసుకుంటూ ఉండగా, ఏం జరిగిందని ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో హుటాహుటీన ఎర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు. రెండు రోజులపాటు అక్కడ చికిత్సపొందిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సమాచారం. మృతిచెందిన శ్రీనివాసరెడ్డి తనకున్న ఒకటిన్నర ఎకరం పొలంలో బొప్పాయి, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగుచేసి నష్టపోయాడు. అప్పుల బాధతో పురుగుల మందు తాగినట్లు సమాచారం. మృతిచెందిన రైతుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జనసేన దొనకొండ పట్టణ అధ్యక్షుడిగా బాలరాజు

దొనకొండ, ఏప్రిల్ 28: జనసేన దొనకొండ పట్టణ అధ్యక్షుడిగా యన్నం బాలరాజును నియమించినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు గుండాల నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. జనసేన పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బాలరాజు తెలిపారు.

వేంపాడులో ఉచిత వైద్య శిబిరం

ముండ్లమూరు, ఏప్రిల్ 28: మండలంలోని వేంపాడులో ఆదివారం నరసరావుపేటకు చెందిన మాక్స్‌కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రెండు వందల మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు నిర్వాహకులు హనుమంతరావు, మోహనరావు మందులు పంపిణీ చేశారు. వైద్యులు వై.శివప్రసాద్, వై.శ్రీహర్ష, మన్నె గౌతమ్, సీత, రంజిత్ కుమార్, లక్ష్మీమానస, తదితరులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండలరావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, లింగమూర్తి, హనుమంతరావు తది తరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

తాళ్లూరు, ఏప్రిల్ 28: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గొట్టిపాటి భరత్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మల్కాపురం, రజానగరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దర్శి అసెంబ్లీకి పోటీచేస్తున్న తన సోదరి గొట్టిపాటి లక్ష్మిని ఆదరించాలని కోరారు. తన సోదరితోపాటు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ ఖాసీంసైదా, ఆగోలు సుబ్బారావు, అనపర్తి శ్యాంసన్, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని సొంతింటి కల

- పునాదులు దాటని జగనన్న ఇళ్లు
- పెరిగిన ధరలతో లబ్ధిదారులు విముఖత



గుమ్మలంపాడు లేఔట్‌లో నిర్మితమైన ఒకేఒక గృహం

పామూరు, ఏప్రిల్ 28: ఇల్లు కావాలని అడిగిన ప్రతి పేదవానికి సొంతింటి కల నేరవేర్చడం కోసం వైసీపీ ప్ర భుత్వం చేపట్టిన జగనన్న నిర్మాణాలు పునాదులు దాట డం లేదు. ఎక్కడా పూర్తయిన గృహాలు కనిపించడం లేదు. అసంపూర్తిగా నిర్మాణాలు మాత్రం జగనన్న లేఔ ట్లలో కన్పిస్తున్నాయి. మండలంలో 8 గ్రామాల్లో జగనన్న లేఔట్లలో కాలనీలు కాదు.. ఊర్లే నిర్మిస్తామని వైసీపీ పా లకులు గొప్పగా చెప్పారు. ఆదచరణలో చతికిలపడ్డారు. కనిగిరి నియోజకవర్గంలోనే అతి పెద్ద లేఔట్ అయిన గుమ్మలంపాడు లేఔట్‌లో 536 ప్లాట్లు వేయగా, 236 మందికి గృహాలు మంజూరుచేశారు. ఇక్కడ కేవలం ఒకే ఒక ఇల్లు మాత్రమే నిర్మితమైంది. ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారునికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ ప్రకటించిన రూ.లక్షా 80 వేలల్లోనే రూ.35 వేలు విలువచేసే 486 కేజీల ఇనుము, రూ.24 వేలు ఖరీదుచేసే 90 బస్తాల సిమెంటు, రూ.7,500 విలువ కలిగిన 20 టన్నుల ఇసుకను ప్రభుత్వం సరఫరా చేసినప్పటికీ, పెరిగిన ధరల ధాటికి గృహాలు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

పామూరు మండలంలో వేసిన 8 లేఔ ట్లలో సుమారుగా 1500 గృహాలలో కనీసం 20శాతం కూడా పూర్తి కాలేదు. ఇంకా చాలచోట్ల జగనన్న గృహాలు నిర్మాణ దశలో ఉండటం గమనార్హం. తూర్పు కోడిగుడ్ల పాడులో సర్వే నెంబర్ 110లో 180 మందికి ఇంటి ప ట్టాలు మంజూరుచేశారు. మొదటి విడతలో 27 గృహాలు మంజూరు కాగా, మూడు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన గృహాలు పునాదులతోనే నిలిచిపోయాయి. త్వరగా పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకొంటున్న లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. అందుకు ప్రధాన కారణం గ్రామాలకు దూరంగా ఇంటి పట్టాలు మంజూరు చేయడం, గృహనిర్మాణ సామగ్రి, ఇతర ఖర్చులు పెరగడంతోపాటు సదుపాయాలులేని సెంటున్నర స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదు.



తూర్పు కోడిగుడ్లపాడులో పునాది దశలో ఉన్న గృహాలు

‘దర్శి’ అభివృద్ధే ధ్యేయం

- మీ ఆడబిడ్డగా వచ్చా.. ఆదరించండి
- టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి



రాజంపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 28: దర్శి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని జముకులదిన్నె, లక్ష్మీనారాయణపురం, కొత్తపల్లి, కొర్లమడుగు, కృష్ణాపురం, త్రిపురసుందరీపురం, ఉయ్యాలవాడ, రాజంపల్లి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు ఘనస్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. హారతులిచ్చి దీవించారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ మీరు చూపుతున్న ప్రేమానురాగాలు మరువలేనివన్నారు. నిస్వార్థ సేవలందించి మీ రుణం తీర్చుకుంటానన్నారు. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలిగా, మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య కుమార్తెగా వారి ఆశయాలకు అనుగుణంగా నిజాయతీగా పనిచేస్తామన్నారు. బాబాయి గొట్టిపాటి రవికుమార్ అడుగుజాడల్లో నడుస్తూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, జనసేన దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గరికపాటి వెంకట్, టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, గొర్రె సుబ్బారెడ్డి, మాగం సుబ్బారావు, గుర్రం బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విద్యారంగం అధోగతి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోరంట్ల రవికుమార్



మాట్లాతున్న గోరంట్ల రవికుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

దర్శి, ఏప్రిల్ 28: వైసీపీ పాలనలో విద్యారంగం అధోగతి పాలైందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోరంట్ల రవి కుమార్ అన్నారు. యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు అన్యాయనానికి గురయ్యారని చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇచ్చినట్లు చెప్పారు. వైసీపీ పాలనలో కేవలం 8 లక్షల మందికి కూడా సక్రమంగా ఇవ్వలేదన్నారు. టీడీపీ హయాంలో అంబేడ్కర్ విదేశీ విద్యాదీవన పథకం ద్వారా నాలుగువేల మంది ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులను ఇతర దేశాలకు పంపినట్లు చెప్పారు. వైసీపీ పాలనలో విదేశీ విద్య అవకాశం కల్పించలేదన్నారు. టీడీపీ హయాంలో డ్వాక్రా మహిళలకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వగా, వైసీపీ పాలకులు రూ.3 లక్షలకు కుదించారన్నారు. టీడీపీ పాలనలో జరిగిన ప్రగతిని, వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలవడాన్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు పాల్గొన్నారు.

రాజంపల్లిలో యువకుడి హత్య

దర్శి, ఏప్రిల్ 28: మండలంలోని రాజంపల్లిలో ఆదివారం మధ్యాహ్నం మోటా రాజవెంకటేశ్వర్లు(23) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆస్తి విషయాలు, కుటుంబ కలహాలే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామానికి చెందిన మోటా రాజవెంకటేశ్వర్లు ఆదివారం తన బావ దేవరకొండ వెంకటరామయ్య ఇంటికి వచ్చాడు. వెంకటరామయ్యకు రాజంపల్లిలో చికెట్ కొట్టు ఉంది. చికెన్ ఆర్డర్ ఉండటంతో అతనికి సాయం చేసేందుకు వచ్చాడు. షాపులో పనిచేస్తుండగా వెంకటేశ్వర్లుకు బంధువులైన చందు ప్రభాకర్, దేవరకొండ రామారావు దేవరకొండ వెంకటేశ్వర్లు, అతని భార్య వెంకటరమణమ్మలు కుటుంబ కలహాల విషయమై చర్చించుకుంటూ వాదులాడుకుంటున్నారు. వెంకటరమణమ్మ భర్త వెంకటేశ్వర్లుది తెనాలి కాగా అతనితో విభేదించి రాజంపల్లికి వచ్చి కొంతకాలంగా ఇక్కడ ఉంటుంది. షాప్ పక్కనే పంచాయతీ జరుగుతూ వాదులాడుకుంటుండటంతో రాజవెంకటేశ్వర్లు కూడా బంధువు కావటంతో అక్కడకు వెళ్లి సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. అక్కడ వాదన పెరగ టంతో చందు ప్రభాకర్ అనే వ్యక్తి పథకం ప్రకారం తెచ్చుకున్న కత్తితో వెంకటరమణ మ్మను పొడవబోయాడు. ఆమె తప్పించుకోవటంతో ఆ కత్తిపోటు రాజవెంకటేశ్వర్లు గుండెల్లో దిగింది. ఆ తర్వాత వెంకటరమణమ్మ తల్లి తిరుపతమ్మను కూడా కత్తితో పొడిచాడు. ఈ ఘటనలో రాజా వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందగా తిరుపతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు. దర్శి సీఐ షమీముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పీసీపల్లి, ఏప్రిల్ 28: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని వరిమడుగు, వెంగళాయపల్లి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. వరిమడుగుకు చెందిన కొడవటిగంటి శాంసన్(34) కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. వెంగళాయపల్లి, వరిమడుగు గ్రామాల మధ్యలో మృతిచెంది ఉన్నాడని సమాచారం అందింది. సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్సై మృతదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కనిగిరి వైద్యశాలకు తరలించారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

పామూరు, ఏప్రిల్ 28: టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం అవుతుందని వగ్గంపల్లి సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య అన్నారు. ఆదివారం మండలంలోని వగ్గంపల్లిలో సింగిల్ విండో మాజీ చైర్మన్ బి.జయరామిరెడ్డితో కలిసి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీచేశారు. ఉగ్రను, మాగుంటను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.యగంగరాజు యాదవ్, బి.నారాయణరెడ్డి నాగార్జునరెడ్డి, పోకా నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని బోడవాడ గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వై.రహీముల్లా, ఏడుకొండలు, సందాని బాషా పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు మండలం దూబగుంట వాసులు

పామూరు, ఏప్రిల్ 28: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పామూరు మండలం దూబగుంట గ్రామానికి చెందిన 25 కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఉగ్ర వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధ్వానంగా తయారైందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంటను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.గంగరాజుయాదవ్, బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణ రెడ్డి, పోకా నాయుడుబాబు, పోతురాజు వెంకటరత్నం, దైండే శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు



ఉగ్రకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కనిగిరి, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మాదిగల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రను గెలిపించి చంద్రబాబుకి కానుకగా ఇస్తామన్నారు. అధికారంలోకి రాకముందు జగన్ వర్గీకరణ అనేది వైఎస్ కోరికని చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే వర్గీకరణ ఊసే పట్టించుకోలేదన్నారు. కూటమి అభ్యర్థుల విజయం కోసం మందకృష్ణ మాదిగ రాష్ట్రంలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. మే 2న కనిగిరిలో జరిగే మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో డాక్టర్ ఉగ్ర, నేలపాటి రాజుమాదిగ, రావినూతల కోటయ్య, కోటయ్య, జేపీ రాజు, జె.దానియేలు, జె.రామయ్య, కుమ్మరికుంట రాజు, రాచూరి ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ 5తో కనిగిరి అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న శాలివాహన సంఘం నాయకులు

కనిగిరి, ఏప్రిల్ 28: డాక్టర్ ఉగ్ర సంకల్పించిన ఐదు ప్రణాళికలతో కనిగిరి సర్వతోముఖా భివృద్ధి చెందుతుందని శాలివాహన సంఘం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఉగ్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ పదవి ఉన్నా, లేకపోయినా డాక్టర్ ఉగ్ర కనిగిరి ప్రజల కోసం ఎక్కువ సమయం కేటాయించి, ఎన్నో పనులు చేశారన్నారు. బీసీలకు అన్నిరకాలుగా వెన్నంటి ఉన్న టీడీపీకి తమ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యలవర్తి వెంకట్రావు, దగ్గుపాటి మహాలక్ష్మయ్య, వై.బాలనారాయణ, అద్దంకి సుబ్బారావు, వై.పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

శంకరాపురంలో చెక్‌పోస్టు తనిఖీ

ముండ్లమూరు, ఏప్రిల్ 28: మండలంలోని శంకరాపురం చెక్‌పోస్టును దర్శి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు ఆదివారం ఉదయం తనిఖీ చేశారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో తనిఖీలు ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుబాబు, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

తాళ్లూరు, ఏప్రిల్ 28: ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలుగ్రామాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సోమవరప్పాడు, దారంవారిపాలెం, శివరాంపురం, లక్క వరం, బొద్దికూరపాడు, దోసకాయలపాడు, బెల్లంకొండవారిపాలెం, కొర్రపాటివారిపాలెం, తూర్పుగంగవరం, తాళ్లూరు గ్రామాల్లో కవాతు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్‌రావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాగుంట పరామర్శ

తాళ్లూరు, ఏప్రిల్ 28: మాజీ సర్పంచ్ ఐ.పెద్దిరెడ్డిని ఆదివారం మాగుంట రాఘవరెడ్డి పరామర్శించారు. శనివారం తాళ్లూరులో ఆయన పర్యటించి రాత్రి ఇడమకంటి రమణారెడ్డి ఇంటివద్ద బస చేశారు. ఆదివారం గ్రామంలో పలుకుటుంబాలను కలసి టీడీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వృద్ధతరం నేత మాజీ సర్పంచ్ ఐ.పెద్దరెడ్డిని మాగుంట పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆయన వెంట యువనేత ఐ.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు



కురిచేడు: తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

కురిచేడు, ఏప్రిల్ 28: కురిచేడు పాత పోలీస్‌స్టేషన్ కూడలిలోని 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం కడియాల వెంకటేశ్వరరావు సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ప్రసన్నకుమార్, తేజ, అనిల్, మాలిక్, శ్రీను, పర్వేజ్, సాయి, నాగూర్ వలి, మేరువ వెంకటేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, కమతం నాగిరెడ్డి, మస్తాన్, అంకయ్య, డాక్టర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వరిమడుగులో 11 కుటుంబాలు..

పీసీపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని వరిమడుగు గ్రామానికి చెందిన 11 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం కనిగిరిలోని అమరావ తి గ్రౌండ్స్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో కుమ్మరిగుంట పెద్దన్న, ప్రభుదాసు, నాగయ్య, ప్రసాద్, సలోమిరాజు, జేమ్స్, కొండయ్య, రవి, బాబు, చౌడరాజు, నాగరాజులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామయ్య, భీమయ్య, నాగేశ్వరరావు, సత్తిరెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో వైసీపీకి షాక్

తాళ్లూరు, ఏప్రిల్ 28: మండలంలోని దోసకాయపాడు, బెల్లంకొండపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు గూడా సరస్వతీ ప్రభాకర్‌రెడ్డి, పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డిలు తమ అనుచరులతో టీడీపీలో చేరారు. ఆదివారం ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమక్షంలో వీరు పార్టీలో చేరారు. సర్పంచ్, ఎంపీటీసీతోపాటు పోశం గంగిరెడ్డి, గూడా జయరామిరెడ్డి, దోసకాయల ప్రభాకర్‌రెడ్డి, లక్కురెడ్డి సుబ్బారెడ్డి, గువ్వల సాంబిరెడ్డి, పలు కుటుంబాలు వైసీపీని వీడి మాగుంట సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో మాగుంట రాఘవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బిఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, ఎస్కే కాలేషావలి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన శంకరాపురం గ్రామస్థులు

ముండ్లమూరు, ఏప్రిల్ 28: మండలంలో టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఆదివారం శంకరాపురం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి సన్నిహితుడైన మేదరమెట్ల కోదండరామయ్య తన అనుచరులతో టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సోదరుడు గొటిపాటి భరత్, ఆమె భర్త లలిత్‌సాగర్, మండలంలోని నూజెండ్లపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ స్వర్గీయ వెంగళశెట్టి శ్రీనివాసరావు సోదరుడుతో పాటు మరో 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. మారెళ్ళ గ్రామంలో వైసీపీకి చెందిన ఐదు కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, కూరపాటి నారాయణస్వామి, పుల్లంశెట్టి నరేష్, తదితరులు పాల్గొన్నారు.







- అందుకే రాజకీయాల్లోకి..
- నిజాయితీతో పాలన అందిస్తా
- దోపిడీలు, కప్పాలకు చోటులేకుండా చూస్తా
- వ్యాపారాల్లో సంపాదించే రాజకీయ ప్రవేశం
- నా గెలుపుతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఆంధ్రజ్యోతితో బాపట్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

సేవే సంకల్పం

బాపట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదు. వ్యాపారాల్లో సంపాదించిన తర్వాతనే రాజకీయాల్లోకి అడుగుపెట్టా. దాదాపు పదేళ్ల నుంచి ప్రజల కష్టాలను గమనించినవాడిని. చేతనైన మేర సహాయం చేస్తూ వచ్చిన వాడిని. రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడానికే తప్ప ఇంకోటి కాదని నా భావన. నేను రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజలకు సేవ చేయడానికి. సేవే నా సంకల్పం. ఇప్పటికే వేగేశన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా ఏదో ఒక సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించాను. క్షేత్రస్థాయిలో నేను గమనించిన, ఇప్పటి వరకు నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు నామదిలో ఉన్నాయి. నా విజయం ద్వారా వాటన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నిజాయితీతో కూడిన పాలనకు మరికొద్ది రోజుల్లోనే అంకురార్పణ జరగనుంది.. అని బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తనకు ఎదురైన అనుభవాలు, ప్రజల్లో వస్తున్న స్పందన, కూటమి నేతల సహకారం వంటి అంశాలపై ఆంధ్రజ్యోతితో ఆయన ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

* సహజవనరుల విధ్వంసం

ఐదేళ్ల వైసీపీ పాలనలో సహజ వనరుల విధ్వంసం యథేచ్ఛగా జరిగింది. ముఖ్యంగా ఎమ్మెల్యే కోన రఘుపతి అవినీతి తారస్థాయికి చేరింది. ఇసుక మొదలు ప్రతి అంశంలో ప్రజలను ఇబ్బందిపెట్టారు. నియంతృత్వాన్ని, దోపిడీని ప్రజలు హర్షించరు. తప్పులను ఎత్తి చూపితే ఎదురుదాడి చేస్తున్నారు. ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

* సహకారం మరువలేనిది

ప్రచారంలో బీజేపీ, జనసేన నేతలతో పాటు కార్యకర్తలు అందిస్తున్న సహకారం మరువలేనిది. కూటమి అభ్యర్థిగా నా గెలుపు కోసం వారు ప్రచారంలో తోడుంటున్నారు. గ్రామగ్రామాన సమన్వయంతో పనిచేస్తున్నాం. ఎటువంటి పొరపచ్చాలకు తావు లేకుండా ముందుకు వెళ్తున్నాం. ఎన్డీయే కూటమిని తిరిగి అధికారంలోకి తేవడమే అందరి లక్ష్యం. ప్రజా ప్రభుత్వంతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతాం.

* ముక్కుసూటిగానే మాట్లాడతా

ఏదైనా ఉన్నది ఉన్నట్లు ముక్కుసూటిగానే మాట్లాడతా. నిజాయితీయే నా బలం. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా నమ్మిన సిద్ధాంతాన్ని వదిలేది లేదు. అంతిమంగా ధర్మం, న్యాయం, నిజాయితీయే గెలుస్తాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఎదుటివాడు తప్పు చేస్తే తప్పనే చెబుతా తప్ప దానిని సమర్థించను. అదే సమయంలో నా వైపు నుంచి ఏమన్నా లోటుపాట్లు ఉన్నా సరిదిద్దుకోవడానికి వెనకాడను.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా..

ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ప్రతి సమస్యను పరిష్కరిస్తా. అందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. బాపట్ల పట్టణ ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యను తీరుస్తా. పంటకాల్వలలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా పూడికలు తీయించి రైతులు ఇబ్బంది పడకుండా చూస్తా. సూర్యలంక సముద్రతీరాన్ని టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా. విద్య, వైద్యం విషయంలో మెరుగైన సేవలు అందించడమే నా ధ్యేయం.

సొంతమనిషిలా ఆదరణ

ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన గొప్పగా ఉంది. ఎక్కడికక్కడ ప్రజలు నన్ను వారి సొంత మనిషిగా ఆదరిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడిని కావడమే ఇందుకు కారణం. వేగేశన ఫౌండేషన్ సేవా కార్యక్రమాల ద్వారా ఎందరో లబ్ధి పొందారు. వారంతా నన్ను అక్కున చేర్చుకుంటున్నారు. ఐదేళ్లలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారు. దీంతో ప్రజలు వారి ఆకాంక్షలు నెరవేర్చే వారి కోసం ఎదురుచూస్తున్నారు. అందుకే కూటమి అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళుతుంటే అపూర్వ ఆదరణ దక్కుతోంది.

* వైసీపీ దుష్ప్రచారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పథకాలు ఆగిపోతాయనే దుష్ప్రచారాన్ని వైసీపీ చేస్తోంది. వాస్తవానికి గతంలో టీడీపీ ఇచ్చిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసింది. బడుగు, బలహీన వర్గాల పొట్టకొట్టింది. కూటమి అధికారంలోకి రాగానే గతంలో టీడీపీ ఇచ్చిన పథకాలను పునరుద్ధరించడంతో పాటు, మరింత మెరుగ్గా సంక్షేమం అందిస్తాం.

సూపర్ సిక్స్‌పై స్పందన భేష్

టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. మహిళలను మహాశక్తులుగా మార్చేలా టీడీపీ మేనిఫెస్టో ఉంది. ఉచిత బస్సు ప్రయాణం మొదలు పూర్ టూ రిచ్ వంటి, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటివి బలంగా ప్రజల్లోకి వెళ్లాయి. చంద్రబాబు ద్వారానే భవిష్యత్తు అని యువత విశ్వసిస్తున్నది.

* స్వచ్ఛందంగా చేరికలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరేవారి సంఖ్య ఇటీవల కాలంలో మరింత ఊపందుకుంది. వారంతా టీడీపీ విధానాల పట్ల ఆకర్షితులై స్వచ్ఛందంగా వస్తున్నవారే. మేము ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. వైసీపీ పాలనలో ఆయా వర్గాల అణచివేతకు గురైన తీరు, జరిగిన విధ్వంసాన్ని జనంలోకి బలంగా తీసుకెళుతున్నాం. దాని ఫలితమే ఈ చేరికల పరంపర.

* ప్రతి ఇంటి గడప తొక్కాను

ఎన్నికల ప్రచారం మొదలు కాకముందే నియోజకవర్గంలోని ప్రతి ఇంటి తలుపు తట్టి వారి సాధక బాధకాలు విన్నాను. మళ్లీ ఇప్పుడు ప్రచారంలో మరోసారి వారి ముందుకు వెళుతున్నాను. ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత, ఆవేదన అన్నీ కలగలిసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రజానీకం సిద్ధంగా ఉంది.

కుళాయి నీరు కరువే


- ఇంటింటికి రక్షిత నీరు ఎన్నటికో
- జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడక
- పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షలు
- కుళాయిల శాతం 43.66 మాత్రమే..

ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చే సరికి దారుణంగా విఫలమయ్యారు. నిధుల కొరత వెంటాడుతోంది. పనులు నత్తనడకన సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 2,16,548 గృహాలకు, పల్నాడు జిల్లా లో 2,89,328 గృహాలకు, గుంటూరు జిల్లాలో ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇలానే పనులు సాగితే నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యే పరిస్థితి ఉండదు. పనులు వేగవంతం చేసి ప్రజల తాగునీటి వెతలను తీర్చేందుకు అధికారులు కృషి చేయాలి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇంటింటికి రక్షిత నీరు అందించే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులతో పనులు చేపట్టే విధంగా ప్రణాళికను రూపొందించారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరుశాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని ఇరు ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు రూ.1021.38 కోట్ల వ్యయం అవుతుందని వ్యయం అంచనా వేశారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్ల నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాలో సుమారు రూ.105 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం వలనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

జల్‌జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యం. ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరిచ్చే విధంగా రూపొందించబడ్డాయి. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు వినియోగిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్‌జీవన్ పథకం లక్ష్యమే. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటివరకు 4,51,035 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. 43.66 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,869 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడానామ మాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. పనులు ఇంకా నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.



పల్నాడు జిల్లాలో..

రక్షిత నీటి పరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉన్నాయి. పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 86,905 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,071 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. 2,89,328 గృహాలకు ఇంకా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. 33.40 శాతం గృహాలకు మాత్రమే కుళాయి లు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గర్తించారు. ఇందుకు సంబంధించి రూ.508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు.

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,948 గృహాలకు కొత్తగా నీటి కుళా యిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,48,240 గృ హాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళా యిల శాతం 19.82 శాతం నుంచి 40.64 శాతానికి పెరిగింది. ఇంకా 2,16,548 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సిం ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేప ట్టారు. రూ.205.22 కోట్లు వ్య యం అంచనాతో చేపట్టిన పను ల్లో 223 పనులు పూర్తయ్యాయి.

గుంటూరు జిల్లాలో...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహా లు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రా రంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళా యిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతానికి పెరిగింది. ఇంకా 75,993 గృహా లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి.



పెద తురకపాలెంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ దుస్థితి





భట్టిప్రోలులో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న అబ్జర్వర్ పరిమళ్ సింగ్

ఎన్నికల విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన
- పరిశీలకుడు పరిమళ్ సింగ్

వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల పరిశీలకుడు పరిమళ్‌సింగ్ ఆదివారం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పర్యటించారు. ముందుగా వేమూరులో నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడితో చర్చించి ఆన్‌లైన్లో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు. ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన వాహనాలకు ప్రచారాలకు అనుమతులు ఇచ్చే విధానంపై కమిషన్ తెలిపిన నిబంధనలను ఉల్లంఘించవద్దని అన్నారు. ఎన్నికల విధుల్లో నిర్వహించే ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతో పాటు సమ స్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉన్న కేంద్రాల వద్ద తీసుకోవాల్సి న చర్యలను వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల తహసీల్దార్లు కిరణ్, మునిలక్ష్మి, పుల్లారావు, రెవెన్యూ అధికారులు, పోలీసుశాఖ అధికారులు ఉన్నారు.

అప్పిలేట్ అధికారిగా నచ్చినవారు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో అధికారమంతా అప్పిలేట్ అధికారులదే. ఆ అధికారులు ఎవరనేది స్పష్టంగా చెప్పలేదు. ఎవరినైనా నియమించవచ్చని యాక్టులో పేర్కొన్నారు. అదే జరిగితే రాజకీయ నాయకులనే ఆ స్థానంలో పెట్టుకుంటారు. తద్వారా రాజకీయ నేతల పరిధిలోకి ప్రజల ఆస్తులు వెళ్లిపోతా యి. వారు ఆడింది ఆట.. పాడింది పాటగా మారుతుంది. బాధి తులు కోర్టులకు వెళ్లాలన్నా వారు అనుమతించాల్సిందే. అంటే న్యాయస్థానాలకు వెళ్లే అవకాశం కూడా లేనట్లే.

- పి.రాజారావు, సీనియర్ న్యాయవాది

- ఓ వ్యక్తి తన పేరుతో ఉన్న స్థలం అమ్మాలనుకున్నాడు. దాన్ని మీరు కొనాలనుకున్నారు. కొనుగోలు సమయంలో ఆ వ్యక్తి తన వద్ద స్థలం ఒరిజినల్ (అసలు) పత్రాలు లేవని, నఖలు (జిరాక్స్) పత్రాలు ఉన్నాయి.. వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తానన్నారు. అప్పుడు ఆ స్థలం మీరు కొంటారా? ఖచ్చితంగా కొనరు. ఎందుకని? ఆ స్థలం అతడిదో కాదో తెలుసుకోలేం. ఆ పత్రాల్లోని పేరు అసలో, నకిలీయో తెలుసుకోలేం. అలాంటి జిరాక్సులు ఎన్ని ఉన్నాయో.. ఎంత మంది దగ్గర ఉన్నాయో మనకు తెలియదు. అతడు ఇంతకముందే దాన్ని అమ్మేశాడో.. మనకు తెలియదు కాబట్టి. జిరాక్స్ పత్రాలతో ఉన్న స్థలాన్ని కొనం.





ప్రమాదంలో.. ప్రజల ఆస్తులు

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో చేటు
- నకళ్లతో ఎవరైనా హక్కుదారులుగా నమోదు
- ఆస్తి మనదేనని నిరూపించుకోవాలంటే ఇక దేవుడే దిక్కు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన డిజిటల్ రిజిస్ట్రేషన్ విధానంతో మొత్తంగా ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడిపోయాయి. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 135 రకాల దస్తావేజులను పూర్తిగా డిజిటల్ రూపంలోనే ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం ఇకపై రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే లావాదేవీలకు సంబంధించి ఎలాంటి ఒరిజినల్(అసలు) పత్రాలు ఇవ్వరు. కేవలం జిరాక్సులు మాత్రమే ఇస్తారు. ప్రక్రియలో అసలు దస్తావేజుల పాత్ర, అమ్మకం, కొనుగోలుదారుల అసలు సంతకాలు, వేలిముద్రలతోగానీ పనిలేదు. అవన్నీ 'క్రిటికల్ రివర్' అనే సంస్థ వద్ద ఉంటాయి. ప్రభుత్వం సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్(ఎన్ఐసీ)ని పక్కన పెట్టి ప్రైవేటు సంస్థను రంగంలోకి దించడంతో ఈ ప్రమా దం మరింత పెరిగింది.

హక్కుదారులకు తెలియకుండానే అమ్ముకునే వీలు..

అసలు దస్తావేజులు, హక్కుదారుల సంతకాలు, వేలి ముద్రలు అన్నీ డిజిటల్ రూపంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం, ప్రైవేటు సంస్థ వద్దే ఉంటాయి. దీంతో కక్షిదారులతో సంబంధం లేకుండా వాటిని వారు ఏమైనా చేసే అవకాశం ఉంది. అసలు వ్యక్తులకు తెలియకుండా వాటిని తాకట్టు పెట్టుకోవచ్చు.. విక్రయించుకోవచ్చు. తిరిగి లబ్ధిదారు మళ్లీ రిజిస్ట్రేషన్‌కు వెళితే తప్ప తన ఆస్తులు ఏమయ్యాయో అతడికి తెలిసే అవకాశం లేదు.

జిరాక్సులతో రిజిస్ట్రేషన్ ప్రమాదం..

స్థలాన్ని అమ్మదలచిన వ్యక్తి తన దగ్గరున్న జిరాక్సు పత్రాలు చూపించి ఆ స్థలాన్ని ఉదయం పూట ఒక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్థలాన్ని అమ్ముకున్నాడనుకుందాం. అదే వ్యక్తి, మళ్లీ అవే జిరాక్సులతో కొద్దిసేపటి తర్వాత దగ్గరలోని వేరే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వేరొకరికి ఆ అమ్మి మళ్లీ రిజిస్టర్ చేయవచ్చు. మొదట అమ్మిన వివరాలు ఈసీలో నమోదు అవ్వాలంటే 24 గంటల సమయం గడవాలి. ఈలోపు అతడు ఎన్ని రిజిస్ట్రేషన్లైనా చేయించుకోవచ్చు. ఎంతమందికైనా అమ్ముకోవచ్చు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో మరింత చేటు

ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న భూ యాజమాన్య హక్కుల (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్) చట్టంతో ఈ అక్రమాలకు మరింత అవకాశం ఉంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో భాగంగా చేపట్టే రీ సర్వేతో అందరి తలరాతలు ఒక్కసారిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఒక్క జిరాక్సు పుట్టించుకుంటే చాలు సదరు స్థలంపై తానూ హక్కుదారుగా నమోదు చేసుకోవచ్చు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు కింద రూపొందించే వివాదాల (డిస్ప్యూట్) రిజిస్టర్‌లో పేరు నమోదు చేయించుకోగలిగితే చాలు. ఇక ఆ స్థలం హక్కుదారుకు హక్కులన్నీ పోతాయి. హక్కుదారు తన వద్ద అసలు పత్రాలు ఉన్నా సదరు స్థలాన్ని అమ్ముకోలేడు. టైట్లింగ్ అధికారి ఆమోదిస్తే తప్ప సొంతదారు ఆ స్థలాన్ని అమ్ముకోలేని పరిస్థితి వస్తుంది. అంటే మొత్తంగా సొంతదారు ఆస్తి పూర్తిగా టైట్లింగ్ అధికారి పరిధిలోకి తద్వారా రాజకీయ పెద్దల పరిధిలోకి వెళ్లిపోతుంది. స్థలం తనది అని నిరూపించుకోవాల్సిన బాధ్యత సొంతదారుడి మీదే పడుతుంది. అది తనదేనని నిర్ధారించుకునే వరకూ అతడు తన సొంత స్థలం కూడా అమ్ముకోలేడు. తన సొంత స్థలం అని నిరూపించుకోవడానికి కోర్టుకు వెళ్లే అవకాశం కూడా లేదు. ఇలా త్రిశంకు స్వర్గంలో నలిగిపోయి సర్వం కోల్పోవాల్సిన భయానక స్థితి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దాపురించనుంది. సామాన్యుల ఆస్తులు దోపిడీ చేయడం కోసమే వైసీపీ ప్రభుత్వం ఈ విధానాలను ముందుకు తెస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

అధికార జోక్యంతో న్యాయం ఎండమావే..

భూ సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే అధికారం న్యాయస్థానాలకు ఉండేది. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా దాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. తద్వారా రాజకీయ పలుకుబడిలోకి వెళ్లి హక్కుదారులు ఘోరంగా నష్టపోతారు. అదే జరిగితే భూ వివాదాల్లో సామాన్యులకు న్యాయం ఎండమావే.

వేమూరి శ్రీనివాసరావు, అడ్వకేట్

జగన్‌రెడ్డి పాలనకు వీడ్కోలు పలకండి

- రాష్ట్రానికి రాజధాని లేదు.. పంటలకు నీరు కరువు..
- మద్యం, ఇసుక వ్యాపారంతో దోపిడీ
- అవినీతి, అరాచకం తప్ప.. అభివృద్ధి శూన్యం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి


డేగరమూడిలో ఏలూరితో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గ్రామస్థులు

మార్టూరు, ఏప్రిల్ 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్‌రెడ్డికి వీడ్కోలు పలకాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఐదు గ్రామాలలో జొన్నతాళి, చిమ్మిరిబండ, రాజుగారిపాలెం, డేగరమూడి, వలపర్ల గ్రామాలలో ఏలూరి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా, అన్నదాతకు సాగు నీరు రాకుండా చేసిన చేతగాని వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. వైసీపీ నేతలు మద్యం, ఇసుక, మట్టిని దోచుకొని కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. ఐదేళ్ల వారి పాలనలో అవినీతి..అరాచకాలు తప్ప అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. అభివృద్ధి చేసినట్లు కరపత్రాలపై చూపడం.. ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప వాస్తవం లేదన్నారు. కనీసం నీటి ప్రాజెక్టులను కూడా కట్టకుండా రైతులను ముంచారన్నారని ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు. 20 శాతం పనులు చేస్తే పోలవరం పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలంగా మారేదన్నారు. గ్రామాలలో ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇలాంటి పాలకులకు సాగనంపాలని విజ్ఞప్తి చేశారు.

ఏలూరికి ఘన స్వాగతం

తొలుత జొన్నతాళి గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఏలూరికి టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. రామాలయం, పోలేరమ్మ దేవాలయం, గంగమ్మ గుడిలో ఏలూరి పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న ఏలూరికి మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఏలూరి చిమ్మిరిబండ గ్రామంలో ప్రచారానికి వెళ్లగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి ఎస్సీ కాలనీలోని డాక్టరు బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత రాజుగారిపాలెంలో, సెంటర్‌లో ప్రచారం రథంపై నుంచి ఏలూరి మాట్లాడారు. సాయంత్రం డేగరమూడి వచ్చిన ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. పోలేరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. బాబును మళ్లీ రప్పిద్దాం.. రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిద్దాం.. అంటూ మహిళలు పోస్టర్‌తో ఏలూరికి స్వాగతం పలికారు. రాత్రి వలపర్లలోని సినిమా హాలు సెంటరు, గరటయ్య కాలనీ, చేనేత కార్మికుల వీధులలో ఏలూరి స్థానిక నేతలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

యద్దనపూడి మండల వైసీపీకి షాక్

- జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణమ్మ 50 కుటుంబాలతో టీడీపీలో చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి (మార్టూరు) : యద్దనపూడి మండలంలో వైసీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ జడ్పీటీసీ సభ్యులు గన్నవరం గ్రామానికి చెందిన చుండి లక్ష్మీ నారాయణమ్మ తన వర్గీయులు 50 మందితో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం మండలంలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సమక్షంలో వారంతా చేరారు. వారందరికీ ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రాభివృద్ధిని కోరుకునే వారంతా కూటమికి మద్దతు తెలపాలన్నారు. లక్ష్మీనారాయణమ్మతోపాటు కొల్లా రామయ్య, చుండి మురళి కృష్ణ, షేక్ జాన్ సైదా, పల్లెపోగు శ్రీ మాన్, పేరే చర్ల వీరరాఘవులు, బాజి, కాకాని మరియబాబు తదితరులు చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో గన్నవరం గ్రామానికి చెందిన నాయకులు నల్లపనేని రంగయ్య చౌదరి, పత్తిపాటి రాజేష్, చెరుకూరి సురేంద్ర, కొల్లా వినోద్, పత్తిపాటి వేణు బాబు పాల్గొన్నారు.


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణమ్మ

టీడీపీలో చేరిన కిషోర్‌కాలనీవాసులు

మార్టూరులోని కిషోర్ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. ఏలూరి కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ హయాంలోనే కిషోర్ కాలనీ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి రాగానే పూర్తిశాతం అభివృద్ధి చేస్తామని మాటిచ్చారు. ప్రతాప్ అంజి, దార్ల తిరుపాలు, దార్ల రమేష్, దార్ల శ్రీను, పెడాల భిక్షాలు, పెడాల సత్తయ్య, పెడాల వెంకయ్య, పెడాల బుజ్జయ్య, పెడాల సత్యం, పెడాల శివ, పెడాల గురవయ్య, పెడాల అంకమ్మ, పెడాల తిరుపతమ్మ, పెడాల కోటమ్మ, పెడాల ఇజ్రాయేల్, పెడాల నాగేంద్రం, దార్ల గురవయ్య చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన ఆవుల తిరుపతయ్య ఉన్నారు. అదే విధంగా కోనంకి గ్రామానికి చెందిన వైసీపీ నేత కొర్రపాటి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు.

ఓటుతో వైసీపీని తరిమేయండి

- సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి .. కార్పొరేషన్ రుణాలు రద్దు చేసి..
- దళిత యువతకు ఉపాధి లేకుండా చేసిన జగన్
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 28 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించడంతోపాటు కార్పొరేషన్ రుణాలను రద్దు చేసి దళిత యువతకు ఉపాధి లేకుండా చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కొంగపాడులో రవికుమార్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సూపర్‌సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వైసీపీ 2019 మ్యానిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామని అబద్ధాలు చెప్తుందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, మెగా డీఎస్సీ మాటే లేదని, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయలేదని, మద్య నిషేధం ఊసేలేదని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా పూర్తి కాలేదన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్ రాజధాని లేకుండా చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ఎస్సీ కాలనీలో గొట్టిపాటి ప్రచారానికి మంచి స్పందన వచ్చింది. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, నర్రా బ్రహ్మానందం, కరి సుబ్బారావు, మాచవరపు సుబ్బారావు, చిరంజీవి, శ్రీనివాసరావు, కమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని 14వ వార్డులో ఎమ్మెల్యే రవికుమార్ ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయరన్నారు. పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జహీరా, విజయలక్ష్మి, అత్తులూరి రమేష్, సుభాషిణి, కంపా రజనీ, మాగులూరి తిరుపతమ్మ, తేజశ్విని, మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు, టీడీపీ నేతలు కుందారపు రామారావు, శ్రీనివాసరావు, కాసా పుల్లయ్య, గుడివిల్ హనుమంతరావు పాల్గొన్నారు.


కొంగపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

టీడీపీ రాగానే రూ.4వేల పింఛన్

బల్లికురవ, ఏప్రిల్ 28 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మెదటి నెల నుంచే వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందిస్తారని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా బాబీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందుకు జగన్‌రెడ్డి అధికారంలోకి వస్తే రూ.3వేల పింఛన్ ఇస్తానని వృద్ధులను మోసం చేశారన్నారు. ఒక్కసారి ఇవ్వంకుండా విడతలుగా ఐదేళ్లవరకూ సాగదీశారన్నారు. ఒక్కచాన్స్‌తో మోసం చేసిన జగన్‌రెడ్డి మాటలను, వైసీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మొద్దన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రావులపల్లి గోవిందు, సంపతిశౌరి, ఆలకుంట యర్రంనాయుడు, సుబ్బారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, జ్యోతి ప్రసాద్, సాంబయ్య పాల్గొన్నారు.


ఎస్ఎల్ గుడిపాడులో ప్రచారం చేస్తున్న బాబీ


టీడీపీలో చేరిన విప్పర్లవారిపాలెం సర్పంచ్ శాంతమ్మ తదితరులు

టీడీపీలో చేరిన రెండు గ్రామాల వైసీపీ నేతలు

అద్దంకి మండలంలో వైసీపీకి పట్టు ఉన్న గ్రామాలైన రామాయపాలెం, విప్పర్లవారిపాలెంలో పలువురు వైసీపీ నేతలు, ఆపార్టీ సానుభూతిపరులు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో ఆదివారం జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో సైకిలెక్కారు. విప్పర్లవారిపాలెం సర్పంచ్ బొనిగల శాంతమ్మ, విజయబాబు, మోషే, బూసాల వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు, జ్యోతి ఆదినారాయణ, శేషయ్య, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, ఎలీజా, తుని బాబురావు, అంజయ్య, చిరంజీవి, మాలతి, ప్రేమ్‌కుమార్, డేవిడ్, రవికుమార్, అంజయ్య, ఏడుకొండలు, గోపి, తేజతో పాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రామాయపాలెం మాజీ సర్పంచ్ కుమారుడు, వైసీపీ నేత వేములపాటి రాజశేఖరరెడ్డి, చెంచురెడ్డి, పుల్లారెడ్డి, ఏడుకొండలు, గురునాథరావు, అబ్రహం, ఏసోబు, రావులపల్లి అంకమ్మ, శివయ్యతో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి సైకిలెక్కారు.


హనుమోజీపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరి కోసం కూటమి శ్రేణుల ప్రచారం

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 28: అభివృద్ధి ప్రదాత, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపు కోసంకారంచేడులో ఆదివారం శ్రేణులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులైన ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమోజీపాలెంలో..

ఇంకొల్లు : హనుమోజీపాలెంలో ఆదివారం కూటమి నేతలు ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మళ్లీ ఎమ్మెల్యేగా ఏలూరిని గెలిపించాలని కోరారు. చేతగాని జగన్‌రెడ్డిని ఓటుతో ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, వీరగంధం, తాత, దుర్గాప్రసాద్, జనసేన నాయకులు బండారు శ్రీనుసింగయ్య, రవి, రంగిశెట్టి, రామకృష్ణ, అనంతలక్ష్మి, మాధవి, నల్లూరి క్రిష్టయ్య, అయోషాబుడే, మల్లేశ్వరి, మీరావలి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ విజ్ఞప్తి


చందలూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 28 : మే 13న జరిగే ఎన్నికలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని గొట్టిపాటి ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. మండలంలోని చందలూరు గ్రామంలో స్థానిక నేతలు, మహిళలు, కార్యకర్తలతో కలసి ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మహిళల ఆర్థికాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. అందులో భాగంగానే మహిళా శక్తి పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. వైసీపీ మేనిఫెస్టోలో ఆసరా రత్నం రాలిపోయిందన్నారు. డ్వాక్రా రుణ మాఫీ ఊసే అందులో లేదన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రూ.1.10 కోట్ల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి రుణమాఫీని మేనిఫెస్టోలో చేర్చకుండా మోసం చేశారన్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో డ్వాక్రా మహిళలతో సమావేశాలు నిర్వహించి రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పిన జగన్‌రెడ్డి మడమ తిప్పారన్నారు.

చంద్రబాబు పాలనలోనే డ్వాక్రా మహిళలకు మేలు

రాష్ట్రంలో 2019కి ముందు చంద్రబాబు పాలనలో డ్వాక్రా గ్రూపులకు మేలు చేకూరిందన్నారు. మహిళలు తీసుకున్న రుణానికి రూ.5లక్షల వరకు సున్నా వడ్డీ రాయితీని టీడీపీ అమలు చేసిందన్నారు. డ్వాక్రాలపై 20వేల కోట్ల అప్పుల భారం మోపారని ప్రచారం చేసిన జగన్ నేడు రాష్ట్ర వ్యాపితంగా డ్వాక్రా మహిళల నెత్తిన రూ.90వేలకోట్ల అప్పుల కుప్ప పెట్టారన్నారు. డ్వాక్రా మహిళలు నాడు చంద్రబాబు పాలనలో, నేడు జగన్‌రెడ్డి పాలనలో పొందిన లబ్ధిని బేరీజు వేసుకోవాలన్నారు. మళ్లీ డ్వాక్రా గ్రూపులకు పూర్వవైభవం రావాలంటే చంద్రబాబును ఎన్నుకోవాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు వాసవి, బీజేపీ నాయకులు కొల్లి కోటేశ్వరరావు, నర్సరాజు, సుబ్బారావు, జనసేన నేత కసుకర్తి వీరహనుమాన్, పాలెపు వీరాంజనేయులు, రావూరి రమేష్, కె.వి. సుబ్బారావు, పెంట్యాల రామలింగస్వామి, మాజీ ఎంపీపీ నార్నె పార్వతమ్మ, బాలిన రామసుబ్బారావు, మస్తాన్‌వలి, ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే అన్నివర్గాల అభ్యున్నతి

- వాటి సాధన కోసం మనం గెలవాలి
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య


ఈపురుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య

చీరాల, ఏప్రిల్ 28 : చంద్రబాబు తిరిగి సీఎం అయితేనే రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి మార్గం సుగమం అవుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో ఆదివారం జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుద్దంటి చంద్రమౌళి తదితరులతో కలసి కొండయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ర్యాలీగా కూటమి అభ్యర్థులు వెళ్లే సమయంలో పలువురు స్వచ్ఛందంగా ఆ ర్యాలీలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ప్రతి ఇంటి వద్ద కొండయ్య వారి సమస్యలను అడిగి తెసుకున్నారు. ప్రేమగా పలకరించడంతో ఆయా ప్రాంతాలవాసులు హర్షం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బీసీ డిక్లరేషన్ అంటే ఏంటి..? దాంతో ప్రయోజనం ఏంటనేది విశదీకరించారు. ఇవన్నీ సాకారం కావాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా టి.కృష్ణప్రసాద్ ఇరువురికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు అండగా ఉంటాం

ఆర్‌ఎంపీలకు అన్ని విధాలా అండగా ఉంటామని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. ముంతావారిసెంటర్లోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశంలో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రత్యక్ష దైవాలన్నారు. అందులో అది గ్రామీణ ప్రాంతమైనా, పట్టణ ప్రాంతమైనా ముందస్తుగా ఏదన్నా ఆరోగ్య సమస్య ఏర్పడితే తొలిగా గుర్తొచ్చేది ఆర్‌ఎంపీలేనని చెప్పారు. వారు అందించే ప్రాథమిక చికిత్సకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా తమకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ వైద్యవిభాగ ప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఆర్‌ఎంపీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల వెన్నంటి ఉంటా

ఆర్యవైశ్యులను అండగా ఉంటా. నిరంతరం వెన్నంటి ఉంటామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. ముంతావారిసెంటర్లోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపలంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య ప్రతినిధి డూండీ రాకేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆశీస్సులు తమకు ఎప్పుడూ ఉండాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యను, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పిలిస్తే పలుకుతానని కొండయ్య చెప్పారు. అనంతరం ఆర్య వైశ్య ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

టీడీపీలోకి పెరుగుతున్న చేరికలు

ఆహ్వానిస్తున్న కొండయ్య

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 28 : మండల పరిధిలోని రామన్నపేట వినాయకపురం ఎస్టీ కాలనీకి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ కూటమి టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య కొండయ్య సమక్షంలో వారు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక నాయకుడు చేవూరి వెంకటరమణ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ పేరు పేరునా కొండయ్యకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. సుపరిపాలన కోసం ప్రజ లు ఎదురు చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా తన ను, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటుచేసి గెలిపించాలని కోరారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చాక సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకట్రావు, సంజీవి, గోపి, దుర్గ, అంకుల్, నాగమణి, సంధ్య, బాలకోటయ్య, శివమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి మేనిఫెస్టోను నమ్మొద్దు

ఇంటింటి ప్రచారంలో హర్షవర్ధన్


పాతమాగులూరులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు, ఏప్రిల్ 28: టీడీపీ సూపర్ సిక్స్ పథకాల ముందు వైసీపీ మేనిఫెస్టో వెలవెలబోయిందని, జగన్‌రెడ్డి మేనిఫెస్టోను ప్రజలు నమ్మవద్దని టీడీపీ యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామంలో ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మే 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెపిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపరిచిన ఏ ఒక్కదానినీ జగన్ అమలు చేయలేదన్నారు. అభివృద్ధి లేక రాష్ట్రం నాశనమైందన్నారు. మళ్లీ ప్రజలను మోసగించేందుకు వస్తున్న వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాగానే తొలి నెల నుంచే రూ.4వేల పింఛన్ ఇస్తుందన్నారు. నవరత్నాలతో నయవంచన చేసిన జగన్‌రెడ్డిని ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం కూటమికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, సన్నెబోయిన ఏడుకొండలు, రామారావు, శ్రీరామమూర్తి, సుజాత, గోవిందమ్మ, చల్లా కృష్ణ, రామాంజి పాల్గొన్నారు.


నాగులపాలెం చెరువుకు చేరిన సాగర్ జలాలు

ఎట్టకేలకు నాగులపాలెం చెరువుకు సాగర్ జలాలు

నాగులపాలెం (పర్చూరు), ఏప్రిల్ 28 : మంచినీటి ఎద్దడిని అధికమించేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు ఎట్టకేలకు చెరువుకు చేరుతున్నాయి. దీంతో వేసవి గండం గట్టెక్కినట్లని ప్రజలు చెందుతున్నారు. తొలిదశలో నీటిని విడుదల చేసిన తరుణంలో చుక్క నీరు కూడా చెరువులకు చేరకపోవడం, ఉన్న రెండు మంచినీటి చెరువులు అడుగంటి పోవడంతో ప్రజలు ఇకింత ఆందోళనకు గురయ్యారు. చెరువులో నీరు లేకపోవడంతో తాగునీటి కోసం పక్క గ్రామాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఎట్టకేలకు సాగర్ జలాలను విడుదల చేయడంతో యుద్ధప్రాతిపతికన చెరువులను నింపుకొనే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ఈవేసవి తాగునీటి ఇబ్బందుల నుంచి బయటపడవచ్చని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కవాతు నిర్వహిస్తున్న ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

చీరాలటౌన్, ఏప్రిల్ 28 : ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు సహకరించాలని ఈపూరుపాలెం ఎస్ఐ మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఎస్సై ప్రత్యేక బలగాలతో గవినివారిపాలెం, పిట్టువారిపాలెం, రామాపురం, దేవినూతల గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామ ప్రజలతో మాట్లాడారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో తిరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా రాములోరి కల్యాణం

చీరాల, ఏప్రిల్ 28 : 20వ వార్డు బందావారివీధిలోని ఆలయంలో ఆదివారం రాములవారి కల్యాణ మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వెంకట సురేష్, కళ్లగుంట అంజమ్మ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


బాధితకు ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

చినగంజాం, ఏప్రిల్ 28 : ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైన సంఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుదేవా కాలనీలో ఆదివారం జరిగింది. ప్రభుదేవాకాలనీలో కట్టా తిరుపతమ్మకు చెందిన పూరిల్లు ఆహుతైంది. తిరుపతమ్మ ఇంటి సమీపంలోని బోరు వద్దకు తాగునీరు కోసం వెళ్లి వచ్చేసరికి ఇంటిలో మంటలు చెలరేగాయి. కాలనీలోని వారు వచ్చి మంటలు అదుపుచేశారు. ఇంటిలోని వస్తువులు, దుస్తులు కాలపోయాయి. ఈ ప్రమాదంలో రూ.60వేల నష్టం కలిగినట్లు బాధితరాలు తెలిపారు. చినగంజాం-2 ఎంపీటీసీ సభ్యులు తుమ్మలపెంట లక్ష్మీప్రసన్న భర్త శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

30న పోలేరమ్మ తిరునాళ్ల

పర్చూరు, ఏప్రిల్ 28 : పర్చూరు మండల పరిధిలోని నూతలపాడులో గ్రామంలోని గ్రామ దేవత పోలేరమ తిరునాళ్ల ఈనెల 30న జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5గంటలకు అమ్మవారి శిడిమహోత్సవాన్ని నిర్వహించి భక్తుల దర్శనార్థం గ్రామోత్సవం ఉంటుందన్నారు. కోలాటం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరునాళ్లను విజయవంతం చేయాలని కోరారు.

పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

పర్చూరు, ఏప్రిల్ 28 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవని ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రకటనలో ఖండించారు. వైసీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఆ శ్రేణులు పవన్‌తోపాటు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇలాంటివి పునరావృతం అయితే వైసీపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

మేదరమెట్ల, ఏప్రిల్ 28 : గ్రామాలల్లో సమస్యలను పరిష్కారించడానికి కృషి చేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ తెలిపారు. ఆదివారం మేదరమెట్లలో కూటమి ఎమ్మెల్యే గొట్టిపాటి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని హర్షవర్ధన్ కోరారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ సాగు, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత నిస్తామన్నారు. అంతకముందు ఆర్యవైశ్య ప్రముఖు సమస్యలపై చర్చించారు. ప్రచారంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో రవీందర్

రాజకీయ పార్టీల నేతలతో ఆర్వో సమావేశం

పర్చూరు, ఏప్రిల్ 28 : ఓటరు స్లిప్పుల పంపిణీ, హోమ్ ఓటింగ్ షెడ్యూల్ వివరాలు, ఇతర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఈనెల 28వ తేదీ నుంచి వచ్చేనెల 7వ తేదీ లోపు పంపిణీ చేస్తారని తెలిపారు. స్లిప్పులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించుకోవాలే తప్ప ప్రత్యక్ష జోక్యం చేసుకోరాదని తెలిపారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లతోపాటు 40శాతం కన్నా అధికంగా ఉన్న దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫారం 12డీని పంపిణీ చేయాలన్నారు. అందులో పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి ఇంటివద్దనే ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. హోమ్ ఓటింగ్ షెడ్యూల్ 5-5-24 నుంచి 10-5-24 వరకు జరుగుతుందని, దీనికి సంబంధించి ఏజెంట్లను ఆయా రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 29 సాయంత్రం 3గంటలలోగా నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, తదుపరి ఫైనల్ అయిన అభ్యర్థులకు ఎన్నికల ఈసీ నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయిస్తారన్నారు. ఎన్నికల విధులకు కేటాయించే పీవో/ఏపీవో, ఓపీవోలకు శిక్షణ సమయంలో పోస్టల్ బ్యాలెట్ వేసుకునే సెంటర్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. సమావేశంలో పర్చూరు ఏఆర్వో సీహెచ్ సుబ్బయ్య, కారంచేడు ఏఆర్వో మెహర్‌బాబు, ఇంకొల్లు ప్రమీల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థులు గొట్టిపాటి, కృష్ణప్రసాద్‌లను గెలిపించాలంటూ కల్లంవారిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రతినిధులు

కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీ, ఎస్టీలకు మేలు

పంగులూరు, ఏప్రిల్ 28 : కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే ఎస్సీ, ఎస్టీలకు మేలు జరుగుతుందని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు అన్నారు. కూటమి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కల్లంవారిపాలెం, మల్లవరం గ్రామాలలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో 27 ఎస్సీ పథకాలను రద్దు చేసి దళితులకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనలో ఎస్సీలకు కలిగిన మేలును వివరించారు. మే 13న జరిగే పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మందా ఆమోస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం రవికుమార్, అమర్తపూడి చిన్నా, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, వలేరు దాసు, దయాసాలు, పత్తిపాటి దానియేలు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పండ్లును పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

అరటి పండ్ల దుకాణాలపై అధికారుల దాడులు

చీరాలటౌన్, ఏప్రిల్ 28 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో విక్రయిస్తున్న అరటి పండ్ల దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రకృతి పరంగా పండ్లు పండాయా.. లేక కృత్రిమంగా పండినవా తెలుసుకునేందుకు పండ్ల నుంచి శాంపిల్స్ సేకరించారు. అధికారులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో విక్రయదారులు చెలగాటమాడితే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపి నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు ప్రభాకరరావు, ప్రణీత్ పాల్గొన్నారు.

బీజేపీ నేతల రాజీనామా

చినగంజాం, ఏప్రిల్ 28 : మండలంలోని పలువురు బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేశారు. చినగంజాం గ్రామానికి చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ జిలాని, మండల మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోలా సుబ్బారావు పార్టీ సభ్యత్వానికి, వారి పదవులకు రాజీనామాలు చేసినట్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 12 సంవత్సరాలు బీజేపీలో కార్యకర్తలుగా కొనసాగుతున్నట్లు వారు తెలిపారు. ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీలుగా ఉన్నా తాము హిందూ మతత్వ పార్టీగా ముద్రపడిన బీజేపీలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారాల్లో బీజేపీ జాతీయ నాయకులు కొందరు ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయడంపై మానసిక ఆవేదన కలిగి పార్టీ సభ్యత్వాలకు, పదవులకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణకు రాజీనామా పత్రాలను పంపినట్లు వారు తెలిపారు.

అంతా పెడ'చెవి'నే!

నా ఇష్టం అన్నట్లు వ్యవహారశైలి

ఎంపీ అభ్యర్థి భాస్కర్‌రెడ్డిపై చిటపట

అసెంబ్లీ అభ్యర్థులతో సమన్వయలోపం

పెత్తనమంతా పరాయి జిల్లావారికే..

మాకేమీ చెప్పడు.. ఎవరినీ నమ్మడు

అంటూ నాయకుల గగ్గోలు

డబ్బు పంపిణీ వ్యత్యాసంపై

కిందిస్థాయి నాయకుల్లో తీవ్ర అసంతృప్తి

ఒంగోలు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై ఆపార్టీ నేతలు చిటపటలాడుతున్నారు. మమ్మల్ని నమ్మడు, మాకేం చెప్పడు, పెత్తనమంతా పరాయి వాళ్లకే ఇస్తున్నాడంటూ కిందిస్థాయిలోని నాయకులు గగ్గోలుపెడుతున్నారు. ఆయా పదవుల్లో ఉన్న వారికిచ్చే డబ్బు విషయంలోనూ వ్యత్యాసం చూపుతుండటంతో రగిలిపోతున్నారు. ఇంకోవైపు అసెంబ్లీ అభ్యర్థులతోనూ సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వీటన్నింటికీతోడు తాము చెవిరెడ్డి దూతలమంటూ ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్న వ్యక్తుల హడావుడితో నేతలు చికాకుపడుతున్నారు. పరిస్థితిని గమనించిన ముఖ్య నాయకులు మద్యం, డబ్బుతో మంచి ఊపు తెస్తాడు.. చూస్తుండండి అంటూ కిందిస్థాయి నాయకులకు ఆశలు పెట్టి వారిని సముదాయించే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో వైసీపీలో అంతర్గత సమస్యలు పెరిగిపోయి అలజడి ఆరంభమైంది.



చెవిరెడ్డి పరిచయ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాజకీయంగా ఏపార్టీలోనైనా ఆయా స్థాయిలోని నాయకులు వారివారి ప్రాంతాల్లో తమ పెత్తనమే కొనసాగాలని ఆశిస్తుంటారు. ఒకరికి ఇద్దరు ముగ్గురు నాయకులు ఉంటే వారిని సమన్వయం చేసుకోవడం లేక వారిపై ఒక సమన్వయకర్తను నియమించడం ద్వారా పోటీలో ఉన్న అభ్యర్థులు ముందుకు పోతుంటారు. అయితే ఇంతకు ముందు ఈ ప్రాంత నాయకులతో ఏ మాత్రం పరిచయం లేని, ఇక్కడి పరిస్థితులు, వ్యవహారాలపై కనీస పరిజ్ఞానం లేని చెవిరెడ్డిని వైసీపీ రంగంలో దింపింది. రాజకీయ అనుభవం ఆయనకు ఉన్నప్పటికీ స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి తదనుగుణంగా ముందుకుపోకుండా తమదైన శైలిలో సాగుతున్నారు. ఆయా ప్రాంతాల వారితో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తే వంట మనుషులను సైతం తమ వారినే తెచ్చి భోజనాలు ఏర్పాటుచేయడంతోపాటు వేదికల ఏర్పాట్లలోనూ స్థానిక నాయకులను పక్కనపెట్టారు. ఆయా గ్రామాల వారీ కార్యకర్తల సమీకరణకు వాహనాల విషయంలోనూ స్థానిక నేతల పాత్రకు అవకాశమే ఇవ్వలేదు. దీంతో కీలక నాయకులు కూడా సాధారణ కార్యకర్తల్లా ఇలా వచ్చి అలా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పరిచయ కార్యక్రమాల్లోనూ కనీసం మండలంలో పదిమంది అయినా ఆయన పరిచయం చేసుకోకుండా నేను జగన్‌కు ముఖ్యుడిని, ఆయన పంపాడు ఓట్లు వేయండి అంటూ దండంపెట్టి మూడు ముక్కలతో ప్రసంగాన్ని ముగించారు.

ప్రైవేటు వ్యక్తులతో హడావుడి

ప్రస్తుతం చెవిరెడ్డి పొదిలి కేంద్రంగా నడుస్తూ రోజువారీ ఏదో ప్రాంతానికి వెళ్లడం, కొన్ని ప్రాంతాల్లో కాసేపు కారులోనే వేచి ఉండటం, మరికొన్ని ప్రాంతాల్లో కిందకు దిగి కనిపించిన ప్రజలను ఆలింగనం చేసుకొని మాటలు చెప్పి వెళ్లిపోవడం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల స్థానిక నాయకులకు ఎవరో చెబితే గాని చెవిరెడ్డి వచ్చిపోయిన విషయం తెలియడం లేదు. దీనికి తోడు పొదిలి కేంద్రంగా ఆయన సుమారు 80మంది ప్రైవేట్ వ్యక్తులను ఉంచి వారిని రోజువారీ ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాలకు పంపుతున్నారు. వారు సాయంత్రానికి ఏదో ఒక సమాచారాన్ని చెవిరెడ్డికి ఇస్తున్నారు. తదనుగుణంగా ఆయన అక్కడ ఇది జరుగుతుంది.. ఇక్కడ ఇది జరుగుతుంది అంటూ అసెంబ్లీ అభ్యర్థులకు సమాచారం పంపుతున్నారు. కొన్నిచోట్ల కిందిస్థాయి నాయకులకు ఫోన్లు చేసి చెప్పడం ప్రారంభించారు. దీంతో కిందిస్థాయిలోని వైసీపీ నాయకులు ఈ పరాయి పెత్తనం ఇలాగే సాగితే భరించలేమంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

కొన్నిచోట్ల వలలంటీర్లకు గిఫ్ట్‌లు

ఇవ్వకపోవడంతో అసంతృప్తి

లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని వలంటీర్లకు గత రెండు నెలలుగా చెవిరెడ్డి డబ్బులు పంపినట్లు బహిరంగంగా చెబుతున్నారు. ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మొదటి నెలలో డబ్బులతోపాటు గిఫ్టులు పంపారు. ఈ నెలలో కేవలం డబ్బులు పంపారు. అయితే మార్చిలో వలంటీర్లకు కొన్ని నియోజకవర్గాల్లోనే డబ్బులు, గిఫ్టులు ఇచ్చి కొన్నిచోట్ల కేవలం డబ్బులే ఇచ్చారు. గిఫ్టులు రాని చోట వలంటీర్లు స్థానిక నాయకులను ప్రశ్నించగా మనకు పంపలేదని వారు చేతులెత్తేశారు. దీంతో రెండు రకాలైన పంపిణీ ఏమిటంటూ వలంటీర్లలోనే చర్చ నడిచింది.

డబ్బు విషయంలో మరింత గగ్గోలు

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని వైసీపీ కౌన్సిలర్లు, లేనిచోట ఇన్‌చార్జిలకు కొన్ని మున్సిపాలిటీల్లో పార్టీ డివిజన్ అధ్యక్షులకు డబ్బులు ఇవ్వడం ప్రారంబించారు. అలా గిద్దలూరులో తొలుత ఒక్కక్కరికి రూ.2లక్షలు ఇచ్చారు. మార్కాపురం, కనిగిరిలో ఒక్కొక్కరికి లక్ష పంపిణీ చేశారు. ఆ సందర్భంగా త్వరలో మరో లక్షా లేక రెండు లక్షలు మీకు వస్తామని స్థానిక నాయకులు చెప్పారు. మార్కాపురంలాంటి మున్సిపాలిటీల్లో కౌన్సిలర్‌కు లక్ష ఇచ్చి అతనితో ఉండే 10మంది ముఖ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేలు ప్రకారం ఇమ్మని మరో లక్ష ఇచ్చారు. ఆ డబ్బు ఎవరికి ఇస్తారో ముందుగా పేర్లు ఇవ్వాలని అడిగి వెరిఫై చేసుకొని మరీ ఇచ్చారు. తాజాగా ఒంగోలులో ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3లక్షల ప్రకారం ఇచ్చారు. కొంత తక్కువగా డివిజన్ అధ్యక్షులకు చెల్లించారు. దీంతో పశ్చిమప్రాంతంలోని ఆయా మునిసిపాలిటీల్లోని కౌన్సిలర్లు తమకు లక్ష ఇచ్చి అక్కడ మూడు లక్షలు ఎలా ఇచ్చారు అని ప్రశ్నిస్తూ వెంటనే తమకు అలాగే ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలిసింది. అంతేకాక పశ్చిమ ప్రాంతంలోని మునిసిపాలిటీల్లో మరికొందరికి లక్ష ఇస్తే కొందరికి రెండు లక్షలు ఇచ్చినట్లు బయటపడింది. దీంతో అక్కడ కౌన్సిలర్లు తమ అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రారంభించారు. ఇది గమనించి అభ్యర్థులు మీకు కూడా మరికొంత ఇస్తారు. కాకపోతే మరో వారం రోజులు ఓపిక పట్టండి అంటూ సముదాయిస్తున్నట్లు తెలిసింది.

సీనియర్ల జోలికెళ్లడు.. జూనియర్లను పట్టించుకోడు

అసెంబ్లీ అభ్యర్థులతోనూ చెవిరెడ్డికి సమన్వయం లోపించింది. కొందరు అభ్యర్థుల విషయంలో అణిగిమణిగి వ్యవహరిస్తున్న ఆయన రాజకీయంగా జూనియర్లు అయిన కొందరిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు బహిరంగంగానే ఉన్నాయి. మీ పని మీరు చేయండి నేను ఏమి చేయాలో చేస్తానన్న చందంగా కొందరితో మాట్లాడుతున్నారని ఆ పార్టీశ్రేణులు గుసగుసలాడుకుంటున్నాయి. ఏడు నియోజకవర్గాల్లో రెండుచోట్ల తానేమీ చేయూత ఇవ్వలేనని సంకేతం ఇచ్చినట్లు సమాచారం. దీంతో బదిలీపై తూర్పు ప్రాంతానికి వచ్చి పోటీచేస్తున్న ఒక అభ్యర్థి.. విషయాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే పైకి మాత్రం తానే అన్నీ సమకూర్చుతున్నాను అన్న తరహాలో చెవిరెడ్డి హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కొందరు అధికారుల మద్దతుతో బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం నిల్వలను అక్రమంగా పెడుతున్నట్లు తెలిసింది. అందుకు సహకరించని బార్ అండ్ రెస్టారెంట్లపై అధికారులతో తనిఖీలు చేయించి కేసులు రాయించడం, వాటిని సీజ్ చేయించడంలాంటి చర్యలకు శ్రీకారం పలికారు. ప్రజలను కాకపోయినా పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులను కూడా కలవని చెవిరెడ్డితో ముందుముందు మరింత ఇబ్బందులు తప్పకపోవచ్చన్న భావన ఆ పార్టీ నాయకుల్లో పెరిగిపోతుంది.

బ్యాంకు ఖాతాలకే పింఛన్

డీబీటీ పద్ధతిలో జమ

వచ్చేనెల ఒకటిన వేయనున్న ప్రభుత్వం

దివ్యాంగులు, మంచంలో ఉన్న వృద్ధులు,

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకే ఇంటికే పింఛన్లు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 28: ఎన్నికల వేళ రాష్ట్రప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీ విషయంలో నెలకో నిర్ణయం తీసుకుంటోంది. గత నెలలో సచివాలయాల్లో పింఛన్లను పంపిణీ చేయగా, ఈ నెలలో డీబీటీ పద్ధతిలో వీటిని జమచేయాలని నిర్ణయించింది. ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయటాన్ని నిలిపివేయటం తగదంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత నెలకు సంబంధించిన పింఛన్లను ఈ నెల మొదటివారంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చెల్లించారు. గతంలో వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ సొమ్మును తీసుకుపోయి అందించేవారు. అయితే ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో గత నెలలో పింఛన్లను సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు అందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, వికలాంగుల, ఇతర లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. దీనిపై తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కూడా చేశారు. సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఇళ్లకు పంపించి అందించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ పింఛన్‌దారులను ఇబ్బందిపెట్టడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం గతనెల పింఛన్‌ను సచివాలయాల దగ్గరే పంపిణీ చేసింది. దీంతో వృద్ధులు, వితంతువులు, వ్యాధులతో బాధపడుతున్నవారు, దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారు. ఎండ వేడిమికి తట్టుకోలేక కొంతమంది మృత్యువాతపడ్డారు. అయితే ఈ నెల సొమ్ము అయినా ఇంటికి వచ్చి అందజేస్తారని పింఛన్‌దారులు ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో ప్రభుత్వం తాజాగా డీబీటీ పద్ధతిపై పింఛన్లను మే 1న అందజేస్తామని ప్రకటించింది. పింఛన్ పొందుతున్న వారి ఆధార్ కార్డుల ఆధారంగా లింకు అయిన బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్మును జమ చేయనున్నారు. పింఛన్ సొమ్మును జమ చేసేందుకు ఆధార్‌తో లింకు చేసి ఉన్న బ్యాంకు ఖతాల వివరాలను సెర్ప్ అధికారులు బ్యాంకుల నుంచి సేకరించనున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ వివరాలను సేకరించి జిల్లా అధికారులకు పంపించనున్నారు. ఆ మేరకు ఏప్రిల్ మాసానికి సంబంధించిన పింఛన్ సొమ్మును మే 1వ తేదీన బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు.



మంచంలో ఉన్న వృద్ధులు, రోగులు, దివ్యాంగులకు ఇంటికే పింఛన్

కాగా బ్యాంకులకు వెళ్లి పింఛన్ సొమ్మును తీసుకునే స్థితిలో లేని వృద్ధులు, మంచానికి పరిమితమై ఉన్న రోగులు, దివ్యాంగులకు మాత్రం సచివాలయం సిబ్బంది ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరికి ఇంటి వద్దకే పింఛన్ అందజేసేందుకు ఈనెల 30వ తేదీనే బ్యాంకుల నుంచి నగదును డ్రా చేయనున్నారు. ఎంతమందికి ఇంటికి పింఛన్ అందజేయాలి, ఎంతమందికి బ్యాంకు ఖాతాలకు జమచేస్తున్నారనే వివరాలను ప్రభుత్వం సోమవారం నాటికి జిల్లా అధికారులకు తెలియజేయనుంది. జిల్లాలో 2,92,522మందికి ప్రభుత్వం ప్రతినెలా పింఛన్లను అందజేస్తుంది. అందుకోసం ప్రతినెల రూ.87.49 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేస్తోంది. మొత్తం 2,92,522 మందిలో 75శాతం మందికి మాత్రమే బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో లింకై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మిగిలిన వారికి ఇంటికే తీసుకెళ్లి పింఛన్ సొమ్మును అందజేయాల్సి ఉందని డీఆర్‌డీఏ అధికారులు అంటున్నారు.

సన్‌డే

మార్కాపురం, కంభంలలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత

అనేక మండలాల్లో 43 డిగ్రీలపైనే నమోదు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 28 : సూరీడు చెలరేగిపోతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే సుర్రుమనిపిస్తున్నాడు. మధ్యాహ్నానికి మంటపుట్టిస్తున్నాడు. ఆదివారం మోతాదు మరింత పెంచాడు. దీంతో జిల్లాలోని పశ్చిమప్రాంతం నిప్పుల కుంపటిలా మారింది. మార్కాపురం,



కంభం, అర్ధవీడుల్లో 44.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అది అనేక మండలాల్లో 43 డిగ్రీలకుపైనే ఉంది. ఎర్రగొండపాలెంలో 44.3, దొనకొండలో 44.2, హనుమంతునిపాడులో 44.1, గిద్దలూరులో 44.1, కనిగిరిలో 44.0, పెద్దారవీడులో 44.0, తర్లుబాడులో 43.8, వెలిగండ్లలో 43.9 డిగ్రీల ఎండ కాచింది. పీసీపల్లిలో 43.6, కొమరోలులో 43.5, పొదిలిలో 43.4, చీమకుర్తిలో 43.4, దోర్నాలలో 43.3, సీఎస్‌పురంలో 43.2, కొనకనమిట్లలో 43.2, బేస్తవారపేటలో 42.9, ముండ్లమూరులో 43.7, కురిచేడులో 43.2, పొన్నలూరులో 43.2, మర్రిపూడిలో 43.0, కొత్తపట్నంలో 42.9, మద్దిపాడులో 41.2, సంతనూతలపాడులో 41.1, ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన అనేక మండలాల్లో అది 40 డిగ్రీలపైనే ఉంది. ఒంగోలులో 39.7 డిగ్రీలు నమోదైంది. ఎండకు తోడు వడగాడ్పుల తీవ్రత కూడా పెరగడంతో వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడారు.

కూటమి అగ్రనేతలు వస్తున్నారు..

- రేపు ఒంగోలుకు లోకేష్
- కొండపి, ఎస్‌ఎన్‌పాడుల్లో బాలకృష్ణ పర్యటన
- 2 లేదా 4 తేదీల్లో దర్శికి చంద్రబాబు
- 3న గిద్దలూరు, దర్శి, ఒంగోలులో పవన్ సభలు

ఒంగోలు, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో టీడీపీ కూటమి తరపున పోటీచేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి అగ్రనేతలు తరలివస్తున్నారు. టీడీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుండగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నందమూరి బాలకృష్ణతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ప్రచారం నిర్వహించనున్నారు. వారి పర్యటనలపై జిల్లాలోని ఇరు పార్టీల వర్గాలకు సమాచారం అందింది. ఆప్రకారం ఈనెల 30వతేదీన ఒంగోలుకు యువనేత నారా లోకేష్ రానున్నారు. నగరంలోని ఏ-1 కన్వెన్షన్ హాలు ఎదురు స్థలంలో సుమారు ఐదువేల మంది యువకులతో ఏర్పాటు చేస్తున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ఆ కార్యక్రమం ఉంటుంది. అనంతరం నెల్లూరు వెళ్తారు. 30వ తేదీనే టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి, సంతనూతలపాడు నియోజక వర్గాల్లో జరిగే సభల్లో పాల్గొంటారు. టీడీపీ అధినేత చంద్రబాబు దర్శి నియోజకవర్గానికి రానున్నారు. అయితే 3వతేదీ పవన్ కల్యాణ్ కార్యక్ర మం ఉన్నందున ఈనెల 2 లేక 4వతేదీల్లో చంద్రబాబు పర్యటించే అవకాశం ఉంది. మార్కాపురం, దర్శి, కనిగిరి నియోజక వర్గాలు కలిసొచ్చే విధంగా కూడలి ప్రాంతంలో సభ లేక దర్శిలో రోడ్‌షో కార్యక్రమంలో ఒకటి ఉండే అవకాశం ఉంది. ఇక టీడీపీ కూటమిలో ప్రధాన పాత్ర ధారైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా మే 3వ తేదీన జిల్లాలో ఎన్నికల పర్యటనకు వస్తున్నట్లు సమా చారం. ఆరోజు ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని గిద్దలూరు, దర్శి, ఒంగో లుల్లో జరిగే సభల్లో పవన్ కల్యాణ్ పాల్గొంటారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

పంగులూరు, ఏప్రిల్ 28 : మండలంలోని కల్లంవారిపాలెం గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో 10 కుటుంబాలకు చెందిన వైసీపీ శ్రేణులు ఆదివారం సైకిలెక్కారు. మార్టూరు మండలం జొంతాలి క్యాంపు కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ పార్టీ కండువాలు కప్పి వీరందరినీ తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.

విజయ సాధనే ధ్యేయం

అద్దంకి నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల తరపున పోటీ చేసి గెలుపొందిన నేతగా గొట్టిపాటికి అరుదైన గుర్తింపు... నియోజకవర్గంలో 85 శాతం వరకు ఓటర్లు ఏదో ఒక సందర్భంలో గొట్టిపాటికి ఓటు వేసిన వారే... ఆ పరిచయాలే మరోసారి భారీ మెజార్టీ సాధించేందుకు దోహదపడతాయని టీడీపీ నేతల అంచనా వేస్తున్నారు.

ఐదోసారి బరిలో ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రతి ఇంటి తలుపు తడుతున్న కుటుంబం

అందరినీ కలవడమే లక్ష్యం

అద్దంకి, ఏప్రిల్ 28 : పరిస్థితులకు అనుకూలంగా నడుచుకుంటూ విజయం సాధించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల వ్యూహాలు ఉండడమే ఆయన విజయ రహస్యంగా రాజకీయ విశ్లేషకులు అంచనా. ఈ క్రమంలో ఇప్పటికే 4 సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన గొట్టిపాటి 5వ సారి బరిలో నిలిచారు. 5వ సారి పోటీ చేస్తున్నా ఏమాత్రం ఏమరపాటు వహించకుండా పక్కా వ్యూహంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తనతో పాటు కుటుంబ సభ్యులందరూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని కుటుంబాలను స్వయంగా కలిసి ఓట్లు అడగాలన్న ఏకైక సంకల్పంతో గొట్టిపాటి కుటుంబం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ప్రతి రోజు ఐదారు గ్రామాలలో గొట్టిపాటి కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీకి ఒకింత పట్టు ఉందనుకున్న గ్రామాలను ఎంపిక చేసుకున్న గొట్టిపాటి రవికుమార్ తొలి ప్రాధాన్యంగా తానే స్వయంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక గత 4 దశాబ్దాలు గా గొట్టిపాటి కటుంబంతో మంచి అనుబంధం ఉన్న సంతమాగులూరు, బల్లికురవ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాలలో గొట్టిపాటి కుమారుడు హర్షవర్ధన్, సోదరుని కుమారుడు కమల్‌కిషోర్ (బాబీ) అత్యధిక గ్రామాలలో ఇప్పటికే ఎన్నికల ప్రచారం పూర్తి చేశారు. ఇక అద్దంకి పట్టణంలోని కొన్ని వార్డులలో కూడా హర్షవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక గొట్టిపాటి సతీమణి ఝాన్సీ ప్రతి రోజు సాయంత్రం పంగులూరు మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక గొట్టిపాటి రవికుమార్ ఇప్పటి వరకు వైసీపీకి పట్టు ఉన్న గ్రామాలపై దృష్టి సారించి ప్రచారం నిర్వహించగా గత రెండు, మూడు రోజులు గా టీడీపీకి అత్యధిక మెజార్టీ వచ్చే గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించాలన్న లక్ష్యంతో కుటుంబ సభ్యులు అందరూ నిత్యం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రతి ఇంటి గడప తట్టాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ ఏ అభ్యర్థి ప్రచారం నిర్వహించని విధంగా గొట్టిపాటి కుటుంబం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గత నాలుగు ఎన్నికలలో గొట్టిపాటి రవికుమార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 2 సార్లు, వైసీపీ నుంచి ఒక సారి, టీడీపీ నుంచి ఒక సారి పోటీ చేసి ఉండడంతో నియోజకవర్గంలోని సుమారు 85 శాతం ఓటర్లు ఏదో ఒక ఎన్నికలలో ఓటు వేసి ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలా నియోజకవర్గంలో అత్యధిక కుటుంబాలతో గొట్టిపాటికి సంబంధాలు ఉండడంతో ప్రస్తుతం గొట్టిపాటి కుటుంబసభ్యుల ఎన్నికల ప్రచారానికి మంచి స్పందన వస్తుందని, ఇదే ఈ ఎన్నికలలో భారీ మెజార్టీ సాధించేందుకు ఎంతగానో దోహదపడుతుందని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు వైసీపీ తరపున పోటీ చేస్తున్న పాణెం చినహనిమిరెడ్డి స్థానికేతరుడు కావడం, నియోజకవర్గ ప్రజలతో అంతగా సంబంధాలు లేక పోవడం గొట్టిపాటికి భారీ మెజార్టీ రావడానికి దోహదపడుతుందన్న అభి ప్రాయాన్ని టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నారు. వరుసగా 5వ సారి గెలిచేందుకు గొట్టిపాటి రవికుమార్ ఏ చిన్న అవకాశం ఉన్నా వదలకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.



కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా పంగులూరు,అద్దంకి, బల్లికురవ మండలాల్లో ప్రచారం చేస్తున్న రవికుమార్ భార్య ఝాన్సీ, కుమారుడు హర్షవర్ధన్, బాబీ



ఆత్మీయ సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న చంద్రబాబు, తదితరులు



వేదికపై ముస్లింలతో కలిసి దువా చేస్తున్న చంద్రబాబు, టీడీపీ నాయకులు

మేం ఎంతో చేశాం!

వారేం చేశారు!?

- నెల్లూరులో చిన్న భవనమైనా కట్టారా!?
- ముస్లింలకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ
- మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం
- ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు

నెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : 'నెల్లూరు నగరంలో మేము రూ.8కోట్లతో ఆధునిక వసతులతో షాదీ మంజిల్ నిర్మించాం. 20 వేల మంది ముస్లింలకు మంచి చేశాం. రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా మార్చి గుర్తింపునిచ్చాం. రూ.కోట్లు నిధులిచ్చి బారాషాహీద్ దర్గాను అభివృద్ధి చేశాం. ముస్లిం యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశాం. గోషా ఆసుపత్రి నిర్మించాం. మసీదుల మరమ్మతులు, రంగులకు నిధులిచ్చాం. రంజాన్ తోఫా, దుల్హన్ పథకాలతో పేద ముస్లింలకు అండగా నిలిచాం. కానీ వైసీపీ ప్రభుత్వం నెల్లూరులో ముస్లింలకు చిన్న భవనమైనా కట్టిందా!?' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్‌లో ముస్లింలతో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. శనివారం రాత్రి బుచ్చిలో బస చేసిన ఆయన ఆదివారం హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకున్నారు. సుమారు గంటకుపైగా ముస్లింలతో సమావేశమయ్యారు. చంద్రబాబుతో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు మహిళలు పోటీపడ్డారు. ముస్లిం నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లింల సమస్యలను వారి నుంచే చంద్రబాబు తెలుసుకున్నారు. పలువురు మహిళలు తమ బాధలను చెప్పుకోగా వారికి చంద్రబాబు భరోసా కల్పించారు. అధికారంలోకి వచ్చాక ముస్లిం సామాజిక వర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తామని హామీ ఇచ్చారు.

ముస్లిం సమాజం ఆలోచించాలి

టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలు ప్రశాంతంగా జీవించేవారని, కానీ నేడు వారిపై దాడులు, అరాచకాలు ఎక్కువయ్యాయని చంద్రబాబు అన్నారు. అబ్దుల్ సలాం, మిస్బా వంటి అనేక మంది వైసీపీ చేష్టలతో మరణించారని ఆరోపించారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ చట్టాలకు పార్లమెంటులో వైసీపీ సపోర్ట్ చేసిందని, ఏ2 విజయసాయిరెడ్డి ఇవి మంచి చట్టాలంటూ మాట్లాడారని గుర్తు చేశారు. కానీ అదే విజయసాయి నేడు నెల్లూరులో ముస్లింలకు అన్యాయం జరుగుతోందని మాట్లాతున్నారని విమర్శించారు. తన పాలనలో న్యాయం జరిగిందా.. లేక జగన్ పాలనలో న్యాయం జరిగిందా.. అన్నది ముస్లిం సమాజం ఆలోచన చేయాలని చంద్రబాబు కోరారు. ఎన్డీఏలో ఉన్నా ఏ ఒక్క ముస్లింకు అన్యాయం జరగకుండా చూశామని చెప్పారు. ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను గెలిపించాలని చంద్రబాబు అభ్యర్థించారు. ఈ సమావేశంలో అభ్యర్థులతోపాటు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు తాళ్లపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి హామీలు

నెల్లూరులో ముస్లింలు తనపై చూపిన అభిమానంతో తన జన్మ సార్థకం అయ్యిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ముస్లిం యువత కోసం ప్రత్యేకంగా కాలేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలానే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి అవసరమైన నైపుణ్యాన్ని అందించి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. పోర్టు, రైల్వే, హైవే వసతులతో నెల్లూరు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చాలా అవకాశాలు ఉన్నాయని, ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో స్వర్ణకారుల సంక్షేమం కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వంలో ఆ ఫైల్ పక్కన పడేశారని ఓ వ్యక్తి చంద్రబాబు దృష్టికి తీసుకురాగా తాము అధికారంలోకి రాగానే ఆ రూ.10 కోట్లతోపాటు అదనంగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హజ్‌యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరికీ రూ.లక్ష సాయం అందిస్తామని ప్రకటించారు. డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలను మంజూరు చేసి స్వయం ఉపాధికి తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా దుల్హన్ పథకాన్ని తిరిగి కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. నెల్లూరులో ముస్లిం గురుకుల పాఠశాలను తాము 90 శాతం పూర్తి చేస్తే మిగిలిన పది శాతం పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే ఆ పనులు పూర్తి చేసి ముస్లింలకు అందుబాటులోకి తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం కూడా చేస్తామని ప్రకటించారు.



మైనారిటీలకు వెన్నుపోటు పొడిచిన జగన్

మైనారిటీలకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు. పండుగ పూట ఇస్తున్న రంజాన్ తోఫా వంటి కానులకు ఎత్తేశారు. దుల్హన్ పథకం ఆపేశారు. రాష్ట్రంలో పరిస్థితులు దుర్భరంగా మా రాయి. ముస్లింల అభివృద్ధి ఒక్క చంద్రబాబుతోనే సాధ్యం. దేశంలో మొదటిసారి ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. టీడీపీ ప్రభుత్వంలో మసీదుల మరమ్మతులు, రంగులకు నిధులు ఇచ్చారు. మరి జగన్‌కు ఎందుకు మనసు రావడం లేదు..?

- అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముస్లింలు



మాట్లాడుతున్న చంద్రబాబు

మేకపాటి కుటుంబం ఆత్మకూరుకు చేసింది శూన్యం

- బ్రాహ్మణపల్లి ప్రచారంలో వీపీఆర్, ఆనం



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఆనం

మర్రిపాడు, ఏప్రిల్ 28: మేకపాటి కుటుంబం ఆత్మకూరుకి చేసింది శూన్యమని నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని చిన్నమాచునూరులో వారు ప్రచారం నిర్వహించారు. అనంతరం వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి స్వగ్రామమైన బ్రాహ్మణపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడి సమిష్టి నాయకత్వంలో తాము మీ ముందుకొచ్చామని, ఆదరిస్తే ఏ స్థాయిలోనైనా పోరాడి మీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి మేకపాటి కుటుంబం చేసిందేమీ లేదన్నారు. రెండేళ్లలో పూర్తి చేయ గలిగే సోమశిల హైలె వెల్ పనులను చేతకాక, నిధులు బొక్కడానికే చెరువు కట్టల పేరుతో మట్టి పనులు చేశారని విమర్శించారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి అన్నదమ్ములు ఎమ్మెల్యేలుగా ఉండి సొంత మండలం మర్రిపాడుకు ఏం చేశారో? ప్రజలకు సమాధానం చెప్పాలని ఆనం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయడు, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకపక్షమే!?

- గంటసేపు సీఎం జగన్ ఒక్కరే ప్రసంగం
- సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థికి నోచాన్స్
- స్థానిక సమస్యలను ప్రస్తావించని వైనం
- గత హామీలపైనా ఉలుకూ పలుకూ లేదు!

కందుకూరు, ఏప్రిల్ 28: కందుకూరులో ఆదివారం జరిగిన ఎన్నికల సభలో పాల్గొన్న సీఎం జగన్ ఎవరినీ మాట్లాడనీయకుండా తానొక్కడే గంటసేపు మాట్లాడారు. అయితే ఆయన స్థానిక సమస్యల గురించి ప్రస్తావించకపోవటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్, సిట్టింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఇది జగన్ నియంతృత్వ పోకడకు నిదర్శనంగా జనం అభివర్ణిస్తున్నారు.

● ఆ హామీలు ఏమయ్యాయి?

కందుకూరు నియోజకవర్గానికి గతంలో జగన్ అనేక హామీలు ఇచ్చారు. రామాయపట్నం పోర్టు భూమి పూజ కోసం వచ్చిన సందర్భంగా ఆయన కందుకూరుకు ఉత్తర బైపాస్‌రోడ్డు ఎంతో అవసరమని, మహీధరన్న కోరిక మేరకు రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటిం చారు. అలాగే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు ద్వారా 8500 ఎకరాల అదనపు ఆయకట్టు సాగులోకి వస్తున్నందున, అందుకోసం వెంటనే రూ.27 కోట్లు కేటాయించి పనులు మొదలు పెడతామని చెప్పారు. అలాగే కరేడులో పీహెచ్‌సీకి శాశ్వత భవనాల నిర్మాణా నికి, గుడ్లూరు మండలం చినలాటిరిపిలో ఉద్యానకళాశాల భవన నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నాలుగు హామీలు అమలుకు నోచుకోకపోగా, కందు కూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.26 కోట్లు మంజూ రు చేస్తానన్న హామీ మాత్రం పాక్షికంగా నెరవేరింది. అయితే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కందుకూరుకు ఏమి చేయాల్సి ఉందో స్థానిక ప్రజాప్రతి నిధులు ప్రస్తావిస్తే, సీఎం తన ప్రసంగంలో అందుకు సమాధానం చెప్పి వెళ్లడం ఆనవాయితీ. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థికి మాట్లాడే అవకాశం జగన్ ఇవ్వలేదు. పోనీ తనంతట తానైనా కందుకూరుకు ఏమి చేస్తాడో చెబుతాడని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఎమ్మెల్యే మహీధరరెడ్డి గురించి మాట్లాడుతూ ఆయన ఎంతో మంచివాడని, సౌమ్యుడని ప్రశంసించారు. అయితే తన మనోభావాన్ని మహీధరరెడ్డి చేత ప్రజల్లకు చెప్పించేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. ఇందులో ఆంతర్యం ఏమిటని వైసీపీ క్యాడరే గుసగుసలాడుకుంటుడం విశేషం. కాగా, సీఎం ప్రసంగిస్తుండగానే జనం వెనుతిరుగుతూ కనిపించారు.

గుర్రంవారిపాలెం రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్



కందుకూరులో ట్రాఫిక్ కష్టాలు

సీఎం సభ సందర్భంగా ఆదివారం కందుకూరు ప్రజలు ట్రాఫిక్ కష్టాలతో నరకయాతన అనుభవించారు. పట్టణానికి ప్రధాన రహదారేకాక 167బీ జాతీయ రహదారి అయిన ప్రధాన రహదారిని బ్లాక్‌చేసి ఏరియా హాస్పిటల్ సెంటర్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీంతో కందుకూరు నుంచి వివిధ మార్గాలకు వెళ్లే వాహనాలతో పాటు కందుకూరు మీదుగా బెంగళూరు, కావలి, విజయవాడ, ఒంగోలు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను, పామూరు, ఉదయగిరి, వింజమూరు, సీఎస్ పురం, కనిగిరి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఆదివారం ఉదయం నుంచే దారి మళ్లించేశారు. ప్రత్యామ్నాయంగా బలిజపాలెం, చాకలికుంట, పామూరు రోడ్డు, గుర్రంవారిపాలెం, క్లబ్ రోడ్డు మీదుగా వాహనాలు వెళ్లేలా ఏర్పాటుచేసిన పోలీసులు ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టలేదు. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే తొలిగేందుకు అవకాశం లేని ఈ మార్గంలోనే రాకపోకలకు అనుమతించారు. మరోవైపు మధ్యాహ్నం నుంచి చిన్నచిన్న వాహనాలను కూడా పట్టణంలోకి అనుమతించకుండా దారి మళ్లించారు. ఈ మార్గాల్లో కనీసం పాదచారులను కూడా అనుమతించలేదు. ఉలవపాడు, కందుకూరు మండలాల్లోని గ్రామాల నుంచి జగన్ సభకు వచ్చే వాహనాలకు కూడా ఇదే మార్గం కావటంతో గంటలతరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇదిగో ఇసుక దోపిడీ!?

- యార్డుల పేరుతో విచ్చలవిడిగా తవ్వకాలు
- రాత్రివేళ నదిలో తవ్వకాలు.. పగలు యార్డుల నుంచి రవాణా
- ఏడాది నుంచి తరగని నిల్వలు
- రోజూ రూ.లక్షల్లో అక్రమ సంపాదన

"ఎన్నికల కోడ్ అయితేనేం... మా దోపిడీ మాదే. మమ్మల్ని అడిగేదెవరు.. ఆపేదెవరు." ఇదీ ఇసుక అక్రమార్కుల దౌర్జన్యకాండ. ఓ వైపు ఎన్జీటీ ఆదేశించినా.. మరోవైపు హైకోర్టు కన్నెర్ర చేసినా ఇంకోవైపు ఎన్నికల కమిషన్ సీరియస్ అయినా జిల్లాలో ఇసుక దందా మాత్రం ఆగడం లేదు.

నెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ రాకముందు అనుమతులు లేకపోయినా దర్జాగా పెన్నా నదిలో తవ్వకాలు జరుపుతూ దోచుకున్నారు. అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా ఏ అధికారీ సాహసించలేదు. రోజూ రూ.2 కోట్ల నుంచి 3 కోట్ల ఇసుక అక్రమ వ్యాపారం సాగేది. ఈ అక్రమ తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదిక కోరగా జిల్లాలో ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడం లేదని మూడు నెలల క్రితం జిల్లా అధికారులు నివేదిక ఇచ్చారు. ఓ వైపు కళ్ల ముందు కనిపిస్తున్నా తమకు కనిపించడం లేదు అన్నట్లుగా ఉన్నతాధికారులే తప్పుడు నివేదికలు ఇవ్వడంపై ప్రజలు నివ్వెరపోయారు. అయితే ఎన్నికల కోడ్ వచ్చాక ఈ దఫా హైకోర్టు ఇసుక అక్రమ తవ్వకాలపై కన్నెర్ర జేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు నదీ గర్భంలో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడం లేదంటూ హైకోర్టుకు నివేదించారు. అప్పటినుంచి పెన్నా నదిలో బహిరంగంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. కానీ అక్రమ సంపాదనకు అలవాటు పడిన వ్యక్తులు రూ.కోట్ల సంపాదనను వదులుకుంటారా?! ఇప్పుడు యార్డుల పేరుతో కొత్త దోపిడీకి తెరలేపారు.

● లెక్కలేవీ!?

నదిలో తవ్వకాలు నిలిపేయడంతో యార్డుల్లోని ఇసుకను విక్రయిస్తున్నారు. ఏపీఎండీసీ సంస్థ ఏర్పాటు చేసిన యార్డులను కాంట్రాక్టు సంస్థలు ఎలా తమవిగా వాడుకుంటున్నాయన్నది అనుమానంగా మారింది. ఏడాదన్నరగా నదిలో తవ్వకాలకు అనుమతులు లేవని అధికారుల నివేదికలు చెబుతున్నాయి. అప్పటి నుంచి స్టాక్ యార్డుల పేరుతో కాంట్రాక్టు సంస్థ బిల్లులు ఇస్తోంది. మరి అంత కాలం నుంచి యార్డుల్లోని ఇసుకను తరలిస్తుంటే ఇంకా తరిగిపోలేదా.. అన్నదే అసలు ప్రశ్న. పగలంతా యార్డుల్లో నుంచి ఇసుకను విక్రయిస్తున్న అక్రమార్కులు, రాత్రివేళల్లో నదిలో నుంచి తవ్వకాలు జరిపి మళ్లీ యార్డులను నింపుకుంటున్నారు. దీంతో నెలలు గడిచినా యార్డుల్లో నిల్వలు తరగడం లేదని స్థానికులు చెబుతు న్నారు. అసలు యార్డుల్లో ఎంత ఇసుక నిల్వ ఉంది..? ఎంత విక్రయించారు..? ఎంత మిగిలి ఉంది..? ఎప్పటివరకు ఈ ఇసుక విక్రయాలకు అనుమతులున్నాయి..? అన్న వివరాలేవీ అధికారుల వద్ద లేవు. పల్లిపాడు, మినగల్లు ఇసుక రీచ్‌ల ఒడ్డును ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ యార్డులను ఓ సారి పరిశీలిస్తే దోపిడీ ఏ స్థాయిలో జరుగుతోందో స్పష్టమవుతుంది. ప్రస్తుతం ఈ రెండు రీచ్‌ల నుంచి నిత్యం రూ.50 లక్షల వరకు విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరి ఆ ప్రజాధనమంతా ఎక్కడికి పోతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై జిల్లా మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా స్టాక్ యార్డులో నిల్వలు ఎంత ఉన్నాయన్న వివరాలను తెలుసుకొని పరిశీలన జరుపుతామని చెప్పారు.



మినగల్లు రీచ్ ఒడ్డున యార్డు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ



పల్లిపాడు రీచ్ ఒడ్డున స్టాక్ యార్డులో ఇసుకను లారీలకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

నిలిచేదెవరు... తప్పుకునేదెవరు ?

- తేలేది నేడే..
- నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటితో పూర్తి
- సాయంత్రానికి అభ్యర్థుల వివరాల వెల్లడి


ఆమోదించిన నామినేషన్లు

నియోజకవర్గం	నామినేషన్లు
సర్వేపల్లి	13
నెల్లూరు రూరల్	12
నెల్లూరు సిటీ	18
కావలి	15
కందుకూరు	24
ఉదయగిరి	16
కోవూరు	19
ఆత్మకూరు	13
మొత్తం	130

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగుస్తుంది. పోటీ నుంచి వైదొలగే అభ్యర్థులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోగా తమ నామినేషన్‌ను ఉపసంహరించుకోవచ్చు. మధ్యాహ్నం 3.30 గంటల తరువాత బరిలో నిలిచేవారి వివరాలను అధికారులు వెల్లడిస్తారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల గుర్తులు యథాతథంగా ఉంటాయి. నామినేషన్ల ఉపసం హరణ తరువాత ఇండిపెండెంట్లకు కలెక్టర్ గుర్తులు కేటాయిస్తారు. నామినేషన్ల పరిశీలన తరువాత జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 130 మంది రంగంలో మిగిలారు. నెల్లూరు ఎంపీ స్థానానికి 15 మంది పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరు పోటీలో నిలబడనున్నారో.. ఎవరు వైదొలుగుతారో సోమవారం సాయంత్రం తేలిపోతుంది.

కావలిలో టీడీపీ జెండా ఎగురవేయాలి

● మాలేపాటికి చంద్రబాబు సూచన



కావలి, ఏప్రిల్ 28: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని ఆదివారం బుచ్చిరెడ్డి పాలెంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు కలిశారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై అడిగి తెలుసుకున్న చంద్రబాబు అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఈ ఎన్నికల్లో కావలిలో టీడీపీ జెండా ఎగురవేయాలని చెప్పినట్లు మాలేపాటి పేర్కొన్నారు.

టీడీపీ గెలుపే ధ్యేయం

దగదర్తి(బిట్రగుంట) : తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు సమష్టిగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు స్థానికులను కోరారు. దగదర్తి మండలం సున్నపుబట్టి, పెద్దపుత్తేడు, ఉలవపాళ్ల గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల కోసం చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ రాక్షస పాలనకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పూజలు

కావలిటౌన్, ఏప్రిల్ 28: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని జిల్లా రైతు సంఘం నాయకులు రామిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అక్కమ్మబావి సెంటర్ వద్దనుంచి పాతూరు రైతులు, వందలాది మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా బయలు దేరి పాతూరులోని పోలేరమ్మ అరుగు వద్ద పూజలు నిర్వహించారు. అక్కడినుంచి గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారి ఆలయం చేరుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పులిగుంట రామిరెడ్డి, వాకా శ్రీనివాసులు రెడ్డి, కొమరా తిరుపతి గౌడ్, పరుసు శ్రీహరి, ఆర్ తిరుపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డు రాళ్ల పునఃప్రతిష్ఠ


పూజలు చేస్తున్న యాగ్నికులు

బిట్రగుంట, ఏప్రిల్ 28: బోగోలు మండలం యాదవపాలెంలో అష్ట దిక్కుల దేవతల, బొడ్డు రాళ్ల పునఃప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యేక పూజలు ఆదివారంతో పూర్తయ్యాయి. యాదవపాలెంలో కొన్ని సంవత్సరాల క్రితం పెద్దలు ఏర్పాటు చేసిన పురాతన దేవతల, బొడ్డురాళ్లను జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠాచార్యులు బ్రహ్మశ్రీ అయలార్జుల శివకుమార్ శాస్త్రి మాట్లాడుతు ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు, కలిశాలను పవిత్రంగా చూసుకోవాలన్నారు. యాదవపాలెం గంగమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసంతర్పన కార్యక్రమం జరిగింది.

కావలి కందుకూరు

● దుస్థితిలో వైకుంఠపురం ముంపు ప్రాంతాల్లో రోడ్లు
● నెల రోజుల్లో చేపడుతామన్న పనులకు 17 నెలలైనా దిక్కులేదు..!
● ప్రశ్నించే వారికి తాయిలాలు
● ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీరుపై ప్రజలు ఆగ్రహం


వరద నీటితో జలమయమైన వైకుంఠపురం రోడ్లు (ఫైల్)

ఎమ్మెల్యే హామీ నీటిపాలు!



కావలి రూరల్, ఏప్రిల్ 28: ఎమ్మెల్యే సారూ.. మీ మాటలన్నీ నీటి పాలయ్యాయి. వరద నీటిలో మునిగిన వైకుంఠపురం ముంపు ప్రాంతాల్లో పర్యటించి నెల రోజుల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామన్న మీ హామీకి 17 నెలలైనా దిక్కు లేదు.. మా చెవిలో ఇలా పువ్వు పెడతారనుకోలేదు సారూ..

కావలి పట్టణ 38వ వార్డు వైకుంఠపురంలో పేదలు నివశిస్తున్నారు. 2022 నవంబరులో కురిసిన కుండ పోత వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గం లేక అన్నపుగుంట రోడ్డులో ఉన్న నిరుపేదల నివాసాల్లోకి చేరింది. ఆ ప్రాంత వాసులు మంచాలపై బీరువాలు, బియ్యపు బస్తాలు పెట్టుకుని నాలుగు రోజుల పాటు వర్షపు నీటిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నవంబరు 14వ తేదీన ఆ ప్రాంతంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ శివారెడ్డితో కలసి సందర్శించారు. నడుము లోతు నీటిలో దిగి స్థానికులు, అధికారులతో చర్చించారు. ఈ సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చి బాధితులకు భోజనం పొట్లాలు తెచ్చి చేతులు దులిపేసుకున్నారు. అయితే 30 రోజుల్లో మా ప్రాంతానికి రోడ్లు, డ్రైనేజీ కాలువలు వస్తాయని ఎంతో ఆశగా ఎదురుచూసిన ఆ ప్రాంత ప్రజలకు నేటికి 17 నెలలైనా కార్యరూపం దాల్చకపోవడంతో ఎమ్మెల్యే మాటలు నీటి మీద రాతలుగా మిగిలాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● **హామీలపై ప్రశ్నించిన వారికి తాయిలాలు**

ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యేను నెల రోజుల్లో వేయిస్తానన్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలపై స్థానికులు కొందరు ప్రశ్నించారు. రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిపించినా రోడ్లు వెయ్యకపోగా ఎన్నికలు దగ్గర పడటంతో మళ్లీ వస్తున్నారని ప్రశ్నించారు. అలాంటి వారిని ఎమ్మెల్యే ఇంటికి పిలిపించి చీర, సారెలతో పాటు విందు భోజనాలతో నగదు తాయిలాలు అందించినట్లు సమాచారం. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టక పోగా సీసీ రోడ్డు పైకి మురుగునీరు చేరే ప్రాంతంలో మట్టి పోయించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యే రామిరెడ్డికి మరో అవకాశం ఇస్తే

సముద్రాన్నే మింగేస్తాడు!

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ● కొండబిట్రగుంట మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి టీడీపీలో చేరిక


వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీరాం మాల్యాద్రి

కావలి, ఏప్రిల్ 28: రెండు దఫాలు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని అడ్డం పెట్టుకుని అవినీతి, అరాచక పాలన సాగించిన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మరో అవకాశం ఇస్తే సముద్రాన్నే మింగేస్తాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆరోపించారు. ఆదివారం రాత్రి కావలిలోని వ్యాపార వర్గాలు, ఆర్యవైశ్యుల పరిచయ కార్యక్రమం స్థానిక బృందావనం కాలనీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బృందావనం హౌసింగ్ కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ తాజా మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ కావలి నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఎంతోమంది ఎమ్మెల్యేలను చూశామని, కానీ ప్రతాప్ కుమార్‌రెడ్డి అంత అవినీతి, దోపిడీ, అరాచక ఎమ్మెల్యేను ఇప్పటికి చూడలేదన్నారు. ఒక్కసారి అవకాశమని చెప్పి ఇసుక, గ్రావెల్ దోపిడీతో పాటు సుమారు 42 వేల అంకణాల ప్రభుత్వ భూములను కబ్జాచేసి మాయం చేశారన్నారు. మరోసారి అవకాశ ఇస్తే సముద్రాన్ని కూడా వెనుకకు నెట్టి దానిని కూడా మింగేస్తాడని చెప్పారు. కావలిని కనకపట్నం అని చెప్పి వరదపట్నంగా మార్చారన్నారు. వర్షాలు వస్తే ఇక కావలి మునకేనన్నారు. కావలిలో జరిగిన అక్రమాలను వెలికి తీసి కావలిని కాపాడాల్సిన బాధ్యత కావ్య క్రిష్ణారెడ్డిపై ఉందన్నారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దగుమాటివెంకట(కావ్య) క్రిష్ణారెడ్డిలు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులైన మేము ఎలాంటి అవినీతి మరకలు లేని క్లీన్ చిట్‌లమని, వైసీపీ అభ్యర్థులైన విజయసాయిరెడ్డి, రామిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలవి 420 చార్జిషీట్లని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేస్తే మనకు మంచి రోజులు వస్తాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని వనరులు ఉన్న కావలిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో భయం, భక్తి ఏమీ లేకుండా పోయిందన్నారు. ఆర్యవైశ్యులు, భయం భక్తి రెండూ ఉన్న వారని అలాంటి వారంటే తమకు ఎంతో గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి, నాయుడు రాంప్రసాద్, వేణుగోపాల్, బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, జీ. భరత్‌కుమార్, జనసేన నేతలు సాయి కిరన్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

అధికారపార్టీపై వ్యతిరేకత, కావలి ఎమ్మెల్యే అరాచకాలకు విసిగి వేసారిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ వెంట ఉన్న మరికొందరు కూడా ఆయనను వీడి టీడీపీలో చేరుతున్నారు. కావలి పట్టణం ముసునూరు టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్న వారందరికీ కూటమి అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

చినరాముడిపాలెం నుంచి 10 కుటుంబాల చేరిక

కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ చినరాముడిపాలెంకు చెందిన కోడూరు యానాది, కప్పంగారి వెంకటేశ్వర్లు, కాటంగారి మణికంఠ తదితర 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే కోడూరు కుమార్, నామాల వెంకటేశ్వర్లు, రవిలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. తుమ్మలపెంట రోడ్డు వేయలేని దుస్థితిలో ఉన్న వైసీపీనేతలపై నమ్మకం లేక పార్టీని వీడినట్లు తెలిపారు.

రుద్రకోట నుంచి...

కావలి రూరల్ మండలం రుద్రకోట నుంచి 70 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పసుపులేటి బాల కోటేశ్వరరావు, దేవెళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాయిని పాపారావు, రాయిని శ్రీను, రాయిని గోపి తదితర 40 కుటుంబాలు పసుపులేటి సుధాకర్ గూటిని వీడి టీడీపీలో చేరారు. అలాగే ఉప్పు ప్రసాద్, ఉప్పు శివకోటయ్య, ఉప్పు మాల్యాద్రిల ఆధ్వర్యంలో 5 కుటుంబాలు పసుపులేటిని వీడి టీడీపీలో చేరారు. నూతనంగా ఓటు వచ్చిన ఆల్వేకింగ్‌కు సంబంధించిన యువత ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, గండికోట బాబూరావు, తమ్మిశెట్టి అంజనేయులు కుటుంబాలు టీడీపీలో చేరారు.

16వ వార్డు నుంచి...

కావలి పట్టణం 16వ వార్డు బాలక్రిష్ణారెడ్డినగర్‌కు చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి నేలపాటి మాల్యాద్రి, కమ్మిశెట్టి రమణయ్య, కోసూరి సురేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో మౌలిక వసతులు కల్పించటంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైనందున ఆ పార్టీని వీడినట్లు తెలిపారు. అలాగే 37వ వార్డుకు చెందిన సాదిక్ ఆధ్వర్యంలో ఆ వార్డు వైసీపీ ముఖ్యనేత షేక్ సత్తార్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

విష్ణు అనుచరుడు...

మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి వైసీపీలో చేరడాన్ని జీర్ణించుకోలేక ఆయన ముఖ్య అనుచరుడు గొట్టిపాటి మధుసూదనరావు అలియాస్ రంగయ్య టీడీపీలో చేరారు. కావలి పార్టీ ఆఫీస్‌లో ఆదివారం చేరిన వారందరికీ క్రిష్ణారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


టీడీపీలో చేరిన రుద్రకోట వాసులు


టీడీపీలో చేరిన చినరాముడిపాలెం వాసులతో క్రిష్ణారెడ్డి

ఆదరించండి.. అండగా ఉంటా : ఇంటూరి


గుడ్లూరు : తెట్టులో ప్రచారం నిర్వహిస్తున్న నాగేశ్వరరావు


కందుకూరు : టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలతో ఇంటూరి

గుడ్లూరు, ఏప్రిల్ 28 : రానున్న ఎన్నికల్లో కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన తనను ప్రజలు పెద్దమనసుతో ఆదరించాలని, ఇచ్చిన మాటను తప్పకుండా నెరవేర్చి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో అండగా ఉంటానని కందుకూరు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తెట్టు, మోచర్ల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించి ప్రచారం నిర్వహించారు. మొదట తెట్టు సయ్యద్ సుల్తాన్ బీబీ దర్గా దగ్గర టెంకాయ కోటి అమ్మవారిని వేడుకున్ని ముస్లింలతో కలసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెట్టులో ఆయనను గుర్రంపై ఊరేగించి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రవేశ పెట్టి అమలుపరిచే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అంధకారంగా మరిందని, జగన్ కనుసన్నల్లో నడిచే బడా నాయకులు అక్రమంగా దోచుకొని దాచుకోవడానికి తప్ప ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. గత ఎన్నికలకు ముందు అబద్ధపు వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందే కాక ఈ సారికూడా మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాకపోతే రౌడీరాజ్యం మల్లా రాజ్యమేలుతుందన్నారు. ప్రజలు ఆలోచన చేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. రాబోయే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో కందుకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని, వాటివల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం తీసుకుని వచ్చిన ఏషియన్ పల్ప్ అండ్ పేపర్ పరిశ్రమను ఈ ప్రభుత్వం తరిమివేయకుండా ఉంటే వేలాదిమందికి ఉపాధి అవకాశాలు రావటమే గాక ఈ ప్రాంతంలోని రైతులకు ఎంతో మేలుజరిగేదన్నారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తన సేవాకార్యక్రమాలతో ఎంతో మంచిపేరు తెచ్చుకున్నారని, భవిష్యత్తులో ఆయన సేవలు మనకు కూడా అందుతాయన్నారు. ఎంపీగా వేమిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, చెరుకూరి సూర్యనారాయణ, కావలి ఏసుదాస్, ఎస్‌కే రంతుల్లా, ఎస్‌కే బాబు, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, దారా వెంకట్రావు, కాలేషా, నేలకూరి కొండయ్య, మర్రిబోయిన వెంకటేశ్వర్లు, గొత్తల మురళి, కుందుర్తి పోతురాజు, మద్దసాని వెంకటేశ్వర్లు, ఎస్. కే పెదబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెట్టు గ్రామానికి చెందిన షేక్ బుడేసాహెబ్, కత్తుల నరసింహం తదితరులు నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంపై అసంతృప్తితో ప్రతిరోజు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతు ప్రకటిస్తూ ఆయన సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. ఆదివారం వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరారు. మండలంలోని పందలపాడుకు చెందిన వైసీపీ సీనియర్ నేత కంజుల వెంకటరామిరెడ్డితో పాటు ఆయన ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.

● ఉలవపాడు మండలం పెద్దపల్లెపాలెం నుంచి వెయ్యాల అశోక్, గ్రామకాపు వెయ్యాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అప్పాడి వెంకటేశ్వర్లు, పొన్నాడి వెంకటేశ్వర్లు, పొన్నాడి బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, చింతా చిన్నవెంకటేశ్వర్లు, అయిల శేషయ్య, వెంకటేశ్వర్లు తదితర కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఉలవపాడు మండలంలోని చాకిచర్ల పంచాయతీ నుంచి సుదర్శి సాంబయ్య ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీవాసులు అధికసంఖ్యలో టీడీపీలో చేరారు. లింగసముద్రం మండలం రాళ్లపాడు గ్రామానికి చెందిన పది ఎస్సీ కుటుంబాల వారు నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లపల్లి వెంకటేశ్వర్లు, తాళ్లూరి ముసలయ్య, మిరియం మల్లిఖార్జున, ఎండోటి శ్రీను, సుదర్శి శ్రీను, నార్ని రోశయ్య, కూనం సుబ్బారెడ్డి, గుళ్లా శ్రీనివాసులు, ఎస్వీ సుబ్బారావు, గోచిపాతల మోషే, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రావెళ్ల వెంకటేశ్వర్లు, రావుల రవి, భైరపనేని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు మండలం విక్కిరాలపేటకు చెందిన పలు కుటుంబాల వారు నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ నాయకుడు గంగవరపు రవి ఆధ్వర్యంలో పంచాయతీ ఉపసర్పంచు ఎండ్లూరి మధు, ఎండ్లూరి సురేంద్ర, ఎండ్లూరి బాలకృష్ణలతో పాటు 15 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు మన్నం శ్రీనివాసులు, గంగవరపు బ్రహ్మయ్య, మన్నం శ్రీను, కొత్తపల్లి సుధాకర్, గంగవరపు నారాయణ, మన్నం శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య ప్రచారం

కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతుగా ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య ఆదివారం పట్టణంలోని 15వ వార్డు ఖాజీపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో ముస్లింల అభ్యున్నతికి పాటుపడతామని వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


గుడ్లూరు : ఇంటూరికి హారతులు పడుతున్న మహిళ

బోగోలులో టీడీపీ నేతల ప్రచారం

బిట్రగుంట, ఏప్రిల్ 28: బోగోలు మండలంలో ఆదివారం టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ నాగేశ్వరావు ఆధ్వర్యంలో కప్పరాళ్లతిప్ప, బౌడన్‌పేట గ్రామాల్లో జరిగిన ఇంటింటి ప్రచారంలో కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎస్.దావీదు, టీ.హరిబాబు, ఎహెజికేల్, మనోహర్‌ల ఆధ్వర్యంలో బొచ్చు రాముతో పాటు అతని అనుచరులు 150 మందికి పైగా టీడీపీలో చేరారు. వారికి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేనల కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించి చంద్రబాబును సీఎంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకటేశ్వర్లురెడ్డి, సుధీర్‌బాబు, తిరుమలేష్, మాధవరావు, వరప్రసాద్, రంగారావు, క్రాంతి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

బిట్రగుంట, ఏప్రిల్ 28: ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాకర్స్ మాజీ అధ్యక్షుడు శశికుమార్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు ఎం.స్వర్ణన్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వాకర్స్ సభ్యుడు చీకుర్తి మధు మృతికి సంతాపం తెలియ చేస్తు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడ ఏకే.సుందర్‌రాజ్, సత్యనారాయణచార్యులు, జిలానీ బాషా, జనార్దన్, శ్యాంసుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో టీడీపీ అభ్యర్థుల భేటీ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 28 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో ఆ పార్టీ అభ్యర్థులు, ముఖ్య నాయకులు బుచ్చిలోని కేవీఆర్ కల్యాణమండపంలో భేటీ అయ్యారు. శనివారం రాత్రి బుచ్చిలో సభ అనంతరం చంద్రబాబు ఇక్కడ బస చేశారు. ఆదివారం ఉదయం టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, టీడీపీ నేతలు బీద రవిచంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలతోపాటు బీజేపీ, జనసేన నాయకులు తదితరులు కలిశారు. పలు సమస్యలపై చంద్రబాబుకు వినతిపత్రాలు అందజేశారు. కనిగిరి రిజర్వాయర్ కరకట్టల్లో రూ.200 కోట్ల విలువైన గ్రావెల్‌ను వైసీపీ నాయకులు కొల్లగొట్టారని బీజేపీ నాయకులు చంద్రబాబుకు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు బాబుతోనే సాధ్యం

అల్లూరు, ఏప్రిల్ 28 : ఉపాధి లేక గతి తప్పుతున్న యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఆదివారం మండలంలోని సింగపేటలో బండి అమర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు చందన్‌రెడ్డి, జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ నాయకుడు సుందరరామిరెడ్డిలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నార్తుమోపూరులో నెల్లూరు నిరంజన్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి ఇంటింటా తిరిగి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సుధాకర్‌రెడ్డి, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతకు 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యం

లింగసముద్రం, ఏప్రిల్ 28 : రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు సాగుతున్నారని టీడీపీ నేత గొర్రెపాటి సాంబయ్య, కందుకూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్‌రసూల్ చెప్పారు. ఆదివారం రాత్రి మండలంలోని పెదపవనిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి మాలకొండయ్య, షేక్ రఫీ, దనుం మధు, షేక్ కరీముల్లా, పఠాన్ హిదయతుల్లా, పందల వినయ్, ఎస్ కొండలరావు, ఎస్ రాఘవేంద్ర, రాజారత్నం, జనసేన నాయకులు ఎస్ మనోహర్, దినేష్ ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాకమళ్లవారిపాలెం వాసులు టీడీపీలో చేరిక

లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారిపాలెంలోని వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు నేతలు ఉప్పతి బాబురెడ్డి, మునగల నారపరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన బాబురెడ్డి, నారపరెడ్డి, మన్నెం బసిరెడ్డి, అంబవరపు గోపాలరెడ్డి, మన్నెం ఆదినారాయణరెడ్డి, కొరివి ఆదినారాయణరెడ్డి, అంబవరపు లక్ష్మీనారాయణ, సిద్ధమూర్తి సుధాకర్, రామచంద్రయ్య, మన్నెం మాల్యాద్రి, మాలకొండయ్య, కొరివి శ్రీనివాసులురెడ్డి, వెంకట్రాములు, పోకల కొండయ్య, అశోక్‌కుమార్, మన్నెం వెంకటేశ్వర్లు, పుల్లయ్య, పంగా వెంకటనర్సయ్య, భైరెడ్డి బ్రహ్మారెడ్డి, అంబవరపు మాలకొండయ్యకు వేమిరెడ్డి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వీరి చేరికతో వాకమళ్లవారిపాలెంలో వైసీపీకి భారీ షాక్ తగిలినట్లైంది. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు తెలిపారు.


వేమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వాకమళ్లవారిపాలెం వాసులు

కాంగ్రెస్ నేతల ప్రచారం

లింగసముద్రం, ఏప్రిల్ 28 : నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కొప్పుల రాజు, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి సయ్యద్ గౌస్ మొహిద్దీన్‌లను గెలిపించాలని కోరుతూ ఆదివారం లింగసముద్రంలో కాంగ్రెస్, సీపీఎంల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనం అంజయ్య, మస్తాన్, హిమాంవలి, హమీద్, సాధు చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెల మృతి



కొండాపురం, ఏప్రిల్ 28: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని తూర్పుబ్రాహ్మణపల్లిలో జరిగింది. వివరాల మేరకు.. చింతలదీవి పంచాయతీ తూర్పుబ్రాహ్మణపల్లిలో బొచ్చు బ్రహ్మయ్యకు చెందిన ఒక గేదె కడియంపాటి సుగుణమ్మకు చెందిన ఒక గేదె మేతకు పొలాలకు వెళ్లి నీరు తాగేందుకు స్థానిక ఉప్పుటేరు వద్దకు వెళ్లాయి. అక్కడ 11 కేవీ విద్యుత్‌లైను కిందకువాలి ఉండటంతో గేదెలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించి మిగిలిన గేదెలను పక్కకు తోలడంతో పెద్దప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు. ఈప్రమాదంలో మృతిచెందిన గేదెలు దాదాపు రూ 1.5 లక్ష వరకు విలువ చేస్తాయని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఒమే.. లచ్చిమీ జగనాలు సేతులెత్తేశాడు !

• పించన్ పెంచేది నాలుగేళ్లకంట • అదీ రెండొందల యాభైయేనంట...

ఒమే లచ్చిమీ జగనాలు చేతులెత్తేశాడు.. ఏందిమే ఎంకమ్మా నువ్వు అనేది... నాకు అర్ధమే కాలేదుమే... నువ్వు టీవీ సూడ్లే... సూడలేదుమే... ఏంది సెప్పరాదా... ఇప్పుడు ఓట్లెచ్చన్లు జరగుతుల్లే.. అందుకు నేను మళ్లా సీఎం అయితే ఏమేమి సేస్తాడో సెప్పాడే... ఏమి సెప్పిండు ఎంకమ్మ... అదేనే మనకి ఇప్పుడు నెలనెలా ఇచ్చే మూడేల పింఛను ఇంకో మూడేళ్లు మూడేలేనంట... మూడేళ్ల తర్వాత నాలుగో పేడు అంటే 2028లో రెండొందలయాభై పెంచతాడంట... ఆ మరుసటి ఏడాది ఇంకొక రెండందల యాభై పెంచి మూడేలైదొందలు సేస్తాడం టమే.. ఇదేంది మే ఎంకమ్మా కొంపముంచాడే జగనాలు... సెందరబాబు సీఎం అవగానే నాలుగేలు సేస్తానన్నే... అదీ ఈ నెలతోటి లెక్కంటగదమే... అదే అచ్చప్పా నేను సేప్పేది... జగనాలు సేతులెత్తాడని గదా నేను అనింది... ఊరికినే అన్నానంటమే... నీ పాసుగాల ఇదేందిమే ఇది సెందరబాబు నాలుగేలంటే జగనాలు ఐదేలంటాడనుకుంటే... మూడేలే అంటే ఎట్టమే.. ఎంకమ్మ ఎక్కడ సెప్పాడుమే... అమరావతిలో అంట ఆయన ఇంట్లో ఈ రోజు మళ్లా సీఎం ఐతే ఇది సేస్తా... అది సేస్తా పెజలకి అని సెప్పాడుమే... ఇంకేమి సెప్పాడు ఎంకమ్మా... అదే సదువుకేనూ పిలకాయలకి ఇంటికొకరికి పదమూడువేలిస్తున్నిల్లే అది పదేనేలు సేస్తానన్నాడు... అదేందిమే సెందరబాబు ఇంట్లో ఎంతమంది పిలకాయలు సదువుకుంటే అంతమందికీ ఒక్కొక్కరికి పదేనేలుల ఏస్తానన్నే... అదేనే నేను ఎందుకు సెప్పినాననుకుంటున్నావా... జగనాలు సేతులెత్తేశాడనే ఇందుకే లచ్చప్పా... ఒమే ఏందిమే ఇదా... ఇట్టా ఎందుకు సెప్పాడుమే... డబ్బులు లేవంట... అందుకంటమే... మరి సెందరబాబు ఎట్టిస్తానన్నాడుమే.. డబ్బులేకపోతే... సెందరబాబు కంప్యూటరు కంపెనీలు... కార్లకంపెనీలు లాంటివి ఇక్కడి తెప్పించి డబ్బులు సంపాయిస్తాడంటమే.. ఆ డబ్బులు మనలాంటి పేదోళ్ళకి పంచతాడంట... అదేమే మొన్న టీడీపోళ్ల మా ఇంట్లో ఒక కాగితం ఇచ్చారుమే... అది నా మనవడి చేత సదివిచ్చా... ఏందో సంవచ్చరానికి మూడు గేసు సిలిండర్లంట... ఎర్రబస్సెక్కితే ఆడోళ్ళు డబ్బులు ఇయ్యబల్లేదంట... మా కోడలు వయసోళ్ళకి నెలకి పదేనొందలు ఇస్తారంట కదమే... అవునే లచ్చప్పా... దాని పేరేందో నాకు నోరుతిరగలేదే... ఉండే మా మనవడిని పిలిసి అడగతా ఉండు.. ఒరే మనవడా ఇట్రా... ఏందవ్వా... మొన్న టీడీపోళ్ల మనింట్లో కాగితమిచ్చారు కద నాయనా... దాని పేరేంటి... ఓ అదా బాబుష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ అవ్వా... అదేనే దాంట్లో ఇయ్యన్నీ రాసున్నాయే మా మనవడు సదివితే ఇన్నా... అయితే ఏంది మందల ఎంకమ్మ... అదేనే జగనాలు సెప్పింది ఏమీ నచ్చలేదే... ఈ సారి ఓట్లెలచ్చన్లో మనకి మేలు చేస్తానని సెపతుండాడుకదా... అందుకే లచ్చప్పా... నేనైతే సెందరబాబుకే ఓటేద్దామనుకుంటున్నానే... అంతేకదంటే ఎంకమ్మ నాలుగేళ్ళకి రెండొందల యాభై పించిను పెంచేదేంటే మరీను ఉప్పుపొప్పు పెరిగిపోయి మనలాంటి ముసలోళ్లకు ఇళ్లు గడిసేదే కట్టంగా ఉంటే... నేను కూడా నా ఓటు సైకిలికేస్తానే ఎంకమ్మా... జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో ఓ ఇంటి ముందు అరుగు పై చేతి కర్ర ఊతతో ఉన్న ఇద్దరు వృద్ధ మహిళల మధ్య జరిగిన చర్చ ఇది.

- జలదంకి



పెద్దలమాట

మాటిస్తే.. ఓటేసేవాళ్లం !



అప్పట్లో మాట ఇచ్చిన వారికే ఓటు వేసేవాళ్లం. 83 ఏళ్ల వయసులో ఈ సారీ కూడా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నా. అప్పట్లో ప్రచారం తక్కువే. గ్రామానికి ఒకరు వచ్చి చెప్పి వెళ్లేవారు. డబ్బుల పంపిణీ ఉండేది కాదు. ఎన్నికల్లో ఘర్షణల్లేవు. మనస్పర్థలు లేవు. నడుచుకుంటూ వెళ్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వచ్చేవాళ్లం.

- ఎండీ ఉస్మాన్‌అలీ, రిటైర్డ్ పీఈటీ, ఉదయగిరి రూరల్

సిరాకో చరిత్ర !

తెలుసుకుందాం

పోలింగ్‌రోజు ఓటు వేశామని తెలియచేసేందుకు గుర్తుగా ఎడమ చేతివేలి గోరుపై సిరా గుర్తు పెడతారు. ఒకసారి ఓటు వేసిన వ్యక్తి మరోసారి ఎక్కడా ఓటు వేయడానికి అవకాశం లేకుండా ఈ సిరా గుర్తు పనిచేస్తుంది. వారం పది రోజుల వరకు ఇది చెరగకుండా ఉంటుంది. ఇందుకు కారణం 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడమే. కర్ణాటకరాష్ట్రంలోని మైసూర్‌లో ఈ సిరాను తయారు చేస్తారు. మైసూర్ మహారాజ్ నల్వాడి కృష్ణవడయార్ స్థాపించిన సిరా కర్మాగారాన్ని తరువాత ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. తొలిసారిగా 1962 ఎన్నికల్లో ఈ సిరాను వినియోగించగా ఫలితాలు మెరుగ్గా వచ్చాయి. అప్పట్నుంచి ప్రతి ఎన్నికల్లో ఈ సిరాను వినియోగిస్తున్నారు.

- ఉదయగిరిరూరల్



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

నెల్లూరు జన కేతనం

ధరల దరువు.. బతుకు బరువు


• ధరల పెరుగుదలపై సామాన్యుల రుసరుసలు
• ఐదేళ్లలో ఆకాశాన్నంటిన నిత్యావసరాలు
• 2019తో పోల్చితే ఏటా రూ.800 కోట్ల భారం
• జగనన్న పాలనలో ఏం కొని.. ఏం తింటాం !

సీఎం జగన్ ఎన్ని సార్లు బటన్ నొక్కినా పేద, మధ్యతరగతి కుటుంబాలు బతుకు బండి లాగడానికి ఎంతో ఆయాసపడుతున్నాయంటే... ? అందుకు ప్రధాన కారణం పెరిగిన నిత్యావసరాల ధరలే. కంటికి కనిపించని విధంగా, పెద్దనష్టంగా భావించని విధంగా ప్రతి కుటుంబంపై ఉప్పు..పప్పు.. బియ్యం.. బెల్లం.. కొనుగోళ్లలో నెలకు వెయ్యి రూపాయల వరకు అదనపు భారం పడింది. జిల్లా మొత్తంపై ఈ భారాన్ని లెక్కకడితే ఏటా రూ. 800 కోట్ల అదనపుభారం జనంపై పడింది. ఈ ఐదేళ్ల కాలంలో రూ. 4వేల కోట్ల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 8లక్షల కటుంబాలు ఉన్నాయి. అన్ని కుటుంబాల పరిస్థితి కూడా ఇంతే. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి కుటుంబంపై ఈ ధరల పీడన ఒకేలా కొనసాగుతుంది. ప్రతి కుటుంబంపై సభ్యుల సంఖ్య ఆధారంగా ఏడాదికి రూ. 10 నుంచి రూ.15వేల వరకు అదనపు భారం పడింది. ఈ లెక్కన 2019- 2024కు పెరిగిన నిత్యావసరాల ధరల రూపంలో జిల్లా పరిధిలోని మొత్తం కుటుంబాలపై పడిన భారం లెక్కకడితే సుమారుగా ఏడాదికి (రూ.10వేలు చొప్పున) 800 కోట్ల రూపాయలు పెరిగిన ధరల రూపంలో ప్రజల నష్టపోయారు. ఈ ఐదేళ్ల కాలానికి లెక్కకడితే ధరల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రజలు సుమారుగా రూ. 4వేల కోట్ల వరకు అదనపు భారం మోయాల్సి వచ్చింది.

● ఓనుగంటి కిషోర్. ఇతనిది మధ్యతరగతి కుటుంబం. నెల్లూరు బాలాజీనగర్‌లో ఉంటున్నాడు. అమ్మా, నాన్న, భార్యతో కలిపి మొత్తం నలుగురు సభ్యులున్నారు. 2019 ధరలతో పోల్చితే నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అంటున్నాడు. నెలకు పది వేల వరకు అదనపు ఖర్చు అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. పెరిగిన తన కుటుంబ వ్యయాన్ని ఇలా లెక్కకట్టి వివరించాడు. కుటుంబానికి నెలకు 30 కిలోల బియ్యం అవసరం. 2019లో సోనా మసూరా కిలో రూ.47. ఇప్పుడు రూ. 60. ఒక్క బియ్యంపైనే రూ. 490 పెరిగింది. నెలకు కిలో కందిపప్పు వినియోగిస్తారు. 2019లో కిలో రూ. 87. ఇప్పుడు 180. తేడా 93 రూపాయలు. శనగపప్పు కిలో ధర అప్పట్లో 69 రూపాయలు. ఇప్పుడు రూ. 103. నెలకు 500 గ్రాములు వాడుతారు. దీనిపై రూ. 18లు అదనపు భారం. పెసరపప్పు అర కిలో. అప్పటికి ఇప్పటికి దీనిపై అదనపు భారం రూ. 20. మినపప్పు నెలకు కిలో. అప్పట్లో కిలో రూ.80. ఇప్పుడు రూ. 133. దీనిపై అదనపు భారం 57 రూపాయలు. పల్లీలు అప్పట్లో కిలో రూ. 80. ఇప్పుడు రూ. 137. నెల అవసరం కిలో. దానిపై అదనపు భారం రూ.50. ఉల్లి అప్పట్లో రూ.16. ఇప్పుడు రూ.30. నెలకు ఐదు కిలోలకు 75రూపాయలు అదనపు భారం. వేరుశనగనూనె అప్పుడు రూ.112. ఇప్పుడు రూ. 175. నెలకు ఖర్చు రెండు లీటర్లు. దీనిపై భారం 126రూపాయలు. చింతపండు అప్పుడు రూ. 113. ఇప్పుడు రూ.215. నెలకు అర కిలో అవసరం. దీనిపై అదనపు భారం రూ.40లు. చక్కెరపై అదనపు భారం మరో 15 రూ పాయలు. 2019కి ఇప్పటికి పెరిగిన ధరల ప్రకారం ఆ కుటుంబ ఆహార సరుకు లపై నెలకు పడిన అదనపు భారం 858 రూపాయలు. సంవత్సరానికి రూ. 10,300.



కిలో	2019లో ధర రూపాయల్లో	2024లో ధర రూపాయల్లో
సోనామసూరి	47	60
కందిపప్పు	87	180
శనగపప్పు	69	103
పెసరపప్పు	87	123
మినపప్పు	80	137
పల్లీలు	80	133
ఉల్లిపాయలు	16	30
వేరుశనగ నూనె	112	175
పామాయిల్	68	103
సన్‌ఫ్లవర్ ఆయిల్	90	120
చింతపండు	133	215
పంచదార	39	46
బెల్లం	48	65

ఏం కొనేటట్టులేదు..



ఇప్పట్లో డబ్బులకు తగ్గట్టు సరుకులు రావడం లేదు. ఏం కొనాలన్నా భయమేస్తుంది. ధరల దెబ్బకి దిమ్మతిరిగిపోతుంది. అంగట్లో సరుకుల ధరలు రోజురోజుకు పెంచుకుంటూ పోతున్నారే తప్ప వాటిని తగ్గించే వారే కనిపించడం లేదు. ఇలాగైతే ఏం తినాలి..? ఎలా బతకాలి...?

- మల్లి జయమ్మ, వావిలేటిపాడు

నిత్యావసరాల ధరలు పైపైకి... సామాన్యుల జీవనం ఎలా ?



నిత్యావసరాల ధరలు పైపైకి పోవటంతో సామాన్య కుటుంబాలు జీవనం సాగించడం కష్టంగా మారింది. కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు, వేరుశనగపప్పుల ధరలు ఇటీవల కిలోకు రూ.10 నుంచి రూ.20ల వరకు పెరిగాయి. గతంలో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై కందిపప్పు ఇస్తుండటంతో సామాన్యులకు కొంత వెసులు బాటు ఉండేది. కానీ ఇప్పుడు కందిపప్పు ఇవ్వకపోవటంతో మండుతున్న ధరలకు పప్పులు కొని కుటుంబ జీవనం సాగించటం ఎంతో భారమైంది.

- మాదాల గోవిందమ్మ, ఇందిరమ్మ కాలనీ, కావలి

ఇంతటి ధరలు నేనెప్పుడూ చూడలేదు...



నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. భారమైనా భరించక తప్పడంలేదు. నా జీవితంలో ఇంతటి ధరలు మునుపెన్నడూ చూడలేదు. కూలీనాలీ చేసుకుని బతికేటోళ్లం. మునుపు రూ.1,500లకు నెల సరుకులు వచ్చే యి. నేడు రూ.4000కు పైగా ఖర్చు అవుతుంది. బియ్యంబస్తా రూ.700 ఉండేది. నేడు రూ.1300 పలుకుతోంది. చింతపండు, ఉప్పు, పప్పు, నూనె, పప్పుదినుసులు, కూరగాయలు ధరలు పేదలకు అందుబాటులో లేవు. చేసేదిలేక సరుకుల కొనుగోళ్లు తగ్గించుకుని పొదుపుగా వాడుకుంటున్నాం.

- పీ ఎస్తారమ్మ, ముసునూరు, కావలి

నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరిగాయి



ఇంట్లోకి వాడుకునే నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఏదీ ఎప్పుడు పెరుగుతుందో కూడా అర్థం కావడం లేదు. సరు కుల కోసం దుకాణానికి వెళ్తే అన్నీ పెరిగిన ధరలే కనిపిస్తున్నాయి. ఒక్కటి కూడా తగ్గినట్లు ఈ మధ్య కాలంలో నేను చూడలేదు.

-ఈగ చెంచమ్మ, ధనలక్ష్మీపురం

ప్రభుత్వం విఫలం..



నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైయింది. అందుకు ధరలు పెరుగుదలే నిదర్శనం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు, నూనెను ప్రభుత్వమే రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.

- సురేష్, సీఐటీయూ నాయుకులు, సంగం

ధరలు నియంత్రించాలి




పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వమే నియంత్రించాలి. సామాన్యులకు అందనంత ఎత్తుకు ధర లు పెరిగాయి. ధరలు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- పెంచలమ్మ, గృహిణి, సంగం

జాబితాల్లో పేర్లున్నా... జాడ లేని ఓటర్లు

• ఆచూకీ కోసం నేతల అగచాట్లు

ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నా, స్థానికంగా వారు కనిపించకపోవడంతో ఆచూకీ కోసం ప్రధాన రాజకీయపార్టీల నేతలు అగచాట్లు పడుతున్నారు. ఆయా పార్టీలలోని వార్డు ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్ల ద్వారా కావలిలో ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. జాబితాలో ఉన్న ఓటర్లు స్థానికంగా ఎంత మంది ఉన్నారు... ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఉన్నారు... వారిని ఎలా రప్పించాలి..? తదితర అంశాలపై దృష్టి పెట్టారు. పలు వార్డుల్లో 50 నుంచి 100 మంది వరకు వలస ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. గతంలో బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడ వారి ఓట్లను చేర్చాలని అధికారులు చెప్పినా, అది అమలు కాలేదు. అయితే అలాంటి ఓటర్లకు బీఎల్వోలు స్లిప్‌లు ఎలా ఇస్తారో అంతుబట్టడం లేదు. అయితే ఇందువల్ల అసలు ఓటర్ల స్థానంలో దొంగ ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఇతర రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్న వలస ఓటర్లను రప్పించేందుకు లింగసముద్రంలోని రాజకీయ నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలెట్టారు.ఇందుకోసం మండలంలోని గ్రామాల నేతలను లింగసముద్రంలోని పార్టీ కార్యాలయానికి రప్పించి తాజా ఓటర్ల జాబితాలో ఉన్న వలస ఓటర్లను గుర్తిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్‌లలో ఉన్న వలస ఓటర్లతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వడ్డీ వ్యాపారానికి వెళ్లిన వారిని కూడా రప్పించేందుకు జాబితా ను సిద్ధం చేస్తున్నారు. వారికి వీలైతే బస్సులు ఏర్పా టు చేయడం కానీ, లేదా ఫోన్లు చేసి, ఫోన్‌పే ద్వారా రానుపోను, ఖర్చులకు డబ్బులు పంపించి రప్పించేం దుకు ప్రయత్నాలు మొదలెట్టారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వలస ఓట్లకు ప్రాధాన్యం ఏర్పడింది.



- కావలి/ లింగసముద్రం

ప్రచారంలో అభ్యర్థులు, నేతల ఆపసోపాలు

తిరగకుంటే జరిగే నష్టాన్ని తలుచుకొని ఒకటే పరుగులు

ఎన్నికల ప్రచారం పూర్తిచేసేందుకు సమయం దగ్గర పడుతోంది. ఏ గ్రామంలో పర్యటించకుంటే అక్కడ పరిస్థితి ఎలా మారుతుందో నని అభ్యర్థులు ఆయా గ్రామాలకు పర్యటన ఖరారు చేస్తున్నారు. మరో వైపు ఎండలు రోజు రోజుకు విజృంభిస్తున్నా యి. అయినా సరే తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామాల పర్యటనను ముమ్మరం చేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన కార్యకర్తలు చెప్పిన సమయానికే వెళ్లాల్సి వస్తున్నది. రాత్రివేళ ప్రచారం చేద్దామంటే 10 గంటలు దాటాక నిబంధనలు అంగీకరించవు. దీంతో 9.30గంటలకే పర్యటనలు ముగించాలి. పగలు ప్రచారమంటే ఎండదెబ్బకు అభ్యర్థులు హడలిపోతున్నారు. ప్రచార వాహనాలు, ఓపెన్‌టాపు జీబులు కావడంతో ఎండతీవ్రతకు అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. ఏ గ్రామానికి ప్రచారానికి వెళ్లినా మహిళలు తిలకం దిద్దుతూ మంగళహారతులు ఇస్తున్నారు. దీంతో ఎండవేడికితోడు మంటను ఓర్చుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. మధ్యాహ్నం ప్రచారానికి పార్టీ కార్యక్రమాల్లో కానీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ కనిపించడం లేదు. సాయంత్రం 4గంటలు దాటాక మాత్రమే పర్యటనలు ప్రారంభిస్తున్నారు.

- ఆత్మకూరు

బాబోయ్. సెగలు



అటు మండే ఎండ.. ఇటు రాజకీయ వేడి !



అల్లా దయ ఉందే... విజయం వెన్నంటే !

సెంటిమెంట్

పార్టీ ఏదైనా.. అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల వేళ ఆ దర్గాలో ప్రార్థనలు చేయాల్సిందే. అదేమంటే సెంటిమెంట్ అంటారు. ఉదయగిరి పాత పంచాయతీ బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సావలి దర్గా సెంటిమెంట్ దర్గాగా పేరుగాంచింది. కులమతాలకతీతంగా ఆయా పార్టీల అభ్యర్థులు ఇక్కడ ప్రార్థనలు చేసిన అనంతరం నామినేషన్ వేస్తారు. తాజాగా టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, తదితరులు ఇక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశాకే నామినేషన్ దాఖలు చేశారు. ఆయా పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కూడా విజయం సాధించాలని, పదవులు దక్కాలని ఈ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

- ఉదయగిరి రూరల్

పెద్ద నోటు.. ఈసారి లోటు !

డబ్బుకు లోకం దాసోహం

ఎన్నికలు వచ్చాయంటే నగదు, మద్యానిదే కీలకపాత్ర. నోటిఫికేషన్ మొదల పోలింగ్ కేంద్రానికి వెళ్లే వరకు ఈ రెండే ప్రభావం చూపుతాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా, ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం ఎంతో ఉంది. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులు ఇవి. అభ్యర్థుల అదృష్టమో, ఓటరు దురదృష్టమో తెలియదు కానీ.. ఈసారి ఎన్నికల్లో పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 ఎన్నికల్లో పెద్ద నోటు (వేయి నోటు) రాజ్యమేలింది. ఆ తరువాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు కనిపించలేదు. 2019 ఎన్నికల నాటికి రూ.2000 నోటు వచ్చింది. ఇప్పుడు అదీ కనిపించలేదు. జేబులోకి చేయి పెడితే రూ.500 నోటు లేదా రూ.200 నోటు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఒకటో రెండో అలాంటి నోట్లు ఇచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు బావురమంటున్నారు.

- ఉదయగిరి

